Pubilshed from Eluru

PRGI NO : APTEL/25/A1219

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు


Prajabhoomi Telugu Daily


www.prajabhoomi.com




ఏలురు ELURU | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 208 Issue No : 208 | శనివారం Saturday | జూలై 11, 2026 11 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana






# విధ్వంసం..విధ్వంసం..విధ్వంసం

## ఏది విధ్వంసం..

# ఎవరిది విధ్వంసం..?


» విధ్వంసం రూపం మార్చుకుందా..మలువు తిరిగిందా.. » వైఎస్ జగన్ పై పుస్తకమే ప్రచురించితిరి.. » ఆ ఐదేళ్ల పాలనంత అరాచకంగా అభివర్ణించితిరి.. » అందుకే ఆయనకు ప్రజల ఆదరణ కరువైంది.. » పుస్తక ఫలం ప్రెస్ అకాడమీ పదవి వచ్చే.. » మీ సిన్సియర్ జర్నలిజం సూపర్.. » మరి నేటి జర్నలిస్టులకు మీరు ఇస్తున్న మార్గదర్శకాలేమిటీ.. » మీ యూనియన్ నాయకులే సమర్ధులా.. » ఏ జిల్లా సభ చూసిన » IJu,Apwuj వారే ఉండాలా.. » రాష్ట్రంలో ఇక జర్నలిస్ట్ సంఘాలు లేవా.. » వైఎస్ జగన్ విధ్వంసం పాలనలో సాక్షి కూడా ఉందిగా.. » అందులో పనిచేస్ వారు యూనియన్ నాయకులుగా ఉండచ్చునా.. » వైసీపీ హయాంలో ఐజేయు సభ్యులదే కీలక పాత్ర.. » కూటమిలోను ఐజేయు నాయకులదే హవ్వా.. » రాష్ట్ర విభజన తర్వాత ఏపీ జర్నలిస్టుల పై తెలంగాణా వారిదే పెత్తనమా.. » ఆంధ్రుల ఆత్మాభిమానం తెలంగాణ వారికి తాకట్టు పెట్టాలా.. » విజయవాడ ప్రెస్ క్లబ్ గబ్బు గబ్బు అవుతూ ఉన్నా.. » తెలంగాణ యూనియన్ చే పీడించబడుతూనే ఉండాలా.. » ఆంధ్రులంతా చేతకాని వారేనా.. » ఏపీ జర్నలిస్ట్ లకు ఒరిగిందేమిటి.. » అలపాటి గారు ఇవన్నీ అక్షర సత్యాలు కాదంటారా...ఔ నంటారా.. » ఓరి ఆంధ్రుడా ఇక నైన ఆలోచన చేయరా.. » విధ్వంసం ఎవరు చేశారు ..ఎవరు చేస్తున్నారు..?





**(రామమోహన్ రెడ్డి)**

విధ్వంసం అంటే ఏదైనా వస్తువును, ఆస్తిని లేదా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా నాశనం చేయడం లేదా పాడు చేయడం. దీనిని సాధారణంగా నాశనం, వినాశనం లేదా పతనం అని పిలుస్తారు.ఇక్కడ ఓ సీనియర్ పాత్రికేయుడు గత వైసీపీ ప్రభుత్వ పరిపాలన తీరుపై,అతి ముఖ్యమైనది ఏమిటంటే వైసిపి అధినేత గెలుపు ఆయన పార్టీ సాధించిన 151 సీట్ల మెజారిటీ కేవలము విభజిత ఆంధ్రప్రదేశ్ విధ్వంసానికేనని గంటా పధంగా చెబుతూ విధ్వంసం అనే పుస్తకాన్ని 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రచురించి అప్పటి మాజీ ముఖ్యమంత్రి, నేటి కూటమి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరించి నవ్యాంధ్రప్రదేశ్ ప్రజల ముందుకు తీసుక రావడం జరిగింది.

2 లో





## జగన్‌కు కట్టప్ప సాక్షి జర్నలిస్ట్ లే..!

» జగన్ విధ్వంస కారుడేనని సమర్ధించింది ఆయన మానస పుత్రులే... » విధ్వంసం పుస్తకంతో బట్టబయలు.. » జగన్మోహనుడా నీ జగతి పబ్లికేషన్స్ ద్రోహం తలపెట్టిందా...!

ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టలేడన్న చందాన వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరాజయానికి ఆయన మానస పుత్రిక జగతి పబ్లికేషన్స్ సాక్షి పత్రిక, సాక్షి మీడియా నే కారణమా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.మరి ఇలా ఎందుకు జరిగిందో వైయస్ జగన్ ఓ సారి ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన

- మిగతా 2లో..



## కరూర్ బాధను ఏ విజయమూ తొలగించలేదు

**తమిళనాడు సిఎం విజయ్**

చెన్నై : కరూర్ ఘటనతో ఏర్పడిన బాధను ఏ విజయమూ తొలగించలేదని తమిళనాడు సిఎం విజయ్ పేర్కొన్నారు. శుక్రవారం కరూర్‌లోని అట్లాస్ గ్రౌండ్‌లో బాధితుల కుటుంబాలకు కారుణ్య ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2025లో కరూర్ తొక్కిస లాట ఘటన తన రాజకీయ ప్రయాణంలో అత్యంత తీవ్రమైన గాయమని అన్నారు.

- మిగతా 2లో..



## స్పెయిన్‌లో కార్చిచ్చు

» 12 మంది మృతి

స్పెయిన్ : దక్షిణ స్పెయిన్‌లోని అల్మెరియాలో కార్చిచ్చు కారణంగా మరో ఆరుగురు బాధితులు కనుగొనబడటంతో మృతుల సంఖ్య 12కు పెరిగిందని అధికారులు శుక్రవారం తెలిపారు." లాస్ గల్లార్డోస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మరో ఆరుగురు మరణించినట్లు నిర్ధారణ కావడంతో, మృతుల సంఖ్య 12కు పెరిగింది,"

- మిగతా 2లో..

## ఏపీకి మరో భారీ పెట్టుబడి?..

### హెచ్‌డీ కొరియా షిప్‌బిల్డింగ్‌తో మంత్రి లోకేశ్ భేటీ

» దక్షిణ కొరియాలో పెట్టుబడుల వేట.. షిప్‌బిల్డింగ్ దిగ్గజం హెచ్‌డీ కోస్‌తో లోకేశ్ భేటీ
» ఏపీలో సముద్ర రవాణా, షిప్ బిల్డింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
» సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టులు, అనుకూల పాలసీలే మా బలమని వివరించిన మంత్రి
» ఏపీలో సైట్ల పరిశీలనకు అంగీకరించిన హెచ్‌డీ కోస్.. రాష్ట్ర పర్యటనకు ఆహ్వానం

కొరియా : ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత నౌకా నిర్మాణ, ఇంజనీరింగ్ సంస్థ హెచ్‌డి కొరియా షిప్‌బిల్డింగ్ & ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్ (హెచ్‌డీ కోస్) ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఏపీలో సముద్ర రవాణా, షిప్‌బిల్డింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కంపెనీ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్విన్ యంగ్‌హూన్, టీమ్ లీడర్ హోంగ్ సున్‌జూన్‌లను లోకేశ్ ఆహ్వానించారు.



ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వివరించారు. "భారత తూర్పు తీరంలో 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతంతో ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ప్రదేశంలో ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఆరు పోర్టులతో పాటు కొత్తగా

వివరాలు 2లో..

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి

» గవర్నర్‌కు బొత్స లేఖ » జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం వేదికను మార్చొద్దన్న బొత్స » విజయనగరం జిల్లాలోనే నిర్వహించాలని గవర్నర్‌కు విన్నపం » విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో నిర్వహించాలనుకోవడం సరికాదని వ్యాఖ్య



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : విజయనగరం జిల్లాలోని జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం వేదికను మార్చాలన్న నిర్ణయంపై ఏపీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో కాకుండా విజయనగరంలోనే నిర్వహించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆయన ఒక లేఖ రాశారు. స్నాతకోత్సవానికి తనను ఆహ్వానించినందుకు గవర్నర్ కు బొత్స ధన్యవాదాలు తెలిపారు. "విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. అలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థకు సంబంధించిన మొట్టమొదటి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో జరపడమే అత్యంత సముచితం.

- మిగతా 2లో..

## నా నోరు మూయించాలంటే.. నన్ను చంపాలి

» బీజేపీపై మమత ఫైర్ » అభిషేక్, మహువా, కల్యాణ్ బెనర్జీలను లక్ష్యంగా చేసుకున్నారని మమత ఆరోపణ » 2026 బెంగాల్ ఎన్నికల్లో » బీజేపీ ఓట్లను దోచుకుని అధికారంలోకి వచ్చిందని విమర్శ » టీఎంసీ నేతల ఫిరాయింపుల మధ్య వీడియో సందేశం విడుదల చేసిన మమత » టీఎంసీకి రాజీనామా చేసిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరిక

పశ్చిమ బెంగాల్ : పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎదుర్కొంటున్న అంతర్గత సంక్షోభం మధ్య ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తన నోరు మూయించాలంటే తనను చంపాల్సిందేనని వ్యాఖ్యానించారు.

4 లో..



## 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు

» సీఎం రేవంత్ » 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
» అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
» పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
» జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్ » కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : 2028 డిసెంబర్‌లో ఎన్నికలు జరగవని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు, పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని అన్నారు. 182 స్థానాల్లో కనీసం 117 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి రెండోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని తాము ముందే చెప్పి చేసి చూపించామని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో శుక్రవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళానికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. కాచుకో చంద్రశేఖర్ రావు.. జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను మళ్లీ మొలకెత్తనివ్వబోమని ప్రజలు సంకల్పించారని, పదేళ్ల రాక్షస పాలనకు ఇప్పటికే ముగింపు పలికారన్నారు.

2 - మిగతా..

# కరూర్ బాధను ఏ విజయమూ తొలగించలేదు

ఒక వ్యక్తి జీవితంలో ఎంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించినా, హృదయంలోని కొన్ని బాధలను, గాయాలను మరచిపోలేరని, అన్నింటికన్నా ఎక్కువగా తనను తీవ్రంగా ప్రభావితం చేసిన బాధ, గాయం కరూర్ ఘటనేనని అన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడమే తన రాష్ట్రవ్యాప్త 'ప్రజా సమావేశం' కార్యక్రమం లక్ష్యమని అన్నారు. జనాలను నియంత్రించడంలో పోలీసులు విఫలమయ్యారని, దీంతో 41మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఈ విషాదానికి సంబంధించి తనపై నిందలు మోపేందుకు అప్పటి డిఎంకె ప్రభుత్వం యత్నించిందని విమర్శించారు. పెరంబలూరులో జనసందోహం కారణంగా తన కార్యక్రమాన్ని రద్దు చేసుకోవాల్సిందిగా పోలీసులు ముందుగా సూచించారని, కానీ కరూర్ విషయంలో అటువంటి హెచ్చరిక జారీ చేయలేదని అన్నారు. నమక్కల్ సమావేశం ముగించుకుని కరూర్‌కు వచ్చే సమయంలో.. పోలీసులు తనకు ఆ విషయాన్ని తెలియజేసి ఉండాల్సిందని అన్నారు. కానీ వారు తనను ఆ కార్యక్రమానికి తీసుకువెళ్లారని, తాను పోలీసులను పూర్తిగా విశ్వసించానని, వారికి కృతజ్ఞతలు కూడా తెలిపానని అన్నారు. కానీ ఇంతటి విషాదం జరుగుతుందని తాను ఊహించలేదని అన్నారు. ఎంతోమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను దు:ఖంలో ఉన్నప్పుడు కూడా 'ఎందుకు పారిపోయి దాక్కున్నావు' అని చాలా మంది ఎగతాళి చేశారని, నిందించారని అన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి గౌరవార్థం కరూర్‌లో ఒక స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. భవిష్యత్ తరాలు ఈ సంఘటనను గుర్తుంచుకునేలా, ఇలాంటి విషాదాలు రాజకీయం కాకుండా నిరోధించేందుకు తమ పార్టీ టివికె నిర్మిస్తుందని అన్నారు.

# ఏపీకి మరో భారీ పెట్టుబడి?..

రాబోతున్న డీప్‌–వాటర్ పోర్టులు, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన పారిశ్రామిక విధానాలు మా రాష్ట్ర ప్రత్యేకతలు" అని ఆయన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా కంపెనీలు తమ ప్రాజెక్టులను అత్యంత వేగంగా ఏర్పాటు చేసుకోవచ్చని లోకేశ్ హామీ ఇచ్చారు. ఇందుకు కియా మోటార్స్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ వంటి కొరియన్ కంపెనీల విజయాలే నిదర్శనమని ఆయన గుర్తుచేశారు. "భారీ పారిశ్రామిక ప్రాజెక్టులను అతి తక్కువ సమయంలో పూర్తిచేసిన చరిత్ర, సామర్థ్యం మా రాష్ట్రానికి ఉన్నాయి. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్‌మిట్టల్ స్టీల్ ప్లాంట్, ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ప్రాజెక్టులు ఇటీవల ఏపీని ఎంచుకున్నాయి. ఇది మా పారిశ్రామిక వాతావరణంపై ప్రపంచ కంపెనీలకు పెరుగుతున్న నమ్మకాన్ని సూచిస్తోంది" అని మంత్రి అన్నారు. దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25% వాటాతో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు.మంత్రి లోకేశ్ ఆహ్వానంపై హెచ్‌డి కోస్ గ్లోబల్ బిజినెస్ డైరెక్టర్ క్విన్ యంగ్‌హూన్ సానుకూలంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ స్థాయి షిప్‌బిల్డింగ్, సముద్ర ఇంజనీరింగ్ ఉపకరణాల తయారీ యూనిట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. "మా సాంకేతిక, లాజిస్టికల్, వాణిజ్య అవసరాలకు అనుగుణంగా సరైన ప్రాంతాలను గుర్తించి మా అధికారులు మీకు తెలియజేస్తారు. దీర్ఘకాలిక అభివృద్ధికి అవసరమైన పారిశ్రామిక వాతావరణాన్ని ఏపీ అందించగలదని మేము విశ్వసిస్తున్నాం" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడిదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా చూసేందుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యేందుకు ఏపీకి రావాల్సిందిగా హెచ్‌డీ కోస్ నాయకత్వాన్ని మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. ఈ సమావేశం విజయవంతం కావడంతో ఏపీ తీరంలో మరో భారీ పెట్టుబడికి మార్గం సుగమమైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.న్నరు.

# 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు

మరోవైపు బీఆర్ఎస్‌లో ఉంటారో లేదో హరీశ్ రావే చెప్పాలి అన్నారు. బీజేపీతో మంతనాలు జరపడం లేదా అని ప్రశ్నించారు. రైతు ఆశీర్వాద సభలో భాగంగా 1.44 లక్షల మంది రైతులకు రూ.1,009 కోట్ల రైతు భరోసా నిధులను సీఎం విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రారంభించాలని బీఆర్ఎస్ నేతలు చేస్తున్న డిమాండ్‌ను ఆయన తప్పుబట్టారు. అలా చేస్తే భద్రాచలం రామాలయం సహా 44 గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అని పేర్కొన్న రేవంత్.. "ఇప్పుడు వైర్లు పట్టుకుంటే కాలి బూడిదైపోతారు" అని వ్యాఖ్యానించారు.

## జేఎన్‌టీయూ స్నాతకోత్సవం విజయనగరంలోనే జరపాలి

ఈ అట్టహాస వేడుకను విజయనగరంలో కాకుండా, విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించాలని అనుకోవడం సరికాదు. ఈ నిర్ణయం వల్ల విజయనగరం జిల్లా ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అక్కడ ఈ వేదిక మార్పుపై తీవ్ర నిరసనలు, తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజల, విద్యార్థుల ఆకాంక్షలు, ఆనందాన్ని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉంది. కాబట్టి, విజయనగరం జిల్లా వాసుల సెంటిమెంట్‌ను పరిగణనలోకి తీసుకుని, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి" అని తన లేఖ ద్వారా బొత్స కోరారు.

# స్పెయిన్‌లో కార్చిచ్చు

అని అండలూసియా ప్రాంతీయ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యుత్ తీగ పడిపోవడంతో, ఎండు వృక్ష సంపదకు నిప్పంటుకుని, ఆ తర్వాత మంటలు చుట్టుపక్కల ఉన్న అటవీ ప్రాంతానికి వేగంగా వ్యాపించి ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు అధికారులకు తెలిపారు. అయితే ఈ అగ్నిప్రమాదానికి గల కారణాన్ని అధికారులు ధ్రువీకరించలేదు. మంటలు వ్యాపించడంతో రోడ్లను మూసివేసి, నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుమారు 50 మందికి ఒక సాంస్కృతిక కేంద్రంలో ఆశ్రయం కల్పించారు. ప్రధాన అత్యవసర పరిస్థితులలో మోహరించే స్పెయిన్ సైనిక అత్యవసర విభాగం (ఖవీజు),రాబోయే గంటల్లో అగ్నిమాపక ప్రయత్నాలలో చేరాల్సి ఉంది. అండలూసియా ప్రాంతీయ ప్రభుత్వ అధిపతి జువాన్మా మోరెనో, మరణించిన ఆరుగురి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, దీనిని "ఒక విషాదం" అని అభివర్ణించారు. "మా హృదయాలు బరువెక్కిపోయాయి, దుఃఖంతో కుంగిపోయాము," అని మోరెనో ఎక్స్ లో పేర్కొన్నారు. స్పెయిన్ తీవ్రమైన వేడిగాలులతో అల్లాడుతున్న సమయంలో ఈ కార్చిచ్చు సంభవించింది. ఇటీవలి రోజుల్లో అండలూసియాలోని కొన్ని ప్రాంతాలలో మండుతున్న ఉష్ణోగ్రతల కారణంగా రెండవ అత్యున్నత స్థాయి అయిన ఆరెంజ్ వాతావరణ హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. ఈ ఏడాది స్పెయిన్ తన చరిత్రలోనే అతిపెద్ద వేసవి కార్చిచ్చు నివారణ చర్యలను చేపడుతుందని ప్రధాన మంత్రి పెడ్రో సాంచెజ్ మే నెలలో తెలిపారు. ఇటీవలి సంవత్సరాలలో స్పెయిన్‌లో ఉష్ణోగ్రతలు తరచుగా 40శీజ దాటి, భారీ కార్చిచ్చులకు అనుకూల పరిస్థితులను కల్పిస్తూ సుదీర్ఘమైన వడగాలులు వీచాయి.

## విధ్వంసం..విధ్వంసం..విధ్వంసం

# ఏది విధ్వంసం..ఎవరిది విధ్వంసం..?

మొదటి పేజీ తరువాయి

ఇందులో వ్యాసకర్త చివరి సందేశం లో చెప్పబడిన కొన్ని అంశాలను పునః సమీక్ష కోసం చూస్తే..151 సీట్లతో అధికారాన్ని వైఎస్ జగన్ సంపూర్ణ అధికారంగా పరిగణించారని ,అది సహజంగా నిరంకుసాధికారం కింద పరినమించదని అన్నారు రచయిత.అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ పై మీడియా సాక్షిగా జగన్ చేసిన వ్యాఖ్యలు జగన్ విధ్వంసానికి మూల కారణమని రచయిత రచనల ద్వారా అనుకోవడం లో తప్పులేదు లార్డ్ ఆక్టన్ అనే మేధావి 135 ఏళ్ల కింద చెప్పిన చెరువు చేయడం జగన్ విషయంలో సంపూర్ణంగా వర్తిస్తుందని చెప్పారు రచయిత.జగన్ అనే వ్యక్తి డబ్బుకోసం అధికారం అధికారం కోసం డబ్బు ఇలా అక్రమార్జన కు ఆయనకు ఆయనే సాటి అని అందుకోసం వ్యవస్థలని ధ్వంసం చేయడం పనిగా పెట్టుకుని పాలన సాగించాడని ,2019 ఎన్నికల తరువాత ఆంధ్రప్రదేశ్ లో భారత రాజ్యాంగ స్ఫూర్తిపై నిరంతరం దాడి ప్రక్రియ అయినదని రచయిత తన తుది పలుకుల లో నిస్పష్టంగా చెప్పడం జరిగింది. ఇందుకు రచయిత గుండె దైర్యాన్ని మెచ్చుకోక తప్పదు.ఎందుకంటే రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ లో విమర్శ అన్న పదం అది సద్విమర్శ కావచ్చు మరి ఏ ఇతరం కావచ్చు ఓర్వలేని స్థితిలో ఉన్న పరిస్థితులలో రచయిత ఒక సీనియర్ జర్నలిస్ట్ అవ్వడం మూలాన ఇలా నేరుగా పుస్తకాలు వేసి ప్రజల ముందు ఉంచడం అనేది ఒక సాహోసాపేతమే నని చెప్పక తప్పదు. అందుకు ఆయన కు ఇన్ని సంవత్సరాల తరువాత శుభాభివందనాలు తెలియ జేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఇంతకీ ఎవరా రచయిత ఇప్పుడెందుకు ఈ ప్రస్తావన, ఇది ముగిసిన అధ్యాయం, ఈ రాష్ట్ర ప్రజలు రచయిత రచించిన విధ్వంసం పుస్తక కారకుడుని ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రక్కన కూర్చోబెట్టారు కదా అని అనుకోవచ్చు.అది నిజమే అయినా ఇక్కడ రచయిత అయిన సీనియర్ పాత్రికేయులు ఆలపాటి సురేశ్ కుమార్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు చర్చించు కోవాల్సిన అవసరం సందర్భం వచ్చిందని చెప్పాలి. ఏమిటయ్యా అంటే ఆలపాటి సురేష్ కుమార్ ప్రస్తుతం శ్రీరాఘవాచారి ప్రెస్ అకాడమీ చైర్మన్ గా ఉన్నారు.ఆయన ప్రెస్ అకాడమీ చైర్మన్ హోదాలో ఈ రాష్ట్రంలో ఉన్న జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, సంక్షేమం కోసం వేసిన వేస్తున్న పెద్ద పీట గురించి నవ్యాంధ్ర ప్రదేశ్ జర్నలిస్ట్ వర్గాలలో జరుగుతున్న చర్చ సందర్భంగా ఇప్పుడు కూడా ప్రస్పుటం చేయక పోతే ప్రెస్ ఆకాడమికి గుర్తింపు కరువుతుందని భావించక తప్పదు. ఇక్కడ ఆలపాటి అద్భుతమైన పాలన్ గురించి చెప్పుకొనే ముందు జర్నలిజం, జర్నలిస్ట్ అంటే ఎవరు ఏమిటీ ఎలా అని తెలుసుకోవాలి.అవన్నీ అందరికి విదితమే అయిన మరొక్కమారు పునశ్చరణ చేసుకోవడం లో తప్పేమీ లేదని భావిస్తూ..

సమాజంలో ఏమి జరుగుతుందో వాస్తవాలను, రుజువులతో సహా ప్రజల ముందు ఉంచడం.ప్రభుత్వాలు, నాయకులు, మరియు సంస్థల పనితీరును ప్రశ్నించడం ద్వారా ప్రజలకు జవాబుదారీతనం ఉండేలా చూడటం.సమకాలీన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, చర్చలకు వేదికగా నిలవడమనేది జర్నలిజమని పెద్దలు తెలిపియున్నారు.

ఇక జర్నలిస్ట్ అంటే ఎలాంటి పక్షపాతం లేకుండా ఉన్నది ఉన్నట్లుగా వార్తలు రాయడం.నైతిక విలువలు: సమాచారాన్ని ధృవీకరించుకున్న తర్వాతే ప్రసారం లేదా ప్రచురణ చేయడం, తప్పుడు వార్తలను ప్రోత్సహించకపోవడం జర్నలిస్ట్ యొక్క లక్షణాలను తెలియజేస్తుంది.

అనాగరికం నుంచి నేటి ఆధునిక యుగం వరకు జర్నలిజం, జర్నలిస్ట్ ల అవతరణ అనేది భిన్నమైన రూపాలను పుణికి పుచ్చు కున్నప్పటికి ఆదరణను కోల్పోలేని పత్రికా రంగం గురించి పత్రికొక్కటున్న పదివేల సైన్యము, పత్రికొక్కటున్న మిత్రకోటి, ప్రజలకు రక్ష లేదు పత్రిక లేనిచో... " అని చెప్పిన పత్రికా సైన్యాధ్యక్షుడు నార్ల వెంకటేశ్వరరావు. పత్రికను పైకి తేవడానికి నార్ల అనేక కొత్త ఒరవడులు ప్రవేశపెట్టారు.

'కాగడా', 'జనవాణి'తో తాపీ ధర్మారావు ప్రారంభించిన వ్యావహారిక భాషా ఉద్యమాన్ని నార్ల ఆంధ్ర ప్రభ, ఆంధ్రజ్యోతి ద్వారా సమర్థంగా కొనసాగించారు. తెలుగులో ఆలోచించి, తెలుగు నుడికారంలో తెలుగుదనం ఉట్టిపడేటట్టు రాయగలిగినప్పుడే తెలుగు వారిలో మనం కదలిక పుట్టించగలం' అని ఆయన తోటి జర్నలిస్టులకు ఉద్బోధించారు. సంపాదకుడు అనే మాటను నార్ల ఉపయోగించేవారు కాదు. ఎడిటర్ అనే రాసుకునే వారు, పిలిపించుకునేవారు. ఎడిటర్ అనే ఇంగ్లీషు మాటకు సంపాదకుడు అనే తెలుగు అనువాదాన్ని ఆయన ఆమోదించలేదు. సంపాదకుడు అంటే ఏమిటో, సంపాదకుడి స్థానం ఏమిటో యాజమాన్యాలకూ, సమాజానికీ తెలియజెప్పడానికి ఆయన శత విధాలుగా ప్రయత్నించారు. ఎడిటరైనవాడు బిడియము చూపుచో ధాటి తగ్గు వృత్తి ధర్మమందు, కడుపుకూటి రాత కక్కుర్తి రాతరా' అంటూ తోటి రచయితలనూ, భావి సంపాదకులనూ హెచ్చరించిన యోధుడు నార్ల. ముఖ్యంగా జర్నలిజం రంగంలోకి అడుగుపెట్టేవారు నిజాయితీగా, నిర్భీతిగా ఉండాలని కోరేవాడు నార్ల. "నిజము కప్పిపుచ్చి నీతిని విడనాడి స్వామి సేవ సేయు జర్నలిస్టు తార్చువాని కంటే తక్కువ వాడురా" అని చెప్పాడు.ఇక్కడ నార్ల అంటే నార్ల వెంకటేశ్వరరావు తెలుగునాట ప్రముఖ పాత్రికేయుడు, హేతువాది, రచయిత. వీ.ఆర్.నార్లగా కూడా వీరు ప్రసిద్ధులు. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికలకు చాలా కాలం సంపాదకులుగా ఉన్నాడు. పత్రికా రచనలే కాక పలు నాటికలు, కవితలు, కొన్ని కథలు రాసాడు. రెండు పర్యాయములు రాజ్యసభ సభ్యునిగా పనిచేశాడు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వంలోని శాసన, కార్యనిర్వాహక, న్యాయ శాఖలతో పాటు మీడియా నాల్గవ స్థానంలో ఉండి బాధ్యతను నిర్ధారిస్తుంది.అందుకే మీడియాను నాలుగో స్తంభంగా పిలువ బడుతుంది.

ఇప్పటి వరకు ఉదహరించిన పై విషయాలన్నింటి ని క్షుణ్ణంగా అవపోషన చేసుకున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఈ రాష్ట్ర జర్నలిస్ట్ లకు చేస్తున్న సేవ, అందిస్తున్న గౌరవం గురించి ఏమనని పొగడాలో అర్థం కాని పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొనడం ఈ రాష్ట్ర జర్నలిస్ట్ లు చేసుకున్న దౌర్భాగ్యమా అని అనడం లో సందేహం అక్కర్లేదు. ఆలపాటి సురేష్ కుమార్ ఒక సీనియర్ జర్నలిస్ట్ అయ్యినప్పటికి ఆయన ఐజేయు అనుబంధం గా ఉంటూ ఈ రాష్ట్రంలో యూనియన్ పేరుతో జర్నలిస్టుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న"ఖాఖౌజీ యూనియన్ నాయకుడి గానే వ్యవహారం ఉందని అనాల్సి రావడం ఎంతో బాధాకరం.

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ అనేది జర్నలిజంలో నైపుణ్యాలను, ప్రమాణాలను పెంచడానికి ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంస్థ. ఇది విజయవాడ కేంద్రంగా పనిచేస్తుంది.ఇలాంటి ప్రెస్ అకాడమి ఎవరి సంక్షేమం కోసం పనిచేస్తోందయ్యా అంటే ప్రస్తుత చైర్మన్ ఆలపాటి మొదటి నుండి కొనసాగుతూ ఉన్న యూనియన్ బలోపేతం కోసమే అన్న మీమాంసకు పరిస్థితి దారితీస్తుంది.ఈ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ కు మాత్రమే సింహభాగం కల్పిస్తూ ఉండడం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటనే ప్రశ్న ఇప్పుడు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.ఈ రాష్ట్రంలో అనేక యూనియన్ లు ఉన్నాయి .అక్రిడేషన్ కమిటీ అర్హత పొందినవి ,సొసైటీ పరంగా గుర్తింపు పొందిన జర్నలిస్ట్ ల యూనియన్ లు ఉన్నాయి.అయితే ఇక్కడ అచ్చర్య కర విషయం ఏమిటంటే ఏదయితే ప్రెస్ అకాడమి చైర్మన్ సింహభాగం కల్పిస్తున్నారో ఆ యూనియన్ ఈ రాష్ట్రం ది కాదు.దానికి ఈ రాష్ట్రంలో గుర్తింపు లేదు.ఆ యూనియన్ పై ఇప్పటికే అనేక కేసులు కోర్టుల లో అపరిష్కృతంగా ఉన్నాయి.మరెన్నో ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి.ఆ యూనియన్ తెలంగాణ నాయకుల కబంధ హస్తాల్లో ఉందనేది అందరికి విదితమే.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి చెందిన తరువాత తెలంగాణ ఉద్యమం తో తెలంగాణ తన్నేస్తే రాజదాని రాష్ట్రంలో నవ్యాంధ్ర ప్రదేశ్ ప్రజలు బ్రతుకు ఉన్నారు ఇప్పటికి తెలంగాణ ప్రజలు అక్కడి రాజకీయ పార్టీల నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై దుమ్మెత్తి పోస్తున్నారు.ఈ యూనియన్ అనుబంధం గా వంగి వంగి దండాలు పెడుతున్న ఐజేయూ నాయకులు తెలంగాణ వారే.వీరందరి ఆధ్వర్యంలో అక్రమంగా తమదే అని గోడలపై అక్షరాలు వేసుకున్న విజయవాడి ప్రెస్ క్లబ్ వ్యవహారం గబ్బు గబ్బు గా ఉందనేది ఆలపాటి లాంటి విజ్ఞులైన వారికి తెలియదా అంటే అచ్చర్యపడాల్సిన పరిస్థితి.ఒక వేళ ఆలపాటి ఆ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేసినా ఆలపాటి మాట ను ఆల కించే వారు అక్కడ ఉన్నారా అన్న ధర్మ సందేహం వ్యక్తం చేస్తున్నారు మెజారిటీ జర్నలిస్ట్ లు.

ఇక పోతే గత ప్రభుత్వం లో ఐజేయు నాయకుడు దేవులపల్లి అమర్ జాతీయ మీడియా సలహదారుడు, కూటమి ప్రభుత్వం లో కూడా ఆయన ఐజేయు నాయకుడే. ఇంకా ఏదయితే ఈ రాష్ట్రం, ఎస్ రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ విధ్వంసం చేశారని పుస్తకం రాస్తే ఆ పుస్తక ఫలం ద్వారా ప్రెస్ అకాడమి చైర్మన్ గా పదవి కట్టబెట్టడం జరిగిందనే ప్రచారం జర్నలిస్ట్ వర్గాలలో ఉన్నా ఆ విధ్వంసం కు కారణమైన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి మానస పుత్రిక సాక్షిలో పనిచేస్తున్న వివిధ హోదాలో ఉన్న జర్నలిస్ట్ లు ఐజేయు, ఏపీయూ డబ్ల్యూ జే లో కీలక పదవుల్లో ఉన్నారనేది అందరికి విదితమే.ఇక అక్రిడేషన్ కమిటీలలో సాక్షి పత్రిక ,సాక్షి ఎలక్ట్రానిక్ మీడియా వారికి చోటు కల్పిస్తే ప్రభుత్వం మొట్టికాయలు వేస్తే మౌఖిక ఆదేశాలతో వారి పేర్లను తొలగించి వేరే వారికే ఇచ్చారనే గుసగుసలు కూడా వినిపించాయన్నది వాస్తవం కాదా అన్న ప్రశ్న జర్నలిస్ట్ వర్గాల నుండి వినిపిస్తోంది

ఇక పోతే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మీడియా మొగల్ అని పిలువబడే రామోజీ రావు స్థాపించిన ప్రింట్,ఎలక్ట్రానిక్, జర్నలిజం ద్వారా పనిచేస్తున్న వందలాది మంది సీనియర్ లు ఉన్నా కేవలము ఆంధ్రజ్యోతి లో పనిచేస్తున్న వారే ఈ రాష్ట్రంలో ఎక్కడ శిక్షణ తరగతులు జరిగిన వారే రావాలి ఆ యూనియన్ నాయకులే స్టేజిపై ఆసీనులై ఉండాలని శ్రీ రాఘవాచారి ప్రెస్ అకాడమి రికార్డుల లో ఏదైనా పొందు పరిచి ఉందా లేక ఈ కూటమి ప్రభుత్వం ప్రత్యేక నియమాలను రూపొందించిందా అన్న భిన్నమైన ప్రశ్నలు జర్నలిస్ట్ వర్గాలు వెళ్ళబుచ్చు తున్నాయి. ఇదే విదంగా ప్రెస్ అకాడమి అనేది స్వయం ప్రతిపత్తి కలిగి ఉన్నప్పటికీ చైర్మన్ కూడా ఏక పక్షంగా కాకుండా జర్నలిస్టుల సంక్షేమం కోసం అన్ని యూనియన్ లకు తగిన గౌరవం ఇవ్వాల్సి ఉండగా కేవలము ఐజేయు,ఏపీయూ డబ్ల్యూజే సంఘ నాయకులు లేనిదే శిక్షణా తరగతులు జరపడం లేదని జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆనిల్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగ దానిపై సమాచార శాఖ డైరెక్టర్ ను విచారణకు ఆదేశించడం కూడా జరిగింది. అలాగే బైలా ప్రకారం ప్రెస్ అకాడమి కౌన్సిల్ సభ్యులు లేకుండా నే ఏక పక్ష నిర్ణయాల తో ముందుకు సాగుతున్నారని ఏపీ ఎంఎఫ్ యూనియన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాడం జరిగింది.

ఇలాంటి విమర్శలు, ఆరోపణలు ప్రెస్ అకాడమి ఎదుర్కొడానికి కారణం కేవలము చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఐజేయు, ఏపీయూ డబ్ల్యూజె యూనియన్ లో ఉన్న నాయకుడి గా వ్యవవహారం ఉండటమే కారణమని సీనియర్ పాత్రికేయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో జగన్ విధ్వంసం పై పుస్తకం రాసి పుస్తక ఫలం పొందిన ఆలపాటి సురేష్ కుమార్ ఐజేయు, దాని అనుబంధ సంస్థ ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు ద్వారా జర్నలిస్ట్ లకు చేస్తున్నది విధ్వంసం కాదా లేక విధ్వంసం రూపం మార్చుకున్నదా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు ఇతర యూనియన్ ల నేతలు.

## జగన్‌కు కట్టప్ప సాక్షి జర్నలిస్ట్ లే..!

మొదటి పేజీ తరువాయి

అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయాలను ఆలస్యంగా నైన వైసీపీ అభిమానులు, సానుభూతి పరులు వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఎందుకు అనాల్సి వస్తుందని అంటే ప్రస్తుత శ్రీరాఘవాచారి ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉండి పరిపాలన చేసిన తీరుపై విధ్వంసం పుస్తక రచనలో "నమోవాకాలు" అనే పేజిలో క్లుప్తంగా వివరాలు ఇవ్వడం జరిగింది.ఆ పేజిలో రచయిత"2019 ప్రారంభం నుంచి 2023 ఆఖరు వరకు ఆంధ్రప్రదేశ్ లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల పై ఒక డాక్యుమెంట్ లాంటి ఈ రచన కోసం నేను ఆచరిత్ర చిత్తు ప్రతుల పైనే ఆదారపడ్డాను.మొదటి నుంచి చివరి వరకు ప్రాథమిక సమాచారానికి మూలం దినపత్రిక లే కాబట్టి నా రాతలకు ఆధారాలు మళ్లీ ప్రత్యేకంగా ఇవ్వడం అవసరం అని భావించాను. ఈ ప్రయత్నానికి చాలా మంది .మిత్రులు చాలా విలువైన సహకారం అందించారు.ఆ చాలామంది లో చాలా మంది నా లాంటి జర్నలిస్ట్ లే. సాక్షితో సహా వివిధ పత్రిక లలో పని పనిచేసిన ,చేస్తున్న జర్నలిస్ట్ లను చాలామందిని చాలా సార్లు వేదించాను.ఎవరు విసుక్కోలేదు. ఓపిగ్గా నా యక్ష ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.వారందరికి,మీడియా వెలువలి మిత్రులకు నేను ఎంతయినా రుణపడి ఉంటాను.ఆ రుణం విలువ లెక్కకు అందేది కాదు .వారందరికి నా నమో వాకాలు"అని రచయిత పేర్కొన్నారు. దీనిని బట్టి వైఎస్ జగన్ తన పాలన ఎంత విధ్వంసకరంగా చేశారో అర్థం చేసుకోవాలా అపార్థం చేసుకోవాలా అన్నది ఆయనకే తెలియాలి.గతంలో మాజీ మంత్రి పెర్నీ నాని కూడా తమ ముఖ్యమంత్రి సీఎంవో నడపడం లో విఫలమైందని చెప్పడం జరిగింది.

అయితే ఓటమి చెందిన తరువాత వైఫల్యాలను పునః సమీక్ష చేసుకోవడం మంచిదే.సాక్షి మీడియా మొత్తం వైసీపీ పార్టీ కోసమే అన్నది జగమెరిగిన సత్యం. అలాంటి సంస్థలో పని చేసిన,పని చేస్తున్న వారు కావచ్చు మొత్తానికి జగన్ విధ్వంసం సాక్షి కుటుంబ సభ్యులు కూడా భరించలేక పోయారేమో నన్న విమర్శకు దారితీస్తుంది జగన్ తీరు. లేదా ఐజేయు, ఏపీయూ డబ్ల్యూ జే యూనియన్ భావజాలం సాక్షిలో పని చేసిన పని చేస్తున్న వారి నర నరాల్లో పొంగిపొర్లు తున్నాయని చెప్పాలో అర్థం కానీ పరిస్థితి. ఎందుకంటే ఆ యూనియన్ మెజారిటీ సఫోర్ట్ చంద్రబాబు కు ఉంటుందని చెప్పడం లో వింతేమి కాదు.ఎందుకు చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నా లేకున్నా మీడియా అంటే చంద్రబాబు, చంద్రబాబు అంటే మీడియా అనే భావన ఉంది కాబట్టి.ఆ భావన వైసీపీ పార్టీ కి గాని, ఆ పార్టీ నేతల్లో చాలామంది కి లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. ఏది ఏమైనా జగన్ పాలన విధ్వంసం అని నిరూపించడానికి ఆయన మీడియా కూడా కీలక పాత్ర పోషించందన్నది విధ్వంసం పుస్తకం ద్వారా తెలుసుకోవడం కూడా మంచిదే.

## వైఎస్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని క్విడ్‌ప్రోకో


**సొంత పత్రికుల, ఛానల్‌లకు నిధుల మళ్లింపు**

**బ్రాహ్మణి స్టీల్‌కు భూకేటాయింపుల్లో జగన్ హస్తం**

**జగన్ తీరుపై మండిపడ్డ కొమ్మారెడ్డి పట్టాభి**

అమరావతి, బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో రాయలసీమ యువతకు ఉపాధి ఇస్తాననే భ్రమ కల్పించి భారీ దోపిడీ చేశారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. బ్రాహ్మణి స్టీల్స్‌కు 14 వేల ఎకరాల ప్రజల సొత్తు, ప్రభుత్వ భూమిని కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. కేటాయించిన భూములను రూ.350 కోట్లకు తాకట్టు పెట్టి భారీ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని పరిశ్రమలకు భూ కేటాయింపుల పేరుతో క్విడ్ ప్రోకో ద్వారా జగన్ కోట్లు దండుకున్నారని ఆరోపించారు. రెడ్ గోల్డ్ ఎంటర్‌ప్రైజెస్, ఆర్‌ఆర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి జగతి పబ్లికేషన్స్‌కు రూ.44 కోట్లు, ఇందిరా టెలివిజన్‌కు రూ.30 కోట్లు వెళ్లిన విషయం వాస్తవం కాదా అని పట్టాభి ప్రశ్నించారు. కోట్లు దండుకున్నా బ్రాహ్మణి స్టీల్స్‌లో ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. 2007 జూన్ 10న బ్రాహ్మణి స్టీల్స్ శంకుస్థాపన కార్యక్రమాన్ని జగన్ స్వయంగా నడిపించారని గుర్తుచేశారు. ఓబులాపురం గనుల్లో భారీ అక్రమాలు జరిగాయని సీబీఐ స్పష్టం చేసిందని.. అయినా 2022 ఆగస్టులో ఓబులాపురం గనులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. జగన్ లూటీకి గురైన 14 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కూటమి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని పట్టాభి వివరించారు. నాడు పరిశ్రమల పేరుతో జగన్ లూటీ చేస్తే.. నేడు పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి విప్లవాన్ని తీసుకొచ్చింది కూటమి ప్రభుత్వమని తెలిపారు. కియాతో ప్రారంభమైన పారిశ్రామిక ప్రగతి.. నేడు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిట్టల్ వంటి గ్లోబల్ సంస్థల పెట్టుబడులతో కొనసాగుతోందన్నారు. లూటీకి ప్రతీక జగన్ అయితే.. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలకు ప్రతీక చంద్రబాబు అని కొమ్మారెడ్డి పట్టాభి పేర్కొన్నారు.

## నా నోరు మూయించాలంటే.. నన్ను చంపాలి



పార్టీ నేతలను భయపెట్టేందుకు, వేధించేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. వీడియో సందేశం ద్వారా మాట్లాడిన మమతా బెనర్జీ.. టీఎంసీని వీడి బీజేపీలో చేరని వారికి శుభాకాంక్షలు తెలిపారు. తనపై, పార్టీపై ఒత్తిడి తెచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ.. "నన్ను మౌనంగా చేయాలంటే నన్ను చంపాల్సిందే. అందుకోసం కూడా మీరు ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా వదల్లేదు" అని వ్యాఖ్యానించారు.లోక్‌సభ సభ్యులు అభిషేక్ బెనర్జీ, మహువా మొయిత్రా, కల్యాణ్ బెనర్జీలతో పాటు తన ఇంటిని కూడా లక్ష్యంగా చేసుకున్నారని మమత ఆరోపించారు. తమ పార్టీ నాయకులను నిరంతరం వేధిస్తున్నారని విమర్శించారు.2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలకు పాల్పడి అధికారంలోకి వచ్చిందని మమత ఆరోపించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియను దుర్వినియోగం చేసి, కేంద్ర బలగాల సహాయంతో కౌంటింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకుని ఎన్నికలను ప్రభావితం చేసిందని విమర్శించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద కూడా ఉన్నాయని పేర్కొన్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం అనంతరం ఆ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చిన విషయం తెలిసిందే. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని వీడగా, కొందరు పార్టీ నాయకత్వం, ముఖ్యంగా అభిషేక్ బెనర్జీపై విమర్శలు చేశారు. పార్టీలో అవినీతి పెరిగిందని కూడా ఆరోపించారు.మరోవైపు టీఎంసీకి రాజీనామా చేసిన రాజ్యసభ సభ్యులు సుఖేందు శేఖర్ రాయ్, సుష్మితా దేవ్, ప్రకాశ్ చిక్ బరైక్ గురువారం బీజేపీలో చేరారు. అనంతరం జులై 24న జరగనున్న రాజ్యసభ ఉప ఎన్నికలకు బీజేపీ వారిని అభ్యర్థులుగా ప్రకటించింది.

# సర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

**పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పారదర్శకంగా చేపడుతున్నాం**
**ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజి**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా మిగిలిపోకుండా రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కోరారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తిస్థాయి పారదర్శకతతో చేపడుతున్నామని తెలిపారు.శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కృష్ణాజిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 15 నుంచి జూలై 14 వరకు జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందజేసి, తిరిగి సేకరించి డిజిటలైజేషన్ పూర్తి చేయడం అత్యంత కీలకమన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేస్తున్న జిల్లాగా కృష్ణా నిలిచిందని తెలిపారు. అయినప్పటికీ ఒక్క అర్హ ఓటరు కూడా మిగిలిపోకుండా అత్యంత జాగ్రత్తగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని చెప్పారు.ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేయడంతో పాటు వాటిని తిరిగి సేకరించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు అందు బాటులో లేకపోవడం, తర్వాత రావాలని కోర డం, అపార్ట్‌మెంట్‌లలో ఒకేసారి ఫారాలు ఇవ్వాలని నిర్ణయించుకోవడం వంటి కారణాల తో ఆలస్యం జరుగుతోందన్నారు. ఇటువంటి సందర్భాల్లో రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) బీఎల్ఓలతో సమ న్వయం చేసుకుని ఫారాలు సకాలంలో తిరిగి అందేలా సహకరించాలని కోరారు.డెత్, ఆబ్సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్, అన్‌ట్రేస్డ్ వంటి అన్‌కలెక్టబుల్ కేసుల విషయంలో కూడా సాధ్యమైనంత వరకు ఫోన్ నంబర్లు సేకరించి సంబంధిత ఓటర్లను సంప్రదించాలని బీఎల్ఓలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.బీఎల్ఓలకు, అందు బాటులో లేని ఓటర్ల ప్రాథమిక జాబితాలను ముందుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులతో పంచుకున్నామని, ఆ జాబితాలను పరిశీలించి సంబంధిత ఓటర్లను గుర్తించి ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేయించేందుకు సహకరించాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో మైక్ అనౌన్స్‌మెంట్లు, ప్రత్యేక ప్రచార వాహనాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.జూలై 14లోపు కార్యక్రమం పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ, సాంకేతిక కారణాలను దృష్టిలో ఉంచుకుని జూలై 12 నాటికే ఎక్కువ శాతం ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారని తెలిపా రు. ఆన్‌లైన్‌లో ఎదురయ్యే సాంకేతిక సమ స్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్తూ పరిష్కరిస్తున్నామని చెప్పారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తిగా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జరుగుతోందన్నారు. 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించి కొత్త పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించామని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు నియోజకవర్గాల వారీగా కొత్త పోలింగ్ కేంద్రాల మ్యాపిం గ్‌ను సంబంధిత అధికారులతో పరిశీలించి ఖరారు చేస్తామని వివరించారు.వేరే జిల్లాలు లేదా రాష్ట్రాల్లో ఓటు ఉన్నవారు ప్రస్తుతం కృష్ణాజిల్లాలో నివసిస్తున్న సందర్భాల్లో, క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ దశలో ఓటు మార్పిడి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పేర్లు, ఆధార్ మ్యాపింగ్ లేదా ఇతర సాంకేతిక అంశాలకు సంబంధించిన సమస్యలు ఉన్నా ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అధికారులు అవసరమైన సహాయం అందిస్తారని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించడమే లక్ష్యమని, ప్రజాస్వామ్య బలోపేతానికి రాజకీయ పార్టీలు, బీఎల్ఏలు, ప్రజలు అందరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.సమావేశంలో ఈఆర్వోలు బందరు, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే సాంబ శివరావు, జి బాలసుబ్రమణ్యం, ఎస్ కరుణ కుమారి, కెఆర్ఆర్సి ఎస్డిసి పి నీలకంటేశ్వరరెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసి ఆర్ కుముదిని సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## అంగన్వాడీల ఆవేదన.. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం

**పెనమలూరులో తీరని 'బీఎల్ఓ' బాధలు.. మచిలీపట్నంలో నిరసన సెగ**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
కుటుంబ పోషణ భారమై, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ.. అంగన్వాడీ కార్యకర్తలు మరోసారి రోడ్డెక్కారు. మచిలీపట్నం ధర్నా చౌక్ వేదికగా శుక్రవారం జరిగిన ఆందోళన, ప్రభుత్వంపై వారు పెట్టుకున్న ఆశలు అడియాసలవుతున్నాయనడానికి అద్దం పట్టింది. 'మాకు కనీస వేతనం పెంచండి.. మాపై అదనపు భారం తగ్గించండి' అంటూ వారు చేస్తున్న ఆవేదన ఇప్పుడు జిల్లాలో చర్చనీయాం శంగా మారింది.ప్రధాన సమస్యలు - ఆందోళనలో కీలకాంశాలు:గౌరవ వేతనం పెంపు: ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, తమ ఆర్థిక కష్టాలను ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు.బీఎల్ఓ విధుల నుంచి విముక్తి: రాష్ట్ర ప్రభుత్వం బీఎల్ఓ విధులను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలో ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కి, ఇప్పటికీ అంగన్వాడీలపైనే ఆ భారాన్ని మోపుతున్నారని ఆరోపిస్తున్నారు.పరిష్కారం కాని పెండింగ్ డిమాండ్లు: ప్రభుత్వం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.'ఉధృతం చేస్తాం'.. ప్రభుత్వానికి హెచ్చరికకేవలం వినతిపత్రాలకే పరిమితం కాకుండా, తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే, తమ ఆందోళనలను రాష్ట్రవ్యాప్తం చేస్తామని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు."ప్రభుత్వం ఆదేశించినా.. పెనమలూరులో మాత్రం బీఎల్ఓ విధుల రద్దు కాలేదు. ఇది అధికారుల వైఫల్యమా లేక అంగన్వాడీలను చులకనగా చూడటమా?" - అని నిరసనలో పాల్గొన్న కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వానికి, క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య ఉన్న ఈ 'కమ్యూనికేషన్ గ్యాప్' ఎప్పటికి తీరుతుందో వేచి చూడాలి.

## కృష్ణాజిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా పి. జయరావు బాధ్యతల స్వీకారం



**కలెక్టరేట్‌లోని సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో డిపిఆర్ఓగా పదవీ బాధ్యతలు చేపట్టిన జయరావు**
**కలెక్టర్ డీకే బాలాజిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన అధికారి**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
కృష్ణా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా (ఎఫ్ఏసీ) పి. జయరావు శుక్రవారం ఉదయం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిఐపిఆర్ఓ) కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.కలెక్టర్‌కు మొక్క అందజేతబాధ్యతలు స్వీకరించిన అనంతరం పి. జయరావు జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ డీకే బాలాజిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ కలెక్టర్‌కు ఒక మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కలెక్టర్ డీకే బాలాజి దిశానిర్దేశం:"ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సకాలంలో, పూర్తి పారదర్శకంగా చేరేలా సమాచార పౌర సంబంధాల శాఖ సమర్థవంతంగా పనిచేయాలి. సమాచార ప్రచారంలో ఆధునిక సాంకేతిక సాధ నాలను (Modern Media Tools) విస్తృతంగా వినియోగించాలి. ప్రజలకు ఎల్లప్పుడూ విశ్వసనీయమైన సమాచారాన్ని చేరవేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి."ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా: పి. జయరావుఈ సందర్భంగా నూతన డిఐపిఆర్ఓ పి. జయరావు మాట్లాడుతూ... జిల్లాలో జరుగుతున్న ప్రజాహిత కార్యక్రమాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని చెప్పారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ, శాఖ ప్రతిష్ఠను మరింత పెంపొం దించేలా నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖకు చెందిన పలువురు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత



మచిలీపట్నం రూరల్ ప్రజా భూమి ప్రతినిధి
మచిలీపట్నం రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతులు చేపడుతున్నట్లు ఏపీసీపీడీసీఎల్ (APCPDCL) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ G. గోవిందరావు గారు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మరమ్మతుల కారణంగా శనివారం (11-07-2026) ఉదయం 06:00 గంటల నుండి ఉదయం 10:00 గంటల వరకు క్రింది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.
విద్యుత్ నిలిపివేసే గ్రామాలు:గోపువానిపాలెం పోతిరెడ్డి పాలెంపొట్లపాలెంకొత్తపూడిబుద్దల పాలెంమేకవానిపాలెంముఖ్య గమనిక: పైన పేర్కొన్న గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ సమయాన్ని గమనించి, ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## మచిలీపట్నంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అవగాహన సదస్సు

**విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన ఈగల్ సెల్**
**పాల్గొన్న 250 మంది విద్యార్థులు, అధికారులు**



మచిలీపట్నం/ క్రైమ్ ప్రజాభూమి ప్రతినిధి
కేంద్రీయ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణా జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో, పరిపాలనా విభాగపు అదనపు పోలీస్ సూపరింటెండెంట్ వి.వి. నాయుడు పర్యవేక్షణలో జరి గింది.

**మాదక ద్రవ్యాలతో జీవితాలు అంధకారం**

ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, శారీరక, మానసిక ఆరోగ్యంపై చూపే ప్రభావాలు, నేర చరిత్ర వల్ల భవిష్యత్తు ఎలా దెబ్బతింటుందనే అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మత్తు పదా ర్థాల వల్ల కుటుంబాలు, సమాజం ఎదుర్కొనే ప్రతికూల పరిస్థితులను వివరించారు.చట్టాలపై అవగాహన.. 1972 టోల్ ఫ్రీ నెంబర్‌మహిళల భద్రత, రోడ్డు భద్రతతో పాటు బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో చట్టం), నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం (ఎన్‌డిపిఎస్ చట్టం) గురించి విద్యార్థులకు స్పష్టంగా తెలియజేశారు. ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసుల్లో ఇరుక్కుంటే ఎదురయ్యే కఠిన శిక్షల గురించి హెచ్చరించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

**డ్రగ్స్ వద్దు బ్రో అని నినదించిన విద్యార్థులు:**

ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల కూడా విద్యార్థులను అప్రమత్తం చేశారు. అనంత రం విద్యార్థులందరిచే డ్రగ్స్‌కు వ్యతిరే కంగా ప్రతిజ్ఞ చేయించి, 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేయించారు.హాజ రైన ప్రము ఖు లుఈ అవగాహన సదస్సులో నోడల్ అధికారి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చ. వెంకటేశ్వరరావు, డాక్టర్ వీరేంద్ర, నవజీవన్ బాలభవన్ ప్రతినిధి సతీష్, ఆకర్ష ఫౌండేషన్ డీ-ఎడిక్షన్ సెంటర్ ప్రతినిధులు, కళాశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఈగల్ టీమ్ సభ్యులతో పాటు సుమారు 250 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






స్ఫూర్తి ఫౌండేషన్ మానవత్వం..

## కిడ్నీ బాధితుడికి రూ. 10,000 ఆర్థిక సాయం

**ఐదేళ్లుగా డయాలసిస్‌తో పోరాటం.. ఆదుకున్న దాతలు, ఫౌండేషన్ సభ్యులు**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
సమాజంలో ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా సేవలందిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ మరో మానవతా కార్యక్రమాన్ని చేపట్టింది. వేకనూరు గ్రామానికి చెందిన కీ.శే. భోగాది వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె రాజ్యం రూ. 5,000 విరాళం అందించారు. దీనికి స్ఫూర్తి ఫౌండేషన్ మరో రూ. 5,000 జత చేసి, మొత్తం రూ. 10,000 విలువైన చెక్కును కిడ్నీ బాధితుడు బొండాడ ఫణి కుమార్ (43)కు అందజేసింది. మచిలీపట్నం గవర్నమెంట్ హాస్పిటల్ ఆర్ఎంఓ (RMO) భానుమూర్తి చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయాన్ని శనివారం బాధితుడికి పంపిణీ చేశారు.కన్నీళ్లు పెట్టిస్తున్న ఫణి కుమార్ జీవన చిత్రం:ఐదేళ్లుగా నరకం: మచిలీపట్నం చిలకలపూడి నివాసి అయిన ఫణి కుమార్ గత ఐదేళ్లుగా రెండు కిడ్నీలు పూర్తిగా చెడిపోయి, వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటూ ప్రాణాలతో పోరాడుతున్నారు.తోడు లేని జీవితం: తీవ్ర అనారోగ్యం కారణంగా భార్యాపిల్లలు దూరం కావడంతో, ప్రస్తుతం వృద్ధురాలైన తల్లి మాత్రమే ఆయనకు అండగా ఉంటూ సంరక్షిస్తున్నారు.పెరిగిన కష్టాలు: ఇటీవల ఫణి కుమార్‌కు వినికిడి సమస్య తీవ్రమై చెవులు పూర్తిగా వినిపించకుండా పోయాయి. మరోవైపు కొన్ని రోజుల క్రితం ఆయన తల్లి ప్రమాదవశాత్తు కింద పడటంతో కాలికి తీవ్ర గాయమైంది. దీంతో ఆ కుటుంబం మరింత దయనీయ స్థితిలోకి జారుకుంది. మందులకే నెలకు 20 వేలు: కనీస వసతులు కూడా లేని ఇంట్లో నివసిస్తున్న ఈ నిరుపేద కుటుంబానికి కేవలం మందుల కోసమే ప్రతి నెలా దాదాపు రూ. 20,000 ఖర్చవుతోంది.
చేయూతనివ్వడం మా ధ్యేయం: స్ఫూర్తి ఫౌండేషన్ఈ క్లిష్ట పరిస్థితిని తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు తక్షణమే స్పందించి దాతల సహకారంతో ఈ సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు ఎన్. ఫణి కుమార్, కె. స్వర్ణలత, కె. మణిబాబు, టి. నరేష్, టి. మాణిక్యాలరావు, జి. భాను, సిహెచ్. భాగ్యచంద్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న నిరుపేదలకు చేయూత అందించడమే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## బందరు ఎంపీ బాలశౌరి చేతుల మీదుగా లబ్ధిదారులకు ₹9.55 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

**అర్హులైన వారికి అండగా ప్రభుత్వం ఎంపీ వల్లభనేని బాలశౌరి**
**నలుగురు లబ్ధిదారులకు ఆర్థిక భరోసా**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ఒక వరమని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. మచిలీపట్నం ఎంపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన మొత్తం ₹9,55, 000 ఆర్థిక సాయాన్ని అర్హులైన లబ్ధిదారులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ, ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుం టుందని తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వం నుంచి అందే ప్రతి రూపాయి, నిజమైన లబ్ధిదారులకే నేరుగా చేరేలా తాను ఎప్పటికప్పుడు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల కష్టాలను గుర్తించి వారికి త్వరితగతిన సహాయం అందేలా చూస్తామని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని ఎంపీ స్పష్టం చేశారు.లబ్ధిదారుల వివరాలు: ఎస్. మధుసూదన రావుగూడూరు (పెడన నియోజకవర్గం)₹63,795 (చెక్కు)ఎస్. రంగమణిమచిలీపట్నం₹1,69,502 (చెక్కు)జి. నాగమల్లేశ్వర రావుఅరిసేపల్లి₹57,784 (చెక్కు)గల్లా లక్ష్మిఎల్ఓసీ (LOC) కింద₹6,00,000 (ఆసుపత్రి ఖాతాకు జమ)ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులు, అధికారులు మరియు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఎంపీ బాలశౌరి చొరవతో తమకు సకాలంలో ఆర్థిక సాయం అందిందని లబ్ధిదారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ సిబ్బందికి రవాణా శాఖ ప్రత్యేక శిక్షణా కార్యక్రమం

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి



కృష్ణా జిల్లా ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం మచిలీపట్నంలోని ఏపీఎస్ఆర్టీసీ హెవీ వెహికల్ ట్రైనింగ్ కాలేజీ హాల్ నందు కృష్ణా జిల్లా పరిధిలోని డిపోలకు చెందిన ఆర్టీసీ డ్రైవర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డిపో మేనేజర్ టి. పెద్ది రాజు, గుడివాడ డిపో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) కె. కేశవరావు మరియు సురక్షిత డ్రైవింగ్ శిక్షకులు అబ్దుల్ బారీ, ఎన్.ఎస్.ఎన్. రాజు, ఆర్. మార్కం దేయులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కృష్ణా జిల్లా పరిధిలోని అన్ని డిపోల నుంచి డ్రైవర్లు పెద్ద సంఖ్యలో ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డ్రైవర్లు విధి నిర్వహణలో ప్రశాంతంగా, సేవా భావంతో ప్రయాణికులతో మెలగాలని సూచించారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆర్టీసీకి ప్రయాణికులే మూలాధారం గనుక వారిపట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని తెలియజేశారు. డ్రైవర్లు తమ విధి నిర్వహణలో పూర్తి ఏకాగ్రతతో వ్యవహరిస్తూ.. ప్రయాణీకులను, పాదచారులను గమనిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. <

ముఖ్యంగా డ్రైవింగ్ చేయునప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించకుండా సురక్షితమైన డ్రైవింగ్ చేయవలరని డ్రైవర్లకు సందేశమిచ్చారు.మచిలీపట్నం డిపో మేనేజర్ టి. పెద్ది రాజు మాట్లాడుతూ.. డ్రైవర్లు సరైన వేగ నియంత్రణ పాటించాలని, ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని మరియు డ్యూటీకి ముందే తగినంత నిద్ర ఉండే విధంగా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు.

## ముంచుకొస్తున్న 'సర్' గడువు - ప్రక్రియ వేగవంతం చేయాలి


**ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి: పాలూరి సత్యానందం.**



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువు ఈ నెల 14తో ముగి యనున్న నేపథ్యంలో, అధికారులు డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నెల జూన్ 14 నుంచి కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కొత్తపేట నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల పరిధిలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు నూరు శాతం పూర్తయిందన్నారు. అయితే, సేకరించిన ఫారాల డిజిటలైజేషన్, నమోదు ప్రక్రియను అధికారులు వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఇళ్లు మారిన వారు, చిరునామా మార్పులు చేసుకున్న వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన వారి వివరాలు నమోదు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. గడువు ముగియడానికి కేవలం ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున అధికా రులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ వివరాలన్నింటినీ పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో కొత్తపేట నియోజకవర్గం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఆదర్శంగా నిలిచి మొదటి స్థానం లో ఉండేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పాలూరి సత్యానందం విజ్ఞప్తి చేశారు.

## తలుపులమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.63.99 లక్షలు



ప్రజాభూమి ప్రతినిధి–తుని

పుణ్యక్షేత్రమైన శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి వివిధ హుండీలను తెరిచి లెక్కించారు. గత 44 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకల ద్వారా దేవస్థానానికి మొత్తం రూ. 63,99,037 ల ఆదాయం సమకూరినట్లు దేవస్థాన ఉప కమీషనరు, కార్య నిర్వహణాధికారి (ఈవో) శ్రీ పెన్మెత్స విశ్వనాధ రాజు తెలిపారు. ఇందులో నగదు రూపంలో రూ. 60,10,250/-, నాణేల రూపంలో రూ. 3,88,787/- లభించినట్లు ఆయన వివరించారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ లెక్కింపు ప్రక్రియను ప్రత్యేక పర్యవేక్షకులుగా వ్యవహరించిన కాకినాడ శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయ గ్రేడ్–1 ఈవో శ్రీ వీ. మురళీ వీర భద్ర రావు, కాజులూరు గ్రూప్ టెంపుల్స్ గ్రేడ్–3 ఈవో I K.V.V వేణుగోపాల్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ.గ్రా. భాస్కర సత్యనారాయణ, ధర్మకర్తలు శ్రీ అవుగొడ్డి వెంకట రమణ, శ్రీమతి బూసాల నూకరత్నం మరియు ఇతర మండలి సభ్యులు పాల్గొన్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియలో శ్రీవారి సేవకులు, బ్యాంకు సిబ్బంది, నాయి బ్రాహ్మణులు మరియు ఆలయ ఉద్యోగులు పాల్గొని సేవలు అందించారు.

### ప్రజాసమస్యల పరిష్కారంలో

## అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలి

**–కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.**



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ప్రజా దర్బార్ లో ప్రజలు సమర్పించే వినతుల పట్ల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనంతో వ్యవహరించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలు, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. మొత్తం ప్రజల నుంచి 16 వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## హెచ్ఐవీ కట్టడికి కొత్త వ్యాక్సిన్... ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు

ప్రజా భూమి ప్రతినిధి–పెదపాడు.

హెచ్ఐవీ వ్యాక్సిన్ అభివృద్ధిలో కీలక ముందడుగు. జంతువులపై జరిపిన ప్రయోగాల్లో అద్భుత ఫలితాలు. వైరస్‌ను ఎదుర్కొనే శక్తివంతమైన యాంటీబాడీల ఉత్పత్తి. మనుషులపై క్లినికల్ ట్రయల్స్ దశకు చేరుకున్న పరిశోధనలు. హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వ్యాక్సిన్ దిశగా శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేసిన ఒక కొత్త వ్యాక్సిన్, కోతుల వంటి ప్రైమేట్లపై జరిపిన పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలను ఇచ్చింది. ఈ వ్యాక్సిన్ ద్వారా అత్యంత శక్తివంతమైన, విస్తృ



త స్థాయిలో పనిచేసే యాంటీబాడీలు ఉత్పత్తి అయినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ఫలితాలు ప్రఖ్యాత 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ వ్యాక్సిన్‌ను లా జొల్లా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇమ్యునాలజీ, స్క్రిప్స్ రీసెర్చ్, ఇంటర్నేషనల్ ఎయిడ్స్ వ్యాక్సిన్ ఇనిషియేటివ్ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఇది నేరుగా వైరస్‌పై దాడి చేసే బదులు, మన రోగనిరోధక వ్యవస్థలోని 'బి' కణాలకు దశలవారీగా శిక్షణ ఇస్తుంది. దీనివల్ల, నిరంతరం రూపాంతరం చెందే హెచ్ఐవీలోని అనేక రకాలను గుర్తించి, నిర్వీర్యం చేయగల శక్తివంతమైన యాంటీబాడీలు తయారవుతాయి. హెచ్ఐవీ తన రూపాన్ని మార్చుకుంటూ, రక్షణ కవచాలను ఏర్పరచుకోవడం వల్ల ఇప్పటివరకు వ్యాక్సిన్ అభివృద్ధి చేయడం సవాలుగా మారింది. అయితే, ఈ కొత్త విధానం ఆ అడ్డంకులను అధిగమించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. జంతువులపై ఇంతటి సానుకూల ఫలితాలు రావడం ఇదే మొదటిసారని వారు పేర్కొన్నారు. ఈ ప్రయోగాల విజయంతో, ఇదే తరహా వ్యూహాలతో మానవులపై క్లినికల్ ట్రయల్స్ కూడా ప్రారంభమయ్యాయి. అయితే, మనుషుల్లో దీని భద్రత, సమర్థతపై పూర్తిస్థాయి డేటా రావడానికి మరికొంత సమయం పడుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఐవీని నియంత్రించడానికి సమర్థవంతమైన మందులు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఇన్ఫెక్షన్లను అరికట్టాలంటే వ్యాక్సిన్ కీలకం. ఈ పరిశోధన ఆ దిశగా పడిన ఒక ముఖ్యమైన ముందడుగుగా భావిస్తున్నారు.

## జెన్సిస్ డైరెక్టర్లు అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ రూరల్

కాకినాడ నగరంలోని డీఎస్ఏ స్టేడియం ఎదురుగా ఉన్న కేఆర్కే ప్లాజాలో "ఆల్ట్రెటీ జెన్సిస్ కేపిటల్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్" పేరుతో కార్యాలయం నిర్వహిస్తూ, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిస్తామని, ప్రతి నెల స్థిరమైన లాభాలు అందిస్తామని ప్రజలను నమ్మబలికి భారీ మొత్తంలో డిపాజిట్లు సేకరించిన కేసులో సర్పవరం పోలీసులు కీలక పురోగతి సాధించారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 221/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్లు, అలాగే Protection of Depositors of Financial Establishments Act, 1999లోని సెక్షన్–5 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కాకినాడ, వలసపాకలకు చెందిన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు పులుగు మోజేష్, కాకినాడ గాంధీనగర్ కు చెందిన సంధనా లలిత అంబికను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, సంస్థ ద్వారా మొత్తం 7,342 పెట్టుబడులు నమోదు కాగా, మొత్తం సేకరించిన పెట్టుబడుల విలువ రూ. 98,66,92,943. వీటిలో 3,709 పెట్టుబడులు ముగియగా, 3,633 పెట్టుబడులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పెట్టుబడుల మొత్తం విలువ రూ. 53,87,72,943గా ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. అరెస్టు చేసిన నిందితుల వద్ద నుంచి ఆరు ల్యాప్‌టాప్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక కారు, బాండ్లు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ బింధుమాధవ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ డా. కిశోర్ కుమార్ పర్యవేక్షణలో సర్పవరం సీఐ సిహెచ్. ప్రకాష్, ఎస్ఐలు యేసుబా



బు, రాజ నరేంద్ర మరియు ప్రత్యేక పోలీసు బృందం వేగంగా దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, కాకినాడ ఎదుట హాజరుపరిచినట్లు సర్పవరం పోలీసులు వెల్లడించారు.

## ఈ నెల 15వ తేదీ నుండి 24 వరకు వారాహీ అమ్మవారి గుప్త నవరాత్రి ఉత్సవాలు

### వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న వెల్లడి

ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ రూరల్

కొవ్వూరులో వారాహి అమ్మవారి ప్రాంగణంలో గుప్త నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకురాలు కాళ్ల లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 15వ తేదీ ఉదయం 5గంటలకు మాలధారణ దీక్ష ప్రారంభం అవుతుందని, కాశీ క్షేత్ర పరిపాలకురాలుగా అమ్మవారి కీర్తి ఎంతో ఉందన్నారు. భక్తులు సమస్యలు నుంచి త్వరితగతిన బయట పడేందుకు అమ్మవారిని ఉపాసనతో ప్రార్థించాలని, ఉదయం వేళల్లో అమ్మవారికి దీపారాధనలు చేసి రాత్రి వేళల్లో పూజిస్తే అనుకున్న పనులు జరుగుతాయని వివరించారు. అమ్మవారికి పానకం, చక్రపొంగలి, దద్దోజనం నైవేద్యంగా సమర్పించాలన్నారు. అమ్మవారు భూదేవత అయినందున క్యారెట్, బీట్రూట్, చిలకడ దుంపలు, కాయగూరలతో పాటు భూమి నుంచి వచ్చే ఆహార



పదార్థాలు అన్నీ ప్రసాదం రూపంలో పెట్టవచ్చన్నారు. తమ ప్రాంగణంలో నిర్విరామ అన్నదానం, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. మామూలు రోజులు కన్నా అమ్మవారిని ఆషాఢమాసంలో భక్తితో పూజించడం వలన కుటుంబం అంతటికీ అనుగ్రహం వేగంగా లభిస్తుందన్నారు. దీక్ష చేపట్టే వారు భూ శయనం, బ్రహ్మచర్యం, ఒంటి పూట భోజనం, కాయగూరల భోజనం తిని నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేసారు. గుప్త నవరాత్రుల తర్వాత తాను విశ్రాంతి తీసుకుంటానని, ఆలయం స్థాపించినప్పటి నుండి నిర్విరామంగా అమ్మవారికి సేవలు చేయడం జరుగుతుందని, తమ కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఇంటిలో పూజించే అమ్మవారిగా కొలిచామని రాష్ట్రస్థాయిలో కొవ్వూరు అమ్మవారికి ఇంత ఆదరణ లభిస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ సమావేశంలో ధర్మకర్త కాళ్ళ సత్య నారాయణ తో పాటు అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## ధర్మవరంలో రూ.96.84 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

### వెల్‌నెస్ సెంటర్, రైతు సేవా కేంద్రం ప్రారంభం – రెండు చోట్ల డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా శంకుస్థాపన





ప్రజాభూమి ప్రతినిధి–ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గౌరవ శాసనసభ్యులు శ్రీమతి వరుపుల సత్యప్రభ రాజా రూ. 96.84 లక్షల వ్యయం తో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రూ. 21 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, రూ. 10 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో మొత్తం రూ. 31 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన వెల్‌నెస్ సెంటర్ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రూ. 23.84 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన రైతు సేవా కేంద్రంను కూటమి నాయకులతో కలిసి ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. అదేవిధంగా కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నిధులతో రూ. 21 లక్షల చొప్పున ధర్మవరం గ్రామం లోని నంది బొమ్మ సెంటర్ వద్ద, అలాగే ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ పార్క్ సమీపంలో నిర్మిం చనున్న డ్రైనేజీ పనులకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, రైతులకు అవసరమైన సౌకర్యాలు, పారిశుధ్య వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఏపీ తొలి మోడల్ పుష్కర గ్రామంగా తీపర్రును తీర్చిదిద్దుతాం

- **గోదావరి పుష్కరాల నేపథ్యంలో తదేకం ఫౌండేషన్ సహకారంతో 'తీపర్రు'ను మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయం**
- **తీపర్రులో శనివారం 'మా గోదావరి సంకల్ప్' కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రి కందుల దుర్గేష్**
- **మెరుగైన రవాణా సౌకర్యం, అందమైన ఘాట్, గ్రామస్థుల సహకారంతోనే తీపర్రు ను మోడల్ ఘాట్ ఎంపిక చేసినట్లు తెలిపిన తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు**
- **తదేకం ఫౌండేషన్ సేవలను అభినందించిన మంత్రి కందుల దుర్గేష్**

ప్రజా భూమి ప్రతినిధి–నిడదవోలు

రాబోయే 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తదేకం ఫౌండేషన్ సహకారంతో నిడదవోలు నియోజకవర్గంలోని 'తీపర్రు' గ్రామాన్ని ఆదర్శ పుష్కర గ్రామంగా, స్థానిక ఘాట్ ను మోడల్ ఘాట్ గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ మేరకు తదేకం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం (జూలై 11, 2026) మధ్యాహ్నం 3 గం.లకు తీపర్రు గ్రామంలో నిర్వహించనున్న "మా గోదావరి సంకల్ప్" కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తీపర్రు మోడల్ విలేజ్ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అదే విధంగా గోదావరి తీరంలో ప్రతి గ్రామంలో ఈ తరహా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షకు అనుగుణంగా తీపర్రు ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా ఎలా సిద్ధం చేయాలి, అలాగే నీరి అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ సహకారంతో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత ప్రాంతంగా ఎలా మార్చాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగా గ్రామ చెరువు పునరుద్ధరించడం, నీటి గుర్రపు డెక్క తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. గ్రామంలో ఫ్లెక్సీలు లేకుండా ప్లాస్టిక్ రహిత ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు



తెలిపారు. అదే విధంగా యాత్రికులు, పర్యాటకులు తమ గోదావరి దర్శనాన్ని గుర్తుంచుకునేలా "ఐ లవ్ గోదావరి మా తీపర్రు" పేరుతో రెండు సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 25 హోమ్ స్టేలకు సన్నాహాలు చేస్తామన్నారు. అంతేగాక "తీపర్రు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ విలసిల్లేలా, స్థానిక పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేలా కార్యక్రమాలు చేపట్టనున్నాం. పర్యావరణ అనుకూల గోదావరి పుష్కరాలపై అవగాహన కల్పించేలా ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు సలహాలు, సూచనలతో ముందుకు వెళ్తాం. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటాం. స్థానికంగా ఉన్న కాలువలో కయాకింగ్ తరహా అడ్వెంచ



రస్ స్పోర్ట్స్ ను ప్రవేశపెడతాం. ఘాట్ వెంబడి వీధి దీపాలు, హెరిటేజ్ స్ట్రీట్ లను అభివృద్ధి చేస్తాం. ఈ ఘాట్ ఎంపికలో స్థానిక గ్రామస్థుల నుంచి అద్భుతమైన మద్దతు, స్వచ్ఛంద సహకారం లభించాయి. త్వరలోనే ఈ ఘాట్, విలేజ్‌కు సంబంధించిన ప్రత్యేక లోగో, స్లోగన్ మరియు స్థానిక చరిత్రను వెలికితీసి ప్రజల్లోకి తీసుకెళ్తాం. రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండటం వల్లే తొలి ప్రాధాన్యతగా తీపర్రు ఘాట్‌ను ఎంచుకున్నాం. దాతల సహకారంతో ఇక్కడ మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మిగిలిన ఘాట్లను కూడా అభివృద్ధి చేస్తాం." అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా "మా గోదావరి సంక్రాంతి–2027" పేరిట రానున్న జనవరి నాటికి తీపర్రు నమూనాతో ముక్కామల, ముక్తేశ్వరం, కుండలీశ్వరం, కొవ్వూరు తదితర గోదావరి పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయనున్నామన్నారు. అదే విధంగా తాము చేపట్టనున్న కార్యక్రమాలను 24 నవంబర్ న కార్తీక పౌర్ణమి సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యవేక్షించనున్నారని, 2027 జనవరిలో సీఎం చంద్రబాబునాయుడు పరిశీలించనున్నట్లు తెలిపారు. తీపర్రు ఘాట్ అభివృద్ధి చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్ చొరవ, సహకారం బాగుందని కొనియాడారు. 2014 నుండి తదేకం ఫౌండేషన్ తరపున సామాజిక సేవ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 2027 గోదావరి పుష్కరాలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుష్కరాల నాటికి నిడదవోలు నియోజకవర్గంలోని పలు ఘాట్లను సుందరీకరించి, భక్తులకు ఎలాంటి లోటు లేకుండా సకల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో తీపర్రు ఘాట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన తదేకం ఫౌండేషన్ నిర్వాహకులను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అభినందించారు. స్థానిక పుష్కర ఘాట్లను కాలుష్య రహితంగా, ప్లాస్టిక్ రహితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఏ ఘాట్ లో స్నానం చేసినా అదే పుణ్య ఫలం లభిస్తుందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పుష్కరాలకు ముందే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం సంకల్పం "స్వచ్ఛ గోదావరి–పవిత్ర పుష్కరాలను" క్షేత్రస్థాయిలో నిజం చేసే ఆదర్శ గ్రామంగా తీపర్రును నిలుపుతామని స్పష్టం చేశారు.

### తేటగుంట క్యాంప్ కార్యాలయంలో
# కొత్త అంగన్‌వాడీలకు నియామక పత్రాలు, వంట సామాగ్రి పంపిణీ

## మాతా శిశు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వ విప్ యనమల దివ్య పిలుపు

**ప్రజాభూమి ప్రతినిధి-తుని**

మాతా శిశు సంక్షేమం కోసం ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం అనేక అద్భుతమైన పథకాలను అమలు చేస్తోందని, ఆయా ప్రభుత్వ లక్ష్యాల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రభుత్వ విప్ శ్రీమతి యనమల దివ్య పిలుపునిచ్చారు. తుని మండల టీడీపీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో, ఐసీడీఎస్ సీడీపీవో (జఖాూ) అధ్యక్షతన తేటగుంట క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె సీనియర్ నాయకులు యనమల రాజేష్‌తో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ చేతుల మీదుగా ఆమె నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణలో భాగంగా వర్కర్లకు ఇండక్షన్ స్టౌవ్‌లు, కుక్కర్లను పంపిణీ చేశారు. అనంతరం యనమల దివ్య మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా పంపిణీ అయ్యేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. ఈ విస్తృత స్థాయి కార్యక్రమంలో తొండంగి మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, టీడీపీ సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వర రావు, అప్పన రమేష్, బోడాల జమీలు, అరిగెల నర్సింహమూర్తి, తమరాన వరలక్ష్మి, కోడా వెంకట రమణ, చొక్కా జగన్నాథం, యజ్జల రమణ, చోడిశెట్టి శేషగిరి, దొంగబాబు, తుమ్మలపల్లి నాని తదితర నాయకులు, ఐసీడీఎస్ అధికారులు మరియు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



### ఒక నెల-ఒక గ్రామం- నాలుగు సందర్శనలు కార్యక్రమంలో
# అందిన అర్జీల సమస్యలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, తక్షణమే పరిష్కరించాలి

- పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(పాడా) కార్యాలయంలో శుక్రవారం "వన్ మంత్-వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్" కార్యక్రమంలో నేరుగా ప్రజలు నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్..
- పిఠాపురం పీజీఆర్ఎస్‌కు 85 అర్జీల స్వీకరణ..





**ప్రజాభూమి ప్రతినిధి - పిఠాపురం**

ఒక నెల-ఒక గ్రామం- నాలుగు సందర్శనలు కార్యక్రమంలో అందిన అర్జీల సమస్యలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పిఠాపురంలోని పాడా కార్యాలయంలో ఒక నెల-ఒక గ్రామం- నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. పాడా పీడీ డా.ఎన్వీ.శివరామ్ ప్రసాద్ ఇతర అధికారులతో కలిసి పిఠాపురం నియోజకవర్గం లోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు మున్సిపాలిటీ, పిఠాపురం, గొల్లప్రోలు, యూ. కొత్తపల్లి మండలాల ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు.. ఈ పి జీ ఆర్ ఎస్ కార్యక్రమం లో డ్రైనేజీలు పూడికల తీయడం,భూ సమస్యలు, రీ సర్వే, నూతన పాసు పుస్తకాలు, రోడ్ల నిర్మాణం, తాగునీరు, పింఛన్లు, గృహ నిర్మాణం, ఇంటి స్థలాల మంజూరు, విద్యుత్, దీపం-2, సీసీ రోడ్ల నిర్మాణం, ఉద్యోగం ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై 85 అర్జీలు సేకరించారు. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు సూచిస్తూ సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల ఆదేశాల మేరకు, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంచుకుని నాలుగు వారాల పాటు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా, నేడు పిఠాపురం నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి దాదాపు 85 అర్జీలు, వినతులు, ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందన్నారు. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన రీ-సర్వే సమస్యలు, దారి సమస్యలు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు, పింఛన్లకు సంబంధించిన వినతులు ఎక్కువగా నమోదయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్..మండల, జిల్లా స్థాయి అధికారులకు స్పష్టం చేశారు. ఆర్థికపరమైన ఆమోదం అవసరమైన పనుల కోసం సంబంధిత ప్రతిపాదనలను జిల్లా, రాష్ట్ర స్థాయిలకు పంపి, తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులందరికీ ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ వారం ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీడీఓ పి.వాసుదేవరావ్, పిఠాపురం కమిషనర్ ఎస్.టీ. రాజేశ్వరరావు,పిఠాపురం తహశీల్దార్ గోపాల కృష్ణ, ఎంపీడీవో స్వప్న, ఇతర మండలాల తహశీల్దార్లు ఎంపీడీవోలు, పిఠాపురం మున్సిపాలిటీ, డివిజన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తునిలో నిరుపేదల కోసం వినూత్నంగా
# 'ఉచిత పాత వస్తువుల స్టాల్' ప్రారంభం..

**అధికారుల అద్భుత చొరవ.. ఉపయోగపడే బట్టలు, సామాన్లు దానం చేయాలని ప్రజలకు పిలుపు.**



**ప్రజాభూమి ప్రతినిధి-తుని**

సమాజంలోని నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల అవసరాలను తీర్చడమే ధ్యేయంగా తుని పట్టణంలో ఒక అద్భుతమైన మరియు వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన "ఉచిత పాత వస్తువుల స్టాల్" (వస్తు దాన కేంద్రం) ను శుక్రవారం ఉదయం అధికారులు ఘనంగా ప్రారంభించారు. ఆర్థిక స్థోమత లేక, కనీస అవసరాలకు సరిపడా కొత్త వస్తువులను కొనుగోలు చేయలేని నిరుపేద కుటుంబాలకు ఈ స్టాల్ ఎంతో అండగా నిలవనుందని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. సమాజంలో ఒకరి వద్ద వృథాగా ఉన్న వస్తువు, మరొకరి అత్యవసర అవసరాన్ని తీరుస్తుందనే ఉన్నత ఆశయంతో దీనిని ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఇళ్లలో ఉపయోగం లేని, కానీ వాడుకోవడానికి వీలుగా ఉండే బట్టలు, పిల్లల ఆటవస్తువులు, వంటసామాన్లను ఈ స్టాల్ లో ఉంచవచ్చని అధికారులు కోరారు. కొనుగోలు శక్తి లేని నిరుపేదలు ఎవరైనా రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా, తమకు కావాల్సిన వస్తువులను ఇక్కడి నుంచి పూర్తిగా ఉచితంగా తీసుకెళ్లవచ్చని స్పష్టం చేశారు. ఈ వినూత్న కార్యక్రమ ప్రారంభోత్సవంలో తుని పోలీస్ సీఐ గీతారామకృష్ణ, ఎంఆర్ఓ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, సబ్ రిజిస్ట్రార్ తదితరులు పాల్గొని ఈ కేంద్రాన్ని పరిశీలించారు. పట్టణ ప్రజలు పెద్ద మనసుతో తమ వద్ద ఉన్న ఉపయోగపడే వస్తువులను ఇక్కడ దానం చేసి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఎవరికి సరిపోని విత్తనాలు పంపించి పంపిణీ చేయమంటే ఎలా...?

**-విత్తనాల పంపిణీ ని నిలిపివేసిన రైతాంగం**



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

వి ఆర్ పురం మండలం ములకనపల్లి సచివాలయ పరిధిలోని రైతులకు విత్తనాలు1500 బ్యాగులు ఇవ్వాల్సి ఉండగా, ప్రభుత్వం నుంచి కేవలం 1000 బ్యాగులు మాత్రమే పంపించి రైతులకు పంపిణీ చేసే క్రమంలో ఎవరికి సరిపోని విత్తనాలు పంపించి పంపిణీ చేయమంటే ఎలా సాధ్యమవుతుందని రైతులందరూ మండల ఎంపీపీ కారం లక్ష్మి సారథ్యంలో ఆందోళన చేసి ఆ పంపిణీ కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే వ్యవసాయ సాగుకు రైతులు వరి నార్లు పోయడంలో వెనకబడ్డారని, దీనికి కారణం ప్రభుత్వం నుంచి రావాల్సిన విత్తనాలు ఆలస్యమే అని, ఇప్పటికైనా అందరికీ సరిపడా విత్తనాలు పంపిస్తారని రైతులు ఆశగా ఎదురు చూస్తుంటే, చాలీచాలని విత్తనాలు పంపడంలో రైతుల పట్ల ఈ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనబడుతుందని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఇంకా పంపాల్సిన 500 బ్యాగులు తెప్పించి రైతులను ఆదుకోవాలని లేదంటే రైతులందరినీ తీసుకొని వెళ్లి ఐటీడీఏ కార్యాలయం ముందు కూర్చుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములకనపల్లి సచివాలయ పరిధిలోని రైతులు, మహిళా రైతులు, స్థానిక సర్పంచ్ సవలం.మారయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తుని, గొల్లప్రోలు రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

**సౌత్ కోస్ట్ రైల్వే జియం కు లేఖ రాసిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్**



**ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ**

కాకినాడ పార్లమెంట్ పరిధిలోని తుని, గొల్లప్రోలు రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను తక్షణమే పునరుద్ధరించాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌ను లేఖ రాశారు. తుని, పరిసర ప్రాంతాల ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-లోక్‌మాన్య తిలక్ టెర్మినల్ (ముంబై) ఎల్‌టిటి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తుని రైల్వే స్టేషన్‌లో ప్రయోగాత్మకంగా హాల్ట్ మంజూరు చేసినప్పటికీ, ఇప్పటి వరకు అమలు చేయలేదని రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లారు. తుని ఏ-గ్రేడ్ రైల్వే స్టేషన్గా ఉండి, సంవత్సరానికి సుమారు రూ.20 కోట్ల ఆదాయం సమకూరుస్తోందని, తుని, పాయకరావుపేట, నర్సీపట్నం ప్రాంతాలతో పాటు వందకు పైగా గ్రామాల ప్రజలు ఈ స్టేషన్‌పై ఆధారపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా హెటెరో, డెక్కన్ ఫైన్ కెమికల్స్, డివీస్ ల్యాబొరేటరీస్, ఆరోబిందో ఫార్మా వంటి పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలుపులమ్మ తల్లి ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు ఈ హాల్టులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఆమోదం పొందిన హాల్టులను త్వరితగతన పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో సింహాద్రి ఎక్స్‌ప్రెస్, బొకారో ఎక్స్‌ప్రెస్ హాల్టులను పునరుద్ధరించాలని, విజయవాడ-విశాఖపట్నం ప్యాసింజర్ రైలు సేవను తిరిగి ప్రారంభించాలని, ప్రయాణికుల డిమాండ్ మేరకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు గొల్లప్రోలులో హాల్ట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం గొల్లప్రోలు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న యార్డ్ రీమోడలింగ్ పనుల్లో అవసరమైన ప్లాట్‌ఫాం విస్తరణ పనులను కూడా చేర్చి పూర్తి చేయాలని, తద్వారా భవిష్యత్తులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుల పునరుద్ధరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తన లేఖలో రైల్వే అధికారులను కోరారు.

# దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి

**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**



దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జికా వైరస్, ఎల్లో ఫీవర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. వీటి ద్వారా తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనీ, దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలనీ, ఆయుర్వేద వైద్యురాలు స్వర్ణలత అన్నారు. శుక్రవారం ఉమ్మడివరం గ్రామంలో రేఖపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు స్వర్ణలత ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతున్న 11 మంది కి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కోతులు గుట్ట ఆసుపత్రికి రిఫేర్ చేయడం జరిగిందని తెలిపారు. వారు అక్కడ వైద్యం పొందుతున్నారని గ్రామంలో తమ సిబ్బందితో ఇంటింటా సర్వే చేపట్టామని, గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత వాడే నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు కొత్త నీరు ఉండేలా చూడాలని, అలా ఉండకపోతే లార్వా అభివృద్ధి చెంది వాటి ద్వారా డెంగ్యూ కారక దోమలు వ్యాప్తి చెందుతాయని, అందుకు ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. అన్ని గ్రామాలలో సీజనల్ వ్యాధులు నివారణకు హెల్త్ క్యాంపులు నిర్వహించటం జరుగుతుంది అని ఆమె తెలిపారు. వాగు నీరు, గోదావరి నీళ్లను గ్రామాల వారు కచ్చితంగా కాచి చల్లారిసి వడపోసుకుని తీసుకోవాలని సూచించారు. ఉమ్మడివరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పిహెచ్ఎన్ భద్రకాళి, స్థానిక ఆశ వర్కర్ ఏఎన్ఎం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


# మండలంలో ముగిసిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**



తాళ్లపూడి మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి. జయకర్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పీఆర్సీ, ఐఆర్ అంశాలపై యూటీఎఫ్ ఉద్యమ కార్యాచరణను వివరించడంతో పాటు, ఇన్‌సర్వీస్ టెట్, జిల్లాల పునర్విభజనలో ఉద్యోగుల కేటాయింపులకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. 2011కు ముందు విధుల్లో చేరిన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌ను తప్పనిసరి చేయడం వల్ల వేలాది మంది ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్న ఉపాధ్యాయులను మరోసారి అర్హత పరీక్ష రాయాలని కోరడం సమంజసం కాదన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధన నుంచి పూర్తిగా మినహాయింపు కల్పించేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యాహక్కు చట్టం లోని సెక్షన్ 23(1)లో అవసరమైన సవరణలు చేయించాలని కోరారు. టెట్‌కు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల కోసం జూలై 11, 12 తేదీల్లో రాజమహేంద్రవరం, నిడదవోలు, మండపేట కేంద్రాల్లో టెట్ అవగాహన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు ఈ తరగతులకు శిక్షణ అందిస్తారని, టెట్ పరీక్షకు హాజరయ్యే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి. మనోజ్ కుమార్, మండల శాఖ అధ్యక్షుడు బి. శంకర్, ప్రధాన కార్యదర్శి టి. క్రాంతికుమార్, ట్రెజరర్ టి. వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు, మండలంలోని పలు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డుపై చెత్తను తొలగించాలని అధికారులకు బిజెపి వినతి



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

జనతా వారిది కార్యక్రమంలో భాగంగా బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర వేగేశ్వరపురం నుంచి అన్నదేవరపేట, తిరుగుడి మెట్ట వెళ్లే ప్రధాన రహదారిని సందర్శించి, రోడ్డుపై చెత్త వేయడం వల్ల రైతులు, గ్రామ ప్రజ లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రంను పరిశీలించి, దానిని సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావడానికి చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై అధికారులతో, నాయకులతో చర్చించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం, చెత్త నిర్వహణను మెరుగుపరచడం, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం అవసరమని పిక్కి నాగేంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి మండల బీజేపీ అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, బీజేపీ సీనియర్ నాయకుడు బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, జిల్లా మరియు మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# అభివృద్ధి బాటలో తాడిపూడి విశాల సహకార పరపతి సంఘం

- అధ్యక్షుడిగా కొండబాబు విజయవంతంగా ఏడాది పూర్తి..
- రైతు సంక్షేమమే లక్ష్యమని వెల్లడి

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**





రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా తాడిపూడి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నామా వెంకట సుబ్బారావు (కొండబాబు) విజయవంతంగా ఏడాది పాలన పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ "పారదర్శకత - రైతు నేస్తం" అనే నినాదంతో సొసైటీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నామని తెలిపారు. తొలి ఏడాదిలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు.

చాలా ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన సొసైటీ గోదామును యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి రైతులకు ఎరువులు, విత్తనాల నిల్వకు అనుకూలంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అర్హులైన రైతులందరికీ పంట రుణాలను ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేశామని తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తుల కోసం ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య పరీక్షలు, కళ్లజోళ్లు, మందులను ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. సుమారు రూ.50 లక్షల డిపాజిట్ల సేకరణలో ప్రత్యేక చొరవ తీసుకుని, లాకర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా సొసైటీ ద్వారా కొనుగోలు చేసి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సబ్సిడీ ధరలకు అందించడం ద్వారా మధ్యవర్తుల వ్యవస్థను తగ్గించామని పేర్కొన్నారు. యూరియా సహా అవసరమైన ఎరువులను రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే జెడ్పీ గ్రాంట్ నిధులతో సొసైటీకి వెళ్లే రహదారి, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్, సేంద్రియ వ్యవసాయం, సహజ వ్యవసాయం వంటి ఆధునిక సాగు విధానాలపై రైతులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. "రైతే రాజు" అనే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా సొసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని కొండబాబు అన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్ర షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు, అలాగే రైతులు, గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సహకారంతో సొసైటీని మరింత బలోపేతం చేసి రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# రాష్ట్ర సమాచార కమిషనర్ సుడిగాలి పర్యటన సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ జి. ఆదెన్న

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషనర్ జి . ఆదెన్న క్షేత్రస్థాయిలో శుక్రవారం విస్తృతంగా పలు ప్రాంతాలలో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. తొలుత అనంతపురం నగరంలోని జీసస్ నగర్ సచివాలయం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా కోర్టు, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్, కోర్ట్ రోడ్ లోని ప్రభుత్వ పాఠశాల , బుక్కరాయసముద్రం, నార్పల, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాలలో ఆకస్మికంగా సందర్శించి ఆర్టీ దరఖాస్తుల స్వీకరణ వాటి సకాలంలో పరిష్కారం పెండింగ్ వివరాలను సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలు తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రజలకు సమాచారాన్ని పారదర్శకంగా జవాబుదారీ తనంతో అందించడం ప్రతి ప్రభుత్వ అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్టిఏ చట్టం ప్రజా స్వామ్యంలో పారదర్శకత జవాబుదారితనాన్ని పెంపొందించే కీలక సాధనమని తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ముఖ్యంగా సమాచార హక్కు చట్టం- 2005 లోని సెక్షన్ 4 (1) (ఎ) ఇతర శాసన బద్ధమైన బాధ్యతలను పాటించడంలో ప్రాథమికంగా వైఫల్యం చెందిన పలువురు పి ఐ ఓ లకు తనిఖీల భాగంగా షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ సంద



ర్భంగా రాష్ట్ర సమాచార కమిషనర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్లు 18(3) 18 (4) 19 (8) (ఏ) కింద తనిఖీ చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన తనిఖీలలో పలు లోపాలను గుర్తించడం జరిగిందని అదేవిధంగా నిబంధనలో ఉల్లంఘనలు జరిగాయని పేర్కొన్నారు. ముఖ్యంగా సిటిజన్ చార్టర్ ప్రదర్శించబడలేదని సదరు ఆయా పిఐఓలు ఆర్టిఐ చట్టం పట్ల అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మరికొన్నిచోట్ల ప్రజా సమాచార అధికారి మొదటి అప్పిలేట్ అధికారి పేర్లు సంప్రదింపు వివరాలు చూపే డిస్ప్లే బోర్డులు కార్యాలయంలో లేనందున వాటిని సక్రమంగా ప్రదర్శించాలని సూచించారు. తన పర్యటనలో ప్రాథమిక పరిశీలనలో బాధ్యతలను పాటించడం లో ప్రాథమికంగా విఫలమైన వారికి సమాచార హక్కు చట్టం 2005లోని సెక్షన్ 19 (8) (ఎ) కింద షోకాస్ నోటీసులను జారీ చేయడం జరిగిందని ఈ నోటీసులు అందిన 15 రోజుల లోపు వివరణ ఇవ్వవలసిందిగా ఆదేశించినట్లు పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా సంతృప్తికరమైన



వివరణ సమర్పించడంలో విఫలమైతే అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తదుపరి నోటీసులు ఇవ్వకుండానే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర సమాచార కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రథమ అప్పీల్ల అధికారులు,ప్రజా సమాచార అధికారులు, సహాయ ప్రజా సమాచార అధికారులు చట్టంలోని నిబంధనలు దరఖాస్తుల పరిష్కారం అప్పిళ్ళ నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని కమిషన్ సూచనలను అధికారులు తప్పనిసరిగా అమలు చేసే ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. షోకాజు నోటీసుల వివరాలు ఇలా ఉన్నాయి... అనంతపురంలోని 39, 45, 48 సచివాలయం అడ్మిన్ పి ఐ ఓ రఘునాథ్, జిల్లా కోర్టు నిర్మల, ప్రభాకర్, టూ టౌన్ ఎస్ఐ పుల్లయ్య, మున్సిపల్ కార్పొరేషన్ సూపరిటెండెంట్ సంధ్యా, మేనేజర్ అబ్దుల్ ఖయ్యూం తదితరులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి..అలాగే బుక్కరాయసముద్రం తాసిల్దార్, పంచాయతీ కార్యాలయాలు, నార్పల తాసిల్దార్, ఎంఈఓ, ఆత్మకూరు తాసిల్దార్ ఎంపీడీవో కార్యాలయాలు కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయాలను రాష్ట్ర సమాచార కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన రాష్ట్ర సమాచార కమిషనర్ నగరంలోని కోర్ట్ రోడ్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా రాష్ట్ర సమాచార కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి కొంత మంది విద్యార్థులకు భోజనాన్ని అందించారు. ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం సిటిజన్ చార్టులను నిబంధన మేరకు ఏర్పాటు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఇప్పటి నుండే కష్టపడి ఇష్టపడి బాగా చదవాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. నీటి వసతి కల్పించాలని మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించిన కమిషనర్...పాఠశాలలో విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రస్తుతం మంచినీటి పైపులైన్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేసే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, రెండవ పట్టణ సిఐ పుల్లయ్య, ఎస్సై రామకృష్ణ వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియపై నిర్లక్ష్యం వీడాలి..జూలై 14 తుది గడువు

### అర్హులు ఓటును కోల్పోవద్దు.. - సర్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్.

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

క్షేత్రస్థాయిలో " సర్" ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ -2026 ప్రక్రియను శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాయ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వార్డుల లో విధులు నిర్వర్తిస్తున్న బిఎల్ ఓల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని బిఎల్ఓలు బిఎల్ఎలతో మాట్లాడుతూ ఈనెల 14 సర్ ప్రక్రియ తుది గడువు ముగుస్తుందని అందువల్ల ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతంగా గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుతం తమ సొంత ఊరిలో అందుబాటులో లేని వారు ఇటీవల ఇల్లు మారిన కుటుంబాలు లేదా ఓటర్ లిస్ట్ లో పేరు లేదని



ఆందోళన చెందుతున్న అర్హులైన ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకునే విధంగా అవసరమైన మేరకు చర్యలు తీసుకొని తగిన సమాచారాన్ని అందించి అలాంటి వారిని గుర్తించి పూర్తి వివరాలతో ఆన్లైన్ లో ఎన్యుమరేషన్ చేయాలని తెలిపారు. సర్ ప్రక్రియపై ప్రజలు నిర్లక్ష్యం వీడాలని అర్హులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు కోల్పోద్దని ఈ ప్రక్రియపై అవగాహన కలిగి తమ ఓటును కాపాడుకోవాలని వెంటనే ఆన్ లైన్ ఎన్యుమరేషన్ లో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతపురం నగరంలోని 45 వార్డ్ పరిధిలో ఉన్న 168,169, 170 , 171 పోలింగ్ కేంద్రాల ఓటర్లను కలిసి సర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయా సచివాలయాన్ని సందర్శించి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమర్థవంతంగా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటివరకు నమోదవుతున్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఎలతో పాటు ఇతర ఉద్యోగ సిబ్బందిని మరింతగా ఏర్పాటుచేసి ప్రత్యేక సమావేశం నిర్వహించి రెండు రోజుల్లోగా పూర్తిస్థాయిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా గడువులోగా బిఎల్ఓ లతో ఆన్లైన్ నమోదు, మరణించిన వారు లేక శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, ద్వంద నమోదులు ఇతరులుగా గుర్తించిన వివరాలు లాంటి అంశాల లో సహకరించి పారదర్శకంగా సవరణల ప్రక్రియను జిల్లా ప్రజలు, డివిజన్ స్థాయి అధికారులు ఉద్యోగ సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ ఓ లు జోష్న, కృష్ణవేణి, శ్రావణి, బి ఎల్ ఏ నాగభూషణం వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుగ్గయ్య చౌదరి, మునవ్వర్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

## లేదంటే జూలై 30, 31న రాష్ట్రవ్యాప్తంగా మహా ధర్నాలు

### -వేతనాలు పెంచేంతవరకు పోరాటం ఆగదు: నాగేంద్ర కుమార్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అంగన్వాడీల జాతీయ కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో



సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్, జిల్లా అధ్యక్షుడు ఆర్.వి. నాయుడు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే. రమాదేవి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ. నల్లప్ప తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు అంగన్వాడీల వేతనాలు పెంచుతామని, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రజలను నమ్మించి ఓట్లు పొందిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికొదిలేయడం ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయడమేనని అన్నారు. గత 18 సంవత్సరాలుగా అంగన్వాడీల వేతనాల్లో ఎలాంటి పెంపు లేదని, ఈ కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు 300 శాతానికి పైగా పెరిగినా అంగన్వాడీ వర్కర్‌కు కేవలం రూ.11,500, హెల్పర్‌కు రూ.7,500 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వేతనాలతో కుటుంబాలను ఎలా పోషించాలని ప్రభుత్వం భావిస్తోందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు లక్షల్లో వేతనాలు, అలవెన్సులు, పెన్షన్లు అందుతున్నాయని, చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంక్షేమం కోసం రోజంతా సేవలందించే అంగన్వాడీ మహిళలకు మాత్రం కనీస జీవన వేతనం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. "ఇదేనా మహిళా సాధికారత? ఇదేనా మహిళలకు గౌరవం?" అని ప్రశ్నించారు. నవచేతన యాప్ పేరుతో రోజురోజుకూ కొత్త పనులు, అదనపు బాధ్యతలు మోపుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మించిన పని చేయిస్తున్నారని, కానీ వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. పని ఒత్తిడి, అధికారుల వేధింపులు, అవమానాలు తప్ప ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చింది ఏమీ లేదని మండిపడ్డారు. గుజరాత్ హైకోర్టు తీర్పు స్ఫూర్తికి అనుగుణంగా దీర్ఘకాలంగా పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఉద్యోగ హోదా కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, గ్రాట్యుటీతో పాటు అన్ని ఉద్యోగ హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు కనీసం రూ.26,000 వేతనం చెల్లించాలని, నవచేతన యాప్‌ను వెంటనే ఉపసంహరించాలని, ఎన్నికల హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వానికి ఇదే చివరి హెచ్చరిక అని పేర్కొంటూ, అంగన్వాడీలను ఇకపై తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరించారు. వేతనాలు పెంచకపోతే, ఎన్నికల హామీలు అమలు చేయకపోతే జూలై 30, 31 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద మహా ధర్నాలు నిర్వహిస్తామని ప్రకటించారు. అంగన్వాడీలతో పాటు కనీస వేతనాలు అమలు కాని లక్షలాది మంది కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. వేతనాలు పెంచేంతవరకు, హక్కులు సాధించేంతవరకు పోరాటం ఒక్క అడుగు కూడా వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గోపాల్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి కాత్యాయని, ప్రాజెక్టు నాయకులు మేరీ, రాధా, గోవిందమ్మ, రేష్మ, కళ్యాణి, భాగ్య, విజయనిర్మల, మహాలక్ష్మి, షాహిన్, రామాంజమ్మ, ధనలక్ష్మి తదితరులతో పాటు జిల్లాలోని అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల నుంచి పెద్ద సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, సెక్టార్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు ఏర్పాట్లు పూర్తి

### -రెండు రోజులు పాటు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్
### --తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి వెంకటేష్


ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ --సర్) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో హిందూపురం నియోజకవర్గంలోని 157--హిందూపురం శాసనసభ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి వెంకటేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు ఉదయం నుంచి అందుబాటులో ఉండి ఎన్యూమరేటర్ ఫారాలు స్వీకరించడం, వాటిని పరిశీలించడం, అవసరమైన వారికి మార్గనిర్దేశం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేటర్ ఫారాలను ఈ నెల 14వ తేదీ సాయంత్రం వరకు మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తప్పనిసరిగా తమ ఫారాలను సమర్పించాలని సూచించారు. అలాగే 11, 12 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని, 14వ తేదీలోపు ఎన్యూమరేటర్ ఫారాలను సమర్పించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారి వెంకటేశు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా గోపూజ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గోపూజను ఘనంగా నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని అనంత పద్మనాభ స్వామి దేవాలయ సమీపంలో గోపూజ చేపట్టారు. వివిధ గ్రామాలకు చెందిన కైవారం తాతయ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహా మంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సద్గురు యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్, గంగాధరప్ప, రామప్ప, లక్ష్మీనారాయణ, రామాంజప్ప, శివ, రాజప్ప, నారాయణప్ప, బాబన్న తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు సప్తగిరి విద్యార్థి -అభినందించిన యాజమాన్యం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో ప్రథమ సంవత్సరం బిబిఏ చదువుతున్న విద్యార్థి పవన్ కుమార్ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సౌత్ జోన్ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో కళాశాలకు చెందిన ఎన్.పవన్ కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ కు ఎంపికయ్యారు. సప్తగిరి డిగ్రీ కళాశాలలో విద్యతో పాటు క్రీడలను కూడా పెద్ద ఎత్తున ప్రోత్సహించడం జరుగుతుందని సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాలల పి.శ్రీనాథరెడ్డి, ఏఓ బి.గంగిరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థి సౌత్ జోన్ జట్టుకు ఎంపిక కావడం పట్ల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు, తోటి విద్యార్థులు పవన్ కుమార్ ను అభినందించారు.

# కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి -పిడిఎస్ యూ డిమాండ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లోనూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యూ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హిందూపురం పట్టణంలో పిడిఎస్ యూ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ, ప్రభుత్వం సెలవులు ప్రకటించినప్పటికీ అనేక కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను పాఠశాలలకు రప్పించి ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. విశ్రాంతి తీసుకోవాల్సిన రోజుల్లో కూడా చదువుల ఒత్తిడి పెంచడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థల ఎదుట పిడిఎస్ యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పిడిఎస్ యూ విద్యార్థి సంఘం నాయకులు నాగేంద్ర, మహేష్, నందీష్, అనిల్, మంజునాథ్, దిలీప్ కుమార్, నంజుండేశ్వర, సురేష్, అనుదీప్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సేవల్లో వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలి

### -పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి డిపీఎంఓ డాక్టర్ పద్మజ సూచన

ప్రజాభూమి, హిందూపురం టౌన్




ఆరోగ్య సేవల్లో వందశాతం లక్ష్యసాధనకు కృషి చేయాలి డిపిఎమ్ఓ డాక్టర్ పద్మజ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఇందిరా నగర్ పట్టణ ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అధికారి (డిపీఎంఓ) డాక్టర్ పద్మజ హిందూపురం మున్సిపల్ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు, ల్యాబ్ సేవలు, ఆర్‌సీహెచ్, హెచ్‌పీవీ, సీడీఎన్‌సీడీ, హై రిస్క్ గర్భిణులు, పూర్తి గర్భిణీ సంరక్షణ సేవలు తదితర అంశాలపై వార్డుల వారీగా సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. అన్ని ఆరోగ్య సేవల పారామీటర్లలో వంద శాతం లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని డాక్టర్ పద్మజ సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు నిర్వహించే పనులను అదే రోజున ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా డేటా అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. జిల్లా పనితీరు మరింత మెరుగుపడేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో డాక్టర్ ఎస్. ఉషా రాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు కె. శేఖర్, ఎ. రమేశ్‌బాబు, హెల్త్ అసిస్టెంట్లు సాయిప్రసాద్, జగదీశ్‌తో పాటు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన: వెనపూస రవీంద్రారెడ్డి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

వైఎస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రా రెడ్డి శుక్రవారం తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసానికి వెళ్లి, తోపుదుర్తి ఆత్మారామి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, టీడీపీ నాయకుల వైఖరి, రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను పక్కదారి పట్టించేందుకు టీడీపీ నాయకులు డైవర్ట్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాస్తవాలను మరుగునపరచే ప్రయత్నంలో భాగంగానే నిరాధార ఆరోపణలు చేస్తూ, వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. తోపుదుర్తి కుటుంబం ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రజా కుటుంబమని పేర్కొన్న ఆయన, ఆ కుటుంబానికి ప్రజల పూర్తి మద్దతుతో పాటు వైఎస్సార్సీపీ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలు, రాజకీయ కుట్రలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఎంత చేసినా సత్యమే చివరకు గెలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శనివారం 11 జూలై 2026

# ఎంఎస్ రాజు క్షమాపణ చెప్పాలి

## కుల రాజకీయాలు మానుకోవాలన్న దళిత నేతలు

## ఎంఎస్ రాజు రాజీనామా చేయాలి: గోటూరు చిన్నప్ప



ప్రజాభూమి,పులివెందుల

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని వైకాపా దళిత నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాజీనామా చేయాలని కోరారు. జగన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, కోళ్ల భాస్కర్, ఫైర్ రామకృష్ణ, చెన్నకేశవులు, చలపతి మాట్లాడారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో కుల ప్రస్తావన తీసుకురాలేదని, అయినా ఎంఎస్ రాజు కుల ప్రస్తావన ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఎంఎస్ రాజు ఎమ్మెల్యేగా గెలిచాక ఒక్క ఎస్సీ సోదరుడికి కూడా మేలు చేయలే దన్నారు. చంద్రబాబు నాయుడు 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్ ఇస్తానన్న హామీ అమలు చేయలేదని, దానిపై ఎంఎస్ రాజు పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో ఎస్సీలపై అక్రమ కేసులు పెడుతున్నారని, దానిపై స్పందించాలని డిమాండ్ చేశారు. అధికారం అడ్డుపెట్టుకొని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఇంటిపైకి వెళ్లడం నీతిమాలిన రాజకీయమని ఆరోపించారు.తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఎస్సీ సంక్షేమ హామీలను అమలు చేయాలని కోరారు. కులాన్ని అడ్డుపెట్టుకొని మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాళ్లపల్లెలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం

## - దోమల నివారణతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట

## - సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య



ప్రజాభూమి, వేంపల్లె

మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో శుక్రవారం పులివెందుల సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఫ్రైడే--డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి నిల్వ నీటిని పరిశీలించి, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాళ్లపల్లె వైద్యాధికారి డాక్టర్ పూర్వజ మాట్లాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి శుక్రవారం ఇళ్లలో నిల్వ నీటిని తొలగించి, కూలర్లు, పూల కుండీలు, టైర్లు తదితరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి చికిత్స పొందాలని కోరారు. అనంతరం సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ, దోమల నివారణతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు. గ్రామస్తుల భాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల లార్వా ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు అంకయ్య, తులసమ్మ, ఆరోగ్య కార్యకర్త లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు సౌజన్య, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల విమర్శలు అర్ధరహితం

## - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



ప్రజాభూమి, వేంపల్లె

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాజకీయ పార్టీలు చేస్తున్న విమర్శలు అర్ధరహితమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన సమావేశంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ, మరణించినవారు, ఇతర ప్రాంతాలకు లేదా విదేశాలకు వెళ్లిపోయినవారు, అక్రమంగా వలస వచ్చిన వారి పేర్లను తొలగించి ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 1952 నుంచి దేశవ్యాప్తంగా పలుమార్లు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలు నిర్వహించారని, ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియను రాజకీయ కోణంలో చూడడం సరికాదన్నారు. ఈసారి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో ఓటరు జాబితాను పరిశీలించి నకిలీ, అక్రమ ఓట్లను గుర్తించి తొలగించడమే లక్ష్యమని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ మతానికో, వర్గానికో వ్యతిరేకం కాదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను నవీకరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకుడు ముద్ది శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో జులై 11-12 న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

## ఓటర్ల జాబితా సవరణకు అధికారుల ఏర్పాట్లు

## ప్రజలు సహకరించాలన్న మున్సిపల్ కమిషనర్



ప్రజాభూమి,పులివెందుల

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )2026 కార్యక్రమానికి పులివెందుల మున్సిపాలిటీ అధికారులు సన్నాహాలు చేశారు. ఈ కార్యక్రమం జూలై 11, 12 తేదీల్లో మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించనున్నారు. ఓటర్ల జాబితాలో కొత్త పేర్ల నమోదు, సవరణలు, తొలగింపుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్లు,బూత్ లెవెల్ ఏజెంట్లు,ఇతర అధికారులకు సూచనలు జారీ చేశారు. ఇంటింటి సర్వే ద్వారా వివరాలు సేకరించి వాటిని డిజిటలైజ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.పౌరులు ఈ కార్యక్రమానికి సహకరించి సరైన వివరాలు అందించాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్, విజ్ఞప్తి చేశారు.

## నేడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

### - చెట్ల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 8:30 నుంచి 11:30 వరకు అంతరాయం- ఇన్‌చార్జి ఏఈ మైకేల్ జాక్సన్

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని 11 కేవీ గవి మల్లేశ్వర ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో నేడు శనివారం ఉదయం 8:30 గంటల నుంచి 11:30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ మైకేల్ జాక్సన్ తెలిపారు. ఎంఎంఆర్ కళ్యాణ మండపం, సాదక్ రైస్ మిల్, రవి రెడ్డి పెట్రోల్ బంక్, జీపుల స్టాండ్, వాటర్ వర్క్స్, పాలిటెక్నిక్ కళాశాల, ఎస్ఆర్ నగర్, పుల్లయ్య తోట, సప్తగిరి రైస్ మిల్, గండి రోడ్, ఇమామ్ నగర్, తిరుమల హాలు ప్రాంతం, మటన్ సెంటర్ ప్రాంతం, గాంధీ రోడ్, అర్ధ కేజీ సందు, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఇన్‌చార్జి ఏఈ మైకేల్ జాక్సన్ విజ్ఞప్తి చేశారు.

# కోరిన కోరికలు తీర్చే తల్లిచౌడమ్మ తల్లి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు, అమ్మవారిని దర్శించిన వారికి సకల నరఘోష తొలగి జన,ధన ఆకర్షణ శక్తి పెరుగుతుంది అని తెలిపారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ 12-08-2026 అమ్మవారి జయంతి సందర్భముగా అన్నదానము ఏర్పాటు చేయడమైనది,ఎవరైనా అన్నదానమునకు విరాళములు ఇవ్వగలరని తెలిపారు.కష్టాలలో ఉన్నపుడు శుక్రవారము లేదా పౌర్ణమి రోజున 108 ప్రదక్షిణములు చేసి అమ్మని వేడుకుంటే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకము, ప్రతీ పౌర్ణమి రోజున సాయంత్రము ఆలయ ప్రాకారోత్సవము జరుగును. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేయుట జరుగుతుందని తెలిపారు.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి..ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు.

# నూతన పంచాయతీ ఈఓగా జీ. కవిత బాధ్యతలు

## - సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : నూతన ఈఓ



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక గ్రామ పంచాయతీ నూతన ఎగ్జిక్యూటివ్ అధికారిణి (ఈఓ)గా జీ. కవిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈఓ జీ. కవిత మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి సత్వర చర్యలు చేపడతామని తెలిపారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రమణయ్య, పంచాయతీ సిబ్బంది శివరామ్, చాను, గౌస్, రాహుల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లి--చాగలమర్రి రహదారి విస్తరణకు మోక్షం లేదా?

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

వేంపల్లి--చాగలమర్రి జాతీయ రహదారి విస్తరణ పనులకు ఇప్పట్లో మోక్షం లేదా? అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం వేంపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ, వేంపల్లి--వీరపునాయునిపల్లి--యర్రగుంట్ల--ప్రొద్దుటూరు--కొర్రపాడు--రాజుపాలెం--చాగలమర్రి జాతీయ రహదారి (ఎన్‌హెచ్--440)ను రెండు/నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం 2023--24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,321.02 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసిందన్నారు. ఈ రహదారి మొత్తం పొడవు 78.95 కిలోమీటర్లు అని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు టెండర్లు పూర్తి కాగా, ఎన్ఎస్‌పీఆర్ కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పనులు చేపట్టేందుకు ఎంపికైందన్నారు. అయితే జిల్లా రెవెన్యూ యంత్రాంగం భూసేకరణ పూర్తి చేయకపోవడంతో మూడేళ్లు గడిచినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం

ప్రజభూమి,పులివెందుల

నేడు మండలంలోని కొన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునుందని విద్యుత్ రూరల్ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. శనివారం ఉదయం 8 గంటల నుండి 12.00 గంటల వరకు 11 కెవి కొట్లపాడు ఫీడర్ , 11 కెవి అచ్చువెళ్ళి ఫీడర్, 11 కెవి ఎన్ఆర్ పల్లి 1 ఫీడర్ క్రింద చెట్లు తొలగింపు కార్యక్రమం వున్నందున పెద్దరంగాపురం,అచ్చువెల్లి, ఎర్రిపల్లి,, నల్లపురెడ్డిపల్లి, గ్రామాల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలగనుందని, కావున దయచేసి ప్రజలు,రైతులందరూ సహకరించాలని ఆయన కోరారు.

# గ్రామీణాభివృద్ధిలో వేగం - జాతీయస్థాయిలో రెండవ స్థానం ఆంధ్రప్రదేశ్



ప్రజాభూమి పోరుమామిళ్ల :

పల్లె ప్రగతికి రహదారులే పునాది – పవన్ కళ్యాణ్ ఆలోచనలకు జాతీయ గుర్తింపుగా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో



ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు అత్యంత కీలకం. ఒక గ్రామానికి నాణ్యమైన రహదారి అందుబాటులో ఉంటే విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, వాణిజ్యం వంటి అన్ని రంగాల్లో అభివృద్ధికి మార్గం సుగమమవుతుంది. ఈ విషయాన్ని ఎన్నో సందర్భాల్లో ప్రజలకు వివరించిన నాయకుల్లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒకరు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించిన సందర్భంగా గ్రామీణ రహదారుల సమస్యలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. దెబ్బతిన్న రహదారుల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించడంలో ఎదురయ్యే సమస్యలు, విద్యార్థులు మరియు అత్యవసర వైద్య సేవలకు కలిగే ఆటంకాలను ఆయన అనేక సభల్లో ప్రస్తావించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారుల అభివృద్ధి జరగాలని ఆయన పదేపదే పేర్కొన్నారు. నేపథ్యంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన అమలులో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా రెండోస్థానం సాధించడం రాష్ట్రానికి ఒక ముఖ్యమైన గుర్తింపుగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, నాణ్యత ప్రమాణాలు, పనుల పురోగతి వంటి అంశాల్లో రాష్ట్రం మంచి ఫలితాలు సాధించడం అభివృద్ధిదిశగా ముందడుగుగా భావించవచ్చు. పవన్ కళ్యాణ్ తన పర్యటనల్లో గ్రామాల వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా గమనించి, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంపై దృష్టి సారించారు. ప్రజా అవసరాలపై జరిగిన ఈ చర్చలు, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పరస్పరం ఒకే లక్ష్యాన్ని ప్రతిబింబి స్తాయి--గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన లో రెండో స్థానం రావడం కేవలం ఒక ర్యాంకు మాత్రమే కాదు; గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యానికి లభించిన గుర్తింపుగా కూడా దీనిని చూడవచ్చు. నాణ్యమైన రహదారులు నిర్మించబడితే గ్రామాల ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది, విద్యార్థులకు విద్యాసంస్థలకు చేరుకోవడం సులభమవుతుంది, అత్యవసర వైద్య సేవలు వేగంగా అందుతాయి, రైతులకు మార్కెట్ అనుసంధానం మెరుగుపడుతుంది. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టడం, గ్రామీణ మౌలిక వసతులను బలోపేతం చేయడం వంటి అంశాలు అభివృద్ధికి కీలకమైనవి. ఈ దిశగా రాష్ట్రం సాధించిన జాతీయ స్థాయి గుర్తింపు భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలకు ప్రేరణగా నిలవాలని ఆశిద్దాం. ముగింపుగా, పల్లె ప్రగతికి రహదారులే జీవనాడి. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు కొనసాగితే గ్రామాలు బలపడతాయి, రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో ఆంధ్రప్రదేశ్‌కు లభించిన రెండో స్థానం ఆ దిశగా ఒక ముఖ్యమైన విజయంగా నిలిచింది.

# అభివృద్ధి పనుల్లో అక్రమాలు, ఇసుక దోపిడీపై విచారణ జరపాలి

## - టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజుపై మాజీ రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య ఆరోపణలు



ప్రజాభూమి, సిద్ధవటం: రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కేటాయింపులు, ఇసుక దోపిడీ, పార్టీ వ్యవహారాల్లో జరుగుతున్న అక్రమాలపై పార్టీ అధిష్ఠానం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మాజీ రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య డిమాండ్ చేశారు. సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామంలో శుక్రవారం టీడీపీ ఎన్నారై విభాగం సీనియర్ నాయకుడు చలపాటి చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అభివృద్ధి పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని, పార్టీకి ఫిర్యాదు చేసిన సీనియర్ నాయకులను కోవర్టులుగా ముద్ర వేయడం సరికాదని విమర్శించారు. ఇసుక దోపిడీ, అక్రమాలపై ఇప్పటికే పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశామని, అవసరమైతే జాతీయ హరిత ట్రిబ్యునల్ ఎన్‌జీటీ ను కూడా ఆశ్రయిస్తామని తెలిపారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన సీనియర్ నాయకులకు ప్రాధాన్యత తగ్గించి, ఇటీవల పార్టీలో చేరిన వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కార్యకర్తల్లో అసంతృప్తి నెలకొందని అన్నారు. ఈ సమావేశంలో కొండ శ్రీనివాసులు, నీతి ఆంజనేయులు, మామిళ్ల ఈశ్వరయ్య, చలపాటి చంద్ర, లక్ష్మీనరసయ్య, పామూరు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివకుమార్, రామకృష్ణ, మురళీమోహన్, దత్తాత్రేయ, కృష్ణారెడ్డి, వినోద్‌రెడ్డి, సయ్యద్ చాంద్‌బాషా, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధా మురళి, నూకల రమేష్‌బాబు తదితరులతో పాటు రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం, వీరబల్లి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రంగనాథస్వామి ఆలయ మాన్యం భూముల ఆక్రమణపై ఆందోళన



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం మండలంలోని శాఖరాజుపల్లి రెవెన్యూ పరిధిలో గల ఉప్పరపల్లి శ్రీదేవి--భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి ఆలయానికి చెందిన దేవుని మాన్యం భూములు ఆక్రమణకు గురయ్యాయనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఆలయానికి చెందిన విలువైన భూములను కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ నిర్వహణ, నిత్యకైంకర్యాల కోసం కేటాయించిన మాన్యం భూములు అన్యాక్రాంతం కావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆలయ భూములపై సమగ్ర విచారణ చేపట్టి, ఆక్రమణలను తొలగించి స్వామివారి ఆస్తులను పరిరక్షించాలని భక్తులు కోరుతున్నారు. అలాగే అక్రమ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

## రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవిగంజి మాల



ప్రజాభూమి, సిద్ధవటం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని నాణ్యతలో ఎలాంటి లోపం లేకుండా విద్యార్థులకు అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవిగంజి మాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్ధవటం మండలం భాకరాపేటలోని చౌకధరల దుకాణం, జిల్లా పరిషత్ పాఠశాల వంటశాల, స్టోర్‌రూమ్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పౌష్టికాహారంలోనూ నాణ్యతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. చౌకధరల దుకాణాల ద్వారా అర్హులైన ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారునికి నిత్యావసర వస్తువులు సకాలంలో అందేలా డీలర్లు బాధ్యతగా వ్యవహరించాలని, రేషన్ పంపిణీపై వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో మండల విద్యాశాఖ అధికారి నాగరత్న, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకేసమ్మ, వీఆర్వో హరికృష్ణ, అంగన్‌వాడీ సూపర్వైజర్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ శీతల గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు..

## ఈ నెల 29, 30న జాతర మహోత్సవం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామపంచాయతీ పరిధి పార్వతీపురం గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ శీతల గంగమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొబ్బరికాయలు సమర్పించి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రంగమ్మ మాట్లాడుతూ, ఈ నెల 29, 30 తేదీల్లో బుధ, గురువారాలు శ్రీ శీతల గంగమ్మ తల్లి 23వ వార్షిక జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# వన మహోత్సవంలో భాగంగా ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో 1,000 మొక్కల నాటకం



ప్రజాభూమి, సిద్ధవటం: పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీఎస్పీ 11వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఆనంద్ రెడ్డి పిలుపునిచ్చారు. సిద్ధవటం మండలం బాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వీబీజి పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కమాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ, కాలుష్య నియంత్రణకు పచ్చదనం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత వహించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా వీబీజీ పథకం ద్వారా కూలీల సహకారంతో 1,000 మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ప్రసాద్, రాజశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ వేణు, ఫీల్డ్ అసిస్టెంట్ పుల్లయ్య, మేటి, రెడ్డయ్యతో పాటు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 11 జూలై 2026

## తిరుపతి నేల నుంచి టాలీవుడ్‌కు మరో ప్రతిభ...

**'లెనిన్'తో దర్శకుడిగా మురళి కిషోర్ అబ్బూరు ముద్ర**

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రాపురం




రామచంద్రాపురం మండలం (పద్మావళ్ళీపురం, కమ్మకం డ్రిగ) తోక గుట్ట ఇండ్లు కు చెందిన అబ్బూరి దేవరాజులు నాయుడు, మురళి దంపతులు ముద్దు బిడ్డ యువ దర్శకుడు (నంద కిశోర్) మురళి కిషోర్ అబ్బూరు టాలీవుడ్‌లో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. గ్రామీణ జీవితంలోని భావోద్వేగాలను సహజత్వంతో వెండితెరపై ఆవిష్కరించే దర్శకుడిగా ఆయనకు ఇప్పటికే మంచి పేరు వచ్చింది. వినరో భాగ్యము విష్ణు కథ చిత్రంతో దర్శకుడిగా తన ప్రతిభను చాటుకున్న (నంద కిశోర్) మురళి కిషోర్ అబ్బూరు, ఇప్పుడు లెనిన్ చిత్రాన్ని అత్యంత ప్రభావవంతంగా తెరకెక్కించారు. రాయలసీమ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు, పాత్రల సహజత్వం, కథను నడిపించిన తీరు ఆయన దర్శకత్వ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సినిమాలో ప్రతి సన్నివేశాన్ని ప్రేక్షకుడు కథలో భాగమైనట్లు అనిపించేలా మలచడంలో ఆయన చూపిన శ్రద్ధ ప్రత్యేకంగా కనిపిస్తుంది. కమర్షియల్ అంశాలతో పాటు భావోద్వేగాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వడం మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వానికి మరో బలంగా చెప్పవచ్చు. రామచంద్రాపురం మండలం ప్రాంతానికి చెందిన ఒక యువ దర్శకుడు టాలీవుడ్‌లో తన ప్రతిభతో నిలదొక్కుకోవడం స్థానికులకు గర్వకారణంగా మారింది.

## వైభవోపేతంగా సి. రామాపురం లో అర్జున తపస్సు

ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం



రామచంద్రాపురం మండలం సి రామాపురం గ్రామంలో ధర్మరాజుల గుడి ఆవరణంలో గత 15 రోజులుగా మహాభారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహాభారత ఉత్సవాలలో భాగంగా అర్జున తపస్సు భక్తిశ్రద్ధలతో జరిగింది. అర్జునుడు విసిరిన ప్రసాదాలకు మహిళలు భక్తులు అందుకోవడానికి పోటీపడ్డారు. ఈ



ప్రసాదాన్ని అందుకోవడం ద్వారా సంతాన ప్రాప్తి, పెళ్లి యోగం జరుగుతుందని భక్తుల విశ్వాసం. పాండవ మధ్యముడైన అర్జునుడు భవిష్యత్తులో జరగబోయే కురుక్షేత్ర యుద్ధంలో గెలవడానికి శ్రీకృష్ణుడు సలహా మేరకు మహాశివుడిని ప్రసన్నం చేసుకుని అరివీర



భయంకర అస్త్రం పొందడానికి బయలుదేరి తపస్సులో కూర్చుని పాశు పతాస్త్రం సంపాదిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ అర్జున తపసకు గ్రామానికి చెందిన కొట్టె ముద్దు కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా పూజా సామాగ్రి మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకొని ఆలయ పూజారికి అందించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిరోహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఏఈకి వినతి పత్రం:సిపిఐ మించలశివకుమార్

ప్రజాభూమి ప్రతి నిధి
శ్రీకాళహస్తి రూరల్



శ్రీకాళహస్తి మండలం గంగలపూడి సుమారు 30 మంది రైతులకు విద్యుత్ సౌకర్యం లేక పంట భూములన్నీ బీడు భూములుగా మారాయని కొనియాడారు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీడు భూములన్నీ పరిశీలించడం జరిగింది ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మించల శివకుమార్ పాల్గొని మాట్లాడుతూ గంగల పూడి బడా భూస్వామి తగిలం చెట్లు పెట్టి విద్యుత్ వైర్లు చెట్లకు తగులుతాయని చెట్లు పాడైపోతాయని రైతులు మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం తో పంట భూములన్ని గత ఐదు నెలలుగా పంటకు నోచుకోకుండా రైతులు ఇబ్బంది పడుతున్నారని సంబంధిత అధికారులు ఏఈ కరిముల్లా పంట పొలాలను పరిశీలించి జరిగిందన్నారు సంబంధిత అధికారులు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అనంతరం ఏఈ కీ వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏ బాల రాజయ్య వెంకటసుబ్బయ్య రాజా నాగరాజు పాల్గొన్నారు

## పాడి రైతులకు సబ్సిడీ పశుదాన పంపిణీ కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సూచనలతో పశుసంవర్ధక శాఖ కుప్పం బాదురు పశు వైద్యాధికారి భువనేశ్వరి మిట్ట కండిగ, కొత్త కంద్రిగ, పంచాయతీ రైతులకు, ప్రభుత్వ సబ్సిడీతో, మార్కెట్లో 1300 రూపాయలు విలువ ఉన్న మినరల్ మిక్చర్ ఫీడ్ రైతులకు 560 రూపాయలతో రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఎం తిరుమలరెడ్డి, యూనిట్ ఇంచార్జ్ కోరా హరి ప్రసాద్, క్లస్టర్ కో కన్వీనర్ లెక్కల మహేష్ నాయుడు, మండల తెలుగు రైతు అధ్యక్షులు లెక్కల రాజమాణిక్యం నాయుడు, టిడిపి జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి లెక్కల సురేంద్రనాయుడు, కుప్పం బాదు బూత్ ఇంచార్జ్ శేఖర్ నాయుడు, పశు వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి, వెటర్నరీ అసిస్టెంట్ బాల, ఈశ్వరయ్య, చెంచు రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,వై ఆర్ కంద్రిగ,పరమాల, మిట్టకంద్రిగ, టీవీ సపార్లు, గ్రామాల రైతులు పాల్గొన్నారు

## పాత పెన్షన్ విధానంపై హర్షం వ్యక్తం చేసిన 2004 బ్యాచ్ కానిస్టేబుళ్లు

ప్రజా భూమి ప్రతినిధి
చిత్తూరు




చిత్తూరు పట్టణంలోని పోలీస్ గెస్ట్ హౌస్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 2004 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2003 నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేస్తూ, కేంద్ర ప్రభుత్వ మెమో--57ను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఇరవై ఒకటేళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఉద్యోగుల సంక్షేమానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఆపరేషన్స్ అధికారి ఎస్. షాను, 2004 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# 14లోపు ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేస్తాం

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలో మొత్తం 13,39,675 ఓటర్ల వివరాల నమోదు పత్రాలను పంపిణీ చేయగా, వాటిలో 10,67,946 పత్రాల వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్ నమోదుకు అనుగుణంగా నమోదు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా జూలై 14వ తేదీలోపు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. ఇప్పటివరకు జిల్లాలో 36,205 మంది ఓటర్లను గుర్తించలేకపోయినట్లు గుర్తించామని, తుది క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఈ సంఖ్యలో మార్పులు ఉండే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 1,511 మంది బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నెల 14వ తేదీన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించి, 21వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు



కలెక్టర్ వెల్లడించారు. ప్రజలు భారత ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ అనువర్తనం లేదా ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న "బూత్ స్థాయి అధికారితో మాట్లాడండి" సేవను వినియోగించుకుని ఓటరు నమోదు, సవరణలు, ఇతర వివరాల కోసం బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు. అధికారులు, బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజల సహకారంతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర పునర్విమర్శ ప్రక్రియను నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.

# వైద్యుల విజ్ఞాన వికాసానికి ప్రాంతీయ అకాడమిక్ సదస్సు

**ఆగస్టు 2న తిరుపతిలో ఘనంగా నిర్వహణ - ప్రతి వైద్యుడు పాల్గొని విజయవంతం చేయాలి. డా. ఏ.ఆర్. రెడ్డి**

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

భారత వైద్య సంఘం (ఐఎంఏ) తిరుపతి శాఖ ఆధ్వర్యంలో జోన్--3 ప్రాంతీయ అకాడమిక్ సదస్సు (రీజినల్ అకాడమిక్ కాన్ఫరెన్స్) ఆగస్టు 2వ తేదీన తిరుపతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవడం, నూతన వైద్య విధానాలపై అవగాహన పెంచుకోవడం, వైద్యుల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ ఒకరోజు అకాడమిక్ సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత శ్రీ వేంకటేశ్వర స్వామివారి పుణ్యక్షేత్రమైన తిరుపతి సేవాభావం, వినయం, అంకితభావానికి ప్రతీక అని, అదే స్ఫూర్తితో వైద్య వృత్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే దిశగా ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. సదస్సులో దేశంలోని ప్రముఖ, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు వివిధ వైద్య అంశాలపై శాస్త్రీయ ఉపన్యాసాలు అందించనున్నారని తెలిపారు. నిత్య వైద్య సేవల్లో ఎదురయ్యే సవాళ్లకు ఉపయోగపడే అంశాలపై చర్చలు, పరస్పర అభిప్రాయాల మార్పిడి, ఆధునిక వైద్య పరిజ్ఞానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా వైద్యులలో ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసే సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం స్నేహ సమ్మేళనం, విందు కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సదస్సు కేవలం శాస్త్రీయ సమావేశమే కాకుండా వైద్యులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేసే అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. "ప్రతిభ పుట్టుకతో రాదు... నిరంతర సాధన, అంకితభావం,



క్రమశిక్షణతో ఏర్పడుతుంది. ఈ శతాబ్దంలో నిరక్షరాస్యుడు అంటే చదవడం, రాయడం రాని వ్యక్తి కాదు... నేర్చుకోలేని, నేర్చుకున్న దాన్ని అవసరానికి అనుగుణంగా మార్చుకోలేని, మళ్లీ కొత్త విషయాలను నేర్చుకోలేని వ్యక్తి" అని డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి అన్నారు. భారత వైద్య సంఘమే మన బలం అని పేర్కొన్న ఆయన, రాష్ట్రంలోని ప్రతి వైద్యుడు వ్యక్తిగతంగా కాకుండా ఒకే వైద్య కుటుంబ సభ్యుడిగా ఈ ప్రాంతీయ అకాడమిక్ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరి సహకారం, భాగస్వామ్యంతో ఈ జోనల్ అకాడమిక్ సదస్సు ఆంధ్రప్రదేశ్‌లో ఆదర్శవంతమైన కార్యక్రమంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 2వ తేదీన ఉదయం ప్రారంభమయ్యే ఈ సదస్సులో ప్రారంభోత్సవ కార్యక్రమం, శాస్త్రీయ సదస్సులు, వైద్య నిపుణుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం గాలా డిన్నర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని జోన్--3 పరిధిలోని వైద్యులందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి కోరారు.

# కొరమేనుగుంటలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం: తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి

- **తుడా నిధులతో నూతన మురుగునీటి కాల్వల నిర్మాణానికి ఘనంగా భూమి పూజ**
- **సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశం.**

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని కొరమేనుగుంటలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కరిస్తున్నామని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. సుమారు 49.5 లక్షల రూపాయల తిరుపతి నగరాభివృద్ధి సంస్థ నిధులతో నిర్మించతలపెట్టిన నూతన మురుగునీటి కాల్వల (డ్రైనేజీ) నిర్మాణ పనులకు తుడా చైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, టిటిడి బోర్డు మెంబెర్ పనబాక లక్ష్మి, గ్రీనరీ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి నగరపాలకక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి శారద, తుడా యస్ఈ రవీంద్రయ్య ప్రజా ప్రతినిధులు శుక్రవారం ఉదయం కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలనలో కొరమేనుగుంట ప్రాంత అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యంతో వదిలేశారని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక స్థానిక ప్రజలు, ఇళ్లలో మురుగునీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కొరమేనుగుంట పరిసర ప్రాంతాల్లో మురుగునీరు సరిగ్గా ప్రవహించక, వర్ష కాలంలో స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులు మా దృష్టికి వచ్చాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత, నగర సుందరీకరణే ధ్యేయంగా తుడా నిధులను కేటాయించి ఈ నూతన మురుగునీటి కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. గతంలో తుడాను కేవలం ఒకే ఒక్క నియోజకవర్గానికి పరిమితం





చేసి రాజకీయం చేశారని, మా కూటమి ప్రభుత్వంలో తుడా పరిధిలోకి వచ్చే తొమ్మిది నియోజకవర్గాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, కొరమేనుగుంటతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా నూతన కాల్వలు, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపా రు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపం చకూడదని అధికారులను ఆదేశించారు. తాము వినతి చేసిన వెంటనే ఆయన స్పం దించి, కేవలం 2 నెలల లోపే నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచి, ఈరోజు భూమి పూజ చేయడం మాకెంతో ఆనందాన్ని ఇచ్చిందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుడా,మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పల్లమాల సుధీర్ పరమపదించడం తీరని లోటు. : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



ఆర్టీసీ మాజీ చీవీఖ వైస్ ప్రెసిడెంట్, తెలుగు భాషా అభివృద్ధి సేవాసమితి అధ్యక్షులు మరియు సీనియర్ కార్మిక నాయకులు, మన శ్రీకాళహస్తికి చెందిన పల్లమాల సుధీర్ పరమపదించడం తీరని లోటు. శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని రామచంద్ర సినిమాహాల్ ఎదురుగా ఉన్న వారి నివాసానికి స్వయంగా వెళ్లి, సుధీర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించాను. అనంతరం వారి అంత్యక్రియల సన్నాహాల్లో పాల్గొని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేశాను. ఈ కష్టసమయంలో వారి కుటుంబానికి మన కూటమి ప్రభుత్వం మరియు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చాను. ఆ భగవంతుడు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా ప్రార్థిస్తున్నాను.

## అగరంపేటలో వివాహ వేడుకలో మాజీ మంత్రి ఆర్.కె. రోజా

ప్రజా భూమి ప్రతినిధి నింద్ర



నింద్ర మండలం అగరంపేట గ్రామానికి చెందిన జడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ కాటయ్య కుమారుడు సూర్య -- ప్రియ



వివాహ వేడుకలో మాజీ మంత్రి ఆర్.కె. రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన రోజా, వారి దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో, ఆయు రారోగ్యాలు, ఐశ్వర్యాలు, సిరిసంపదలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. జీవితాం తం పరస్పర ప్రేమ, అనురాగం, అవగాహనతో కలిసి ఆదర్శ దంపతులుగా నిలవాలని ఆశీర్వదించారు. అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో పాల్గొన్న బంధుమిత్రులు, అతిథులతో కాసేపు ముచ్చటిస్తూ కుటుంబ సభ్యులకు తన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్‌లో యువతకు అవగాహన కల్పించిన పోలీసు అధికారులు

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు "సురక్షిత చిత్తూరు -- మీ భద్రత మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, పెనుమూరు ఎస్ఐ డి. శ్రీనివాసులు పెనుమూరు మండలం పులిగుండులో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనల ప్రాముఖ్యతను వివరించిన అధికారులు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ఉపయోగించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని అవగాహన కల్పించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొంటూ స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని, కుల, మతాలకు అతీతంగా నేరరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను అలవరచుకోవాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రీడా నిర్వాహకులు, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.



## రాజుముద్ర తో కూడిన పట్టా పాస్ బుక్స్ పంపిణీ కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సూచనలతో సొరకాయల పాలెం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న మీ భూమి మీ హక్కు కార్యక్రమం లో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ రైతుల భూములను రీ సర్వే చేసి రైతులకు అధికారిక రాజముద్రతో కూడిన సరికొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమలరెడ్డి తెలిపారు. ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ముఖ్యమంత్రి శ నారాచంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి రోజు వివాదాస్పదమైన "ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను "రద్దు చేస్తూ తొలి సంతకం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ ఈ.ఉమాపతి నాయుడు,ఎం ఎస్ ఎం ఈ స్టేట్ డైరెక్టర్ చినబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ .గిరిబాబు, నియోజకవర్గ



తెలుగు రైతు అధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నీలకంత చౌదరి, కో యూనిట్ ఇంచార్జ్ చంద్రబాబు, గ్రామ కమిటీ చెంగయ్య, నాదముని యాదవ్, ఎమ్మార్వో మధుసూదన్ రావు, డిప్యూటీ ఎమ్మార్వో అమృత, వీఆర్వో ప్రదీప్, సెక్రటరీ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో ఘనంగా ప్రారంభమైన 'అభిమన్యు' చిత్రం షూటింగ్

## -చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపిన నవీన్ కుమార్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
డ్రీమ్ చేజర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తిలక్ రాయల్ హీరో, దర్శకుడిగా రూపొందిస్తున్న 'అభిమన్యు' చిత్రం శుక్రవారం తిరుపతిలో సంప్రదాయ ముహూర్త కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమైంది. తిరుపతిలోని కోనేటికట్ట వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చిత్రీకరణకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత ఎన్.వి. ప్రసాద్, బీజేపీ నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎన్.వి. ప్రసాద్ క్లాప్ కొట్టి చిత్రాన్ని ప్రారంభించగా, నవీన్ కుమార్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ తొలి షాట్‌కు యాక్షన్ చెప్పారు. డా. జి.ఎస్. ప్రసాద్, పగడాల మురళి కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ చిత్రంలో తిలక్ రాయల్, లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, భూషణమణి, రేణుక, రుహిక అర్జున్, గగన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సహ దర్శకులుగా శ్రీనివాస్ విక్రమ్, రామేశ్వరం, అనిల్, సినిమాటోగ్రాఫర్‌గా భరత్, అసిస్టెంట్ డైరెక్టర్లుగా మాధురి, విష్ణు, షణ్ముగన్, మహేష్, నితీష్, విజయ్, ధనుష్ పనిచేస్తున్నారు. లైటింగ్ విభాగాన్ని కిరణ్, కార్తీక్ నిర్వహిస్తుండగా, ఫైట్ మాస్టర్‌గా నవదీప్, సంగీత దర్శకుడిగా వివాన్ సూర్య, గేయ రచయితలుగా దినకర్, రవితేజ వ్యవహరిస్తున్నారు. చిత్రానికి బత్తల కృష్ణయ్య నిర్మాతగా ఉన్నారు. ఈ సందర్భంగా తిలక్ రాయల్ మాట్లాడుతూ, చిత్ర ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రాన్ని అత్యంత నిబద్ధతతో రూపొందిస్తున్నామని, ప్రేక్షకుల హృదయాల్లో నిలిచి పోయే చిత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తమ సినీ ప్రయాణానికి ప్రేక్షకుల ఆశీస్సులు, ఆదరణ అందించాలని కోరారు. నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు చలనచిత్ర పరిశ్రమ కన్నతల్లిలా అన్ని వర్గాల ప్రజలను అక్కున చేర్చుకొని ఆదరిస్తోందన్నారు. యువ నటీనటులు, దర్శకులను తెలుగు ప్రేక్షకులు ప్రోత్సహించి ఆదరించాలని పిలుపునిచ్చారు. తిరుమల శ్రీవారి దర్శనానికి హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు వచ్చి ఆశీస్సులు పొంది విజయాలు సాధిస్తున్నారని, అదే విధంగా తిరుపతికి చెందిన తిలక్, లక్ష్మి నటిస్తున్న 'అభిమన్యు' చిత్రం కూడా శ్రీవారి ఆశీస్సులతో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. భారీ చిత్రాలతో పోలిస్తే చిన్న బడ్జెట్ చిత్రాలకు ప్రచార అవకాశాలు పరిమితంగా ఉంటాయని, అలాంటి చిత్రాలు సోషల్ మీడియా, మౌత్ పబ్లిసిటీ, ఓటీటీ వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత సినీరంగంలో నేడు అగ్రస్థానంలో ఉన్న అనేక మంది నటీనటులు చిన్న స్థాయి నుంచి స్వయంకృషితో ఎదిగారని గుర్తుచేస్తూ, వారిని స్ఫూర్తిగా తీసుకుని కొత్త దర్శకులు, యువ నటీనటులు కష్టపడి పనిచేసి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చివరగా 'అభిమన్యు' చిత్ర యూనిట్ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ చిత్రం ఘన విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.


ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 9

శనివారం 11 జూలై 2026


# వరదయ్యపాలెం మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం సుడిగాలి పర్యటన...

## భారీ స్థాయిలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికిన వైనం...



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.
ఈ మధ్యకాలంలో అనారోగ్యానికి గురైన టిడిపి సీనియర్ నాయకులు ముని చంద్రారెడ్డి ని, మాజీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు ని, శ్రీనివాస నాయుడుని మరియు కొంతమందిని పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిమూలం. ఎమ్మెల్యే మండల పర్యటనకు వస్తున్నారని తెలిసి భారీ సంఖ్యలో ఎమ్మెల్యే ను కలవడానికి, చూడడానికి స్వచ్ఛందంగా తరలివచ్చిన నాయకులు కార్యకర్తలు. టిడిపి సీనియర్ నాయకుడు కరుణాకర్ నాయుడు ఆధ్వర్యంలో సంత వేలూరు నుండి వరదయ్యపాలెం వరకు బైక్ మరియు కార్ల ర్యాలీ. యాదృచ్ఛికంగా ఎలాగో నాయకులు కార్యకర్తలు తనకోసం వచ్చారు కాబట్టి చిన్నపాటి సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే... ఆదిమూలం... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాబోయే స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వాలని... పిలుపునిచ్చారు. అభివృద్ధికి కీలకమైన జడ్పిటిసి, ఎంపీటీసీ,ఎంపీపీ సర్పంచ్ పదవులు టిడిపి గెలుచుకునే విధంగా కష్టపడాలని తద్వారా గ్రామస్థాయిలో అభివృద్ధి జరుగుతుందని నాయకులను కోరారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటికీ ఎప్పటికీ టిడిపికి కంచుకోటనన్న సందేశాన్ని మనం మన అధినేత మన ప్రియతమ నాయకుడు ముఖ్యమంత్రి కి పంపుదాం.. అని తెలిపారు. ఏది ఏమైనా నియోజకవర్గంలో రసవత్తర రాజకీయానికి తెర లేచిందనే చెప్పవచ్చు... రోజురోజుకు ఎమ్మెల్యే చెంత చేరే వారి సంఖ్య పెరుగుతుండడం దాన్ని ఆపాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్న కూడా లెక్కచేయకుండా ఏం జరుగుతుందో జరగని నిండా మునినోడికి చలి ఏముంది అనే విధంగా.... పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ ఫోటోలను చూస్తే తెలుస్తుంది ఎమ్మెల్యే గ్రాఫ్ ఏ విధంగా రోజురోజుకీ పెరుగుతుందో..... మండలంలోని కీలక నాయకులు కొందరు ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొనడం కోసమెరుపు... అదేవిధంగా నియోజకవర్గంలోని ఇతర మండలాల నుండి కూడా ఎమ్మెల్యేతో కలిసి రావడం గమనార్హం. ఈ సందర్భంగా కరుణాకర్ నాయుడు ఇచ్చిన విందులో నియోజకవర్గ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. పడి -పడి- పడి- పడి లేచినోడు మామూలోడు అయితే మూలన కూర్చుంటాడు... కానీ ఇక్కడున్నది ఆదిమూలం.... పడి పడి లేచిన నిలవడు పరిగెత్తాడు... అంటున్న... అనుచరులు... అభిమానులు, టిడిపి కార్యకర్తలు...ఇదిలా ఉంటే మరోవైపు లికార్యక్రమం మధ్యలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు కోనేటి సుమన్ కార్యక్రమంలో పాల్గొనడంతో వాతావరణం పసుపు పండగల మారిందిని.... రీఛార్జ్ అయిన నాయకులు కార్యకర్తలు

# సెలవు రోజైనా శని,ఆదివారాల్లో విధులకు హాజరై సర్ ప్రక్రియను పూర్తి చేయాలి -సత్యవేడు మండల తహసిల్దార్ శివప్రసాద్



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.
జూలై 11,12 తేదీల్లో శని,ఆదివారాలు సెలవు రోజైనా సంబంధిత బిఎల్వోలు,సహాయక సిబ్బంది,పర్యవేక్షణ అధికారులు తప్పనిసరిగా విధులకు హాజరై ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పూర్తిచేయాలని తిరుపతి జిల్లా సత్యవేడు తహసిల్దారు శివప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ఇంకా భారీ స్థాయిలో పెండింగ్ ఉందన్నారు. భారత ఎన్నికల సంఘం,జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రెండవ శనివారం జూలై 11,12 తేదీ ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు అయినప్పటికీ సర్ పక్రియలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది అందరూ విధులకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఇందులో భాగంగా శనివారం,ఆదివారం ఉదయం 7.00 గంటలకు విధులకు హాజరై సర్ పనులను ప్రారంభించాలన్నారు. అవసరమైతే రాత్రి వరకు అదనపు సమయాన్ని తీసుకొని పనిచేయడం ద్వారా పెండింగ్ పనులను చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే మరణించిన ఓటర్లు,వలస వెళ్లిన వారు నకిలీ నమోదులు ఇతర అన్ని పెండింగ్ కేసులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. జూలై 11వ తేదీ అన్ని పెండింగ్ సర్ పనులను 100 శాతం పూర్తిచేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పరిగణించాలన్నారు. ఈ క్రమంలో ప్రతి బిఎల్వోలు సహాయక సిబ్బందిని రెండవ శనివారం,ఆదివారం విధులకు హాజరయ్యేలా చూడటం సంబంధిత పర్యవేక్షణ అధికారి యొక్క పూర్తి బాధ్యత అన్నారు. ప్రతి పర్యవేక్షణ అధికారి తన పరిధిలోని బిఎల్ఓలతో సహాయక సిబ్బందితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సర్ ప్రక్రియను పూర్తి అయ్యేటట్టు చూడాలన్నారు. సర్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న వారికి ఎటువంటి మినహాయింపులు,సెలవులు, వ్యక్తిగత కారణాలు ఏ పరిస్థితుల్లోనూ పరిగణించే ప్రసక్తే లేదన్నారు. విధులకు గైర్హాజరైన పనిలో నిర్లక్ష్యం చేసిన బిఎల్వోలు,సిబ్బంది,పర్యవేక్షణ అధికారుల వివరాలు జిల్లా కలెక్టర్కు చర్యల నిమిత్తం నివేదించడం జరుగుతుందన్నారు. నివేదించబడతాయి.

# పిచ్చాటూరు టీడీపీ శ్రేణుల్లో జోష్..!

## -శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా సాగిన ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలు



ప్రజా భూమి ప్రతినిధి పిచ్చాటూరు.
శంకర్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని శ్రేణులకు సూచించిన మాజీ ఎమ్మెల్యే హేమలత. భారీ సంఖ్యలో పాల్గోన్న కీలక నేతలు, పార్టీ శ్రేణులు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని పిచ్చాటూరు దొరైవేల్ కల్యాణ మండపంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పలు ప్రజా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే హేమలత, నియోజకవర్గంలోని ఏడు మండలాల టీడీపీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఎస్ఐఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు. నిర్దేశిత గడువులోగా ప్రతి ఇంటిని చేరుకుని ఫారాలను పూర్తి చేసి సమర్పించేలా నాయకులు, కార్యకర్తలకు స్పష్టమైన కార్యాచరణను వివరించారు. ఓటరు జాబితా సవరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు, అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి సమస్యలను ప్రజలు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కూరపాటి శంకర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను అధికారికంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ సేవలు పారదర్శకంగా ప్రజలకు అందేలా కృషి చేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు.

తెలుగు తమ్ముళ్ళకు మాజీ ఎమ్మెల్యే హేమలత దిశానిర్దేశం సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్ రెడ్డి కొనసాగుతారని, పార్టీ అధిష్టానం ఆదేశాలు, సూచనలను ప్రతి ఒక్కరూ గౌరవించి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి బలమైన అడ్డా అని, ఎవరూ ఎంతలా డైవర్షన్ పాలిటిక్స్ చేయాలని చూసినా , తెలుగు తమ్ముళ్ళ ఐక్యమత్యాన్ని , పార్టీ శ్రేణుల అంకిత భావాన్ని దూరం చేయడం అసాధ్యమని స్పష్టీకరించారు. పార్టీ అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ శంకర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి , స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు పార్టీ శ్రేణులు నడుంబిగించాలన్నారు. కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారమే మా మొదటి ప్రాధాన్యం. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలకు పరిష్కారం చూపడం మా బాధ్యత. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలి. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అందరూ సమన్వయంతో పనిచేస్తూ సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంపై టీడీపీ నాయకత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిందని నాయకులు పేర్కొన్నారు.


## మన ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఓటు హక్కు' అత్యంత కీలకమైనది- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్
పట్టణ పరిధిలోని 11మరియు 13వ వార్డులలో ఈరోజు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జరుగుతున్న "ఓటర్ల జాబితా సవరణ సర్వే" కార్యక్రమంలో మన పార్టీ సీనియర్ నాయకులు, కూటమి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులలో సర్వే జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, బోగస్ ఓట్లు లేకుండా పక్కాగా ఓటర్ల జాబితా రూపొందించేలా అధికారులకు పలు సూచనలు చేశారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఓటు హక్కు' అత్యంత కీలకమైనది. నియోజకవర్గంలో ఎక్కడా ఎలాంటి అవకతవకలు లేకుండా అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరిగేలా మరియు ప్రజలందరికీ ఓటుపై పూర్తి అవగాహన కల్పించేలా మన కూటమి ప్రభుత్వం పూర్తి బాధ్యతతో ముందుకు సాగుతోంది.

## వైసీపీ సీనియర్ నేత వీపీ కుమార్ రెడ్డి కన్నుమూత

### -: నాయుడుపేటలో విషాదం



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఈరోజు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి వార్త తెలియగానే నాయుడుపేట పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుంటున్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వీపీ కుమార్ రెడ్డి గారి భౌతికకాయాన్ని స్విమ్స్ ఆసుపత్రి నుండి నాయుడుపేటలోని స్వగృహానికి అంతిమ సంస్కారాల నిమిత్తం తరలిస్తున్నారు. ఆయన మృతికి వైసీపీ అగ్రశ్రేణి నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బలమైన సంస్థాగత నేతను కోల్పోయామని వైకాపా శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు అంగీకరించిన పంగూరు గ్రామస్తులు



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు
శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ఏర్పేడు మండలం, పంగూరు గ్రామ హరిజనవాడలో నూతనంగా నిర్మిస్తున్న చేస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఏర్పడిన అడ్డంకులను గ్రామ ప్రజలు జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి. శ్రీకాంత్ దృష్టికి తీసుకొచ్చిన వెంటనే స్పందించి ఏర్పేడు మండల ఎమ్మార్వో ని కలిసి వినతి పత్రం సమర్పించిన వెంటనే , ఎమ్మార్వో ఆదేశాలు మనకు, డిప్యూటీ ఎమ్మార్వో మరియు రెవెన్యూ అధికారులతో పంగూరు హరిజనవాడకు వెళ్లి గ్రామ ప్రజలతో చర్చించి డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా గ్రామస్తులందరినీ ఒక ఏకదాటికి తీసుకువచ్చి అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునివ్వడం జరిగింది. దానికి అందరూ సానుకూలంగా స్పందించి విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు తోడ్పడుతానని అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ కే. శ్రీనివాసులు న్యాయవాదులు కొప్పల సుబ్రహ్మణ్యం , పుట్టా. గణేష్ , రెవెన్యూ సిబ్బంది, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## తిరుపతి పార్లమెంట్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన పనబాక లక్ష్మి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్
తిరుపతి నియోజకవర్గంలోని అవిలాలలో నూతనంగా నిర్మిస్తున్న తిరుపతి పార్లమెంట్ కార్యాలయ భవనం నిర్మాణ పనులను తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు డాక్టర్ పనబాక లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పనబాక లక్ష్మి, పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో ఆధునిక సౌకర్యాలతో తిరుపతి పార్లమెంట్ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ఒకే వేదికపై సేవలు అందించే కేంద్రంగా ఈ కార్యాలయం నిలవనున్నదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యక్రమాల సమన్వయం, కార్యకర్తలకు అందుబాటులో ఉండే శాశ్వత కేంద్రంగా ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని అన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముని రామయ్య, పార్లమెంట్ సెక్రటరీ రేవతి పాల్గొన్నారు.

## పల్లమల సుధీర్ అంత్యక్రియలకు హాజరై, ఘన నివాళులర్పించాను: దండి నరేంద్ర



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్
మాజీ ఆర్టీసీ కంట్రోలర్, మాజీ సహకార సంఘం అధ్యక్షులు పల్లమల సుధీర్ అంత్యక్రియలకు హాజరై, ఘన నివాళులర్పించాను. ఈ సందర్భంగా సుధీర్ సోదరులు, ప్రముఖ టెలివిజన్ ధారావాహికలు "చక్రవాకం", "మొగలి రేకులు" నిర్మాత పల్లమల సుధాకర్ తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించినా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. సమాజ సేవలో విశిష్ట సేవలందించిన పల్లమల సుధీర్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును భరించే ధైర్యం, మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

## గుక్కెడు నీటి కోసం మహిళల ధర్నా

**-గ్రద్దగుంట సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన.**
**-మూడు నెలలుగా దాహంతో అల్లాడుతున్నా అధికారులకు వట్టదా?**

ప్రజా భూమి ప్రతినిధి తడ.
పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంపై మహిళల ఆగ్రహం. తిరుపతి జిల్లా తడ మండలం గ్రద్దగుంట గ్రామంలో ప్రజలకు కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేని దుస్థితి గ్రద్దగుంటలో నెలకొంది. గత మూడు నెలలుగా తీవ్ర నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నా సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది కనీసం స్పందించకపోవడంపై మహిళలు భగ్గుమన్నారు. గుక్కెడు నీటి కోసం ఇంకెంతకాలం ఎదురుచూడాలంటూ శుక్రవారం గ్రద్దగుంట సచివాలయం వద్ద ధర్నాకు దిగారు. రోజువారీ అవసరాలకు నీరు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు సైతం నీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికార యంత్రాంగం మాత్రం మొద్దునిద్ర వీడటం లేదని మండిపడ్డారు. నీటి సమస్యపై పలుమార్లు పంచాయతీ సిబ్బందికి విన్నవించినా ఫలితం లేదని మహిళలు ఆరోపించారు. మూడు నెలలుగా ప్రజలు దాహంతో అల్లాడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? ప్రజల సమస్యలు పట్టించుకోకపోతే సచివాలయాలు ఎందుకు? పంచాయతీ సిబ్బంది బాధ్యత ఏమిటి? అంటూ నిలదీశారు. కనీసం తాగునీరు అందించాల్సిన అధికారులు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని మహిళలు ప్రశ్నించారు. ప్రజలకు గుక్కెడు నీరు అందించలేని పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రద్దగుంటలో తక్షణమే తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే మరింత



# తిరుమల దర్శనాల పేరుతో రూ.1.14 లక్షల మోసం..

## దళారులను నమ్మొద్దని భక్తులకు అడ్వకేట్ జి. వెంకటేశ్వర్లు విజ్ఞప్తి.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుమలలో బ్రేక్ దర్శనం, తోమాల సేవ, శ్రీవాణి దర్శనం టికెట్ మరియు వసతి కల్పిస్తామని చెప్పి రూ.1.14 లక్షలు తీసుకున్న వ్యక్తిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ జి. వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. అలాగే భక్తులు దళారులను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు చెందిన జి. నాగేంద్ర తన కుమార్తె, అల్లుడు అమెరికా నుంచి రావడంతో పాటు కుటుంబ సభ్యులకు 08-07-2026 నుంచి 09-07-2026 వరకు తిరుమలలో బ్రేక్ దర్శనం ఆరుగురికి, తోమాల సేవ నలుగురికి, గాయత్రి గెస్ట్ హౌస్‌లో వసతి, ఒకరికి శ్రీవాణి దర్శనం టికెట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన టి. అరుణ్ కుమార్‌కు ఫోన్‌పే నంబర్ 7993734564 ద్వారా మొత్తం రూ.1,14,000లను బదిలీ చేశారు.అయితే టి. అరుణ్ కుమార్ శ్రీవాణి దర్శనం టికెట్‌ను రంగలక్ష్మి (88) పేరుతో మాత్రమే బుక్ చేసి వాట్సాప్‌లో పంపించి, అనంతరం ఫోన్‌కు స్పందించడం మానేశారని తెలిపారు. దీంతో బాధితులు



అడ్వకేట్ జి. వెంకటేశ్వర్లును ఆశ్రయించి అధికారులకు ఫిర్యాదు చేశారు. మొదట తిరుమల ఈడీ కార్యాలయానికి వెళ్లగా, అక్కడి అధికారులు అదనపు ఈవో కార్యాలయానికి వెళ్లాలని సూచించారని, అక్కడ కూడా సరైన స్పందన లభించలేదని తెలిపారు. అనంతరం 112కు సమాచారం ఇవ్వగా కానిస్టేబుల్ అంజి ప్రసాద్ తమను తిరుమల 2 టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని చెప్పారు. రాత్రి సుమారు 10.30 గంటలకు సీఐ శ్రీరాముడు ఫిర్యాదు సిద్ధం చేసి తేదీ నమోదు చేయకుండా సంతకాలు తీసుకున్నారని, మరుసటి రోజు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని చెప్పారని వెల్లడించారు. వసతి, దర్శనం కల్పించకపోవడంతో బాధితులు తిరుపతిలోని ప్రైవేట్ హోటల్ 'మనసా ఇన్'లో బస చేయాల్సి వచ్చిందన్నారు. మరుసటి రోజు టి. అరుణ్ కుమార్ వాట్సాప్‌లో గంటలోపు డబ్బులు తిరిగి పంపిస్తానని సందేశం పంపినా పంపలేదని తెలిపారు. అనంతరం సీఐ ఫోన్ చేసి టి. అరుణ్ కుమార్ లొకేషన్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించామని, కొంత మొత్తం రికవరీ చేసిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని చెప్పినట్లు వెల్లడించారు.ఈ క్రమంలో 10-07-2026 ఉదయం టి. అరుణ్ కుమార్ రూ.1,03,000లను జి. నాగేంద్ర ఖాతాకు తిరిగి బదిలీ చేశాడని, తనకు రూ.5,000 ఫీజు పంపించాడని, అయితే ఆ మొత్తాన్ని తిరిగి పంపేందుకు ప్రయత్నించగా ట్రాన్సాక్షన్ విఫలమైందని అడ్వకేట్ జి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తిరుమలలో దర్శనాలు, వసతి పేరుతో వ్యవహరిస్తున్న దళారులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల పీఆర్‌వోల లేఖల ద్వారా ఒక్కొక్కరి నుంచి రూ.6,000 చొప్పున వసూలు చేసి, అదనపు ఈవో కార్యాలయంలో కొందరికి రూ.3,000 చొప్పున లంచాలు ఇస్తున్నారనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని పేర్కొంటూ, ఈ అంశంపై కూడా సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికితీయాలని కోరారు. అదేవిధంగా ఉద్యోగుల సిఫార్సు లేఖల ఆధారంగా పారదర్శకంగా దర్శనాలు కల్పించే విధానం అమలు చేయాలని, విదేశాల నుంచి వచ్చే ఎన్ఆర్ఐ భక్తులకు విమానాశ్రయంలోనే శ్రీవాణి దర్శనం టికెట్‌తో పాటు వసతి సౌకర్యం కల్పించే విధంగా టిటిడి ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చివరగా, తిరుమలలో దర్శనాలు, వసతి పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న దళారులను నమ్మవద్దని, అధికారిక విధానాల ద్వారానే సేవలు పొందాలని భక్తులకు అడ్వకేట్ జి. వెంకటేశ్వర్లు సూచించారు.

# దొరవారిసత్రం తహసీల్దార్ రాజేంద్ర ఆకస్మిక తనిఖీ: మావిళ్లపాడు ఏపీ మోడల్ స్కూల్ మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



ప్రజా భూమి ప్రతినిధి దొరవారి సత్రం.
ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న సంక్షేమ పథకాల పనితీరును స్వయంగా పరిశీలించేందుకు దొరవారి సత్రం మండల తహసీల్దార్ రాజేంద్ర శుక్రవారం మావిళ్లపాడు గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు కూర్చుని భోజనం చేస్తున్న ప్రాంగణాన్ని పరిశీలించి, వడ్డిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, వంట గదిలోని సామాగ్రి గురించి అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రాజేంద్ర స్వయంగా భోజనం రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, చదువు, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి గదిలో పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, ఎన్రోల్‌మెంట్ వివరాలు, ఇతర పరిపాలనా అంశాలను సమీక్షించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల సమస్యలపై ఉపాధ్యాయ బృందంతో చర్చించారు. పాఠశాలలో అన్ని ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని అధికారులు, ఉపాధ్యాయులకు తహసీల్దార్ రాజేంద్ర సూచించారు.ఈ తనిఖీలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తుడా మాస్టర్ ప్లాన్ రోడ్లు, ప్లానింగ్స్ పై చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి విస్తృత స్థాయి సమీక్ష

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
తిరుపతి నగర భవిష్యత్తు, పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తుడా ప్లానింగ్ విభాగం అధికారులతో తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా ॥డాలర్స్ దివాకర్ రెడ్డి కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తుడా పరిధిలో ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం, పెండింగ్ ప్లానింగ్ లేఅవుట్లు, నగర సౌందర్యీకరణపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ తుడా పరిధిలో ప్లాన్ చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని చైర్మన్ స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియలో ఉన్న అడ్డంకులను స్థానిక ప్రజలతో మాట్లాడి, సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని సూచించారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రత్యామ్నాయ రహదారుల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా లింక్ రోడ్లను మాస్టర్ ప్లాన్ రోడ్లతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ప్లానింగ్ విభాగానికి వచ్చే లేఅవుట్లు, భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత సరళతరం చేయాలని, ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం వేగంగా అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాలు వేగంగా విస్తరిస్తున్నాయి.రాబోయే 20 ఏళ్ల అవసరాలను, జనాభా వృద్ధిని అంచనా వేస్తూ ప్లానింగ్ విభాగం లాంగ్-టెర్మ్ విజన్‌తో పనిచేయాలి. ఈ సమావేశంలో తుడా సెక్రటరీ డా యన్ వి శ్రీకాంత్ బాబు ప్లానింగ్ అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన తిరుపతి నియోజకవర్గ నూతన ఇంచార్జి జేబీ శ్రీనివాస్




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
నియోజకవర్గ ఇంచార్జిగా నియమితులైన తర్వాత తొలిసారి భేటీ అయిన ఇరువురు నేతలు. తిరుపతి నగర, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై సుదీర్ఘ చర్చ. తిరుపతి నియోజకవర్గ నూతన ఇంచార్జిగా నియమితులైన జేబీ శ్రీనివాస్ ఈరోజు తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇరువురు నాయకులు ఒకరినొకరు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి పరస్పరం ఘనంగా సత్కరించుకున్నారు. జేబీ శ్రీనివాస్ నూతన బాధ్యతలకు డాలర్స్ దివాకర్ రెడ్డి. హృదయపూర్వక అభినందనలు తెలపగా,తుడా చైర్మన్‌గా తుడా అభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడుతూ జేబీ శ్రీనివాస్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఆత్మీయ భేటీ అనంతరం ఇరువురు నేతలు తిరుపతి నియోజకవర్గ పరిధిలోని పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళి కృష్ణ తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్ ) కార్యక్రమంను పరిశీలించిన శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ



ప్రజా భూమి ప్రతినిధి వెంకటగిరి.
భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రత్యేక సమగ్ర సవరణ" కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఈరోజు వెంకటగిరి పట్టణంలో 10వ వార్డ్, మనులాలపేట, పరుశురాం కాలనీ మరియు 4వ వార్డ్, రహ్మత్ నగర్ లలో విస్తృతంగా పర్యటించారు. క్షేత్ర స్థాయిలో వీధివీధినా కలియతిరుగుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. 'మన ఓటు.. మన బాధ్యత' అనే నినాదంతో, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోందని ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఇంటింటికీ సర్వేలో ప్రజలందరూ విధిగా పాల్గొనాలి. మీ ఇంటికి వచ్చే అధికారులకు మీ సరైన గుర్తింపు పత్రాలను చూపించి, మీ ఓటు హక్కును కాపాడుకోండి" అని పిలుపునిచ్చారు. ఓటరుగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తెరగాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకమైన జాబితా రూపొందించేందుకు అధికారులకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

# మరిన్ని రచనలు పాఠ్యాంశాలుగా రావాలి



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం రాసిన గేయాలు ఈ సంవత్సరం మహారాష్ట్ర తెలుగు వాచకంలో పాఠ్యాంశాలుగా వచ్చిన విషయం విదితమే.తిరుపతి జిల్లా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రమణా రావు మహారాష్ట్ర తెలుగు వాచకాలలో బాలు రాసిన గేయాలను పరిశీలించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రచనలు పాఠ్యాంశాలుగా రావాలి అని సూచించారు. ఈ సందర్భంగా తనను ప్రోత్సహిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులకు బాలు ధన్యవాదాలు తెలియచేసారు

# పది రోజుల్లో ఓవర్ లోడ్,పర్మిట్ లేని వాహనాలపై 6,30,825.00 రూపాయలు జరిమాన -పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి చంద్రశేఖర్.

ప్రజా భూమి ప్రతినిధి పుత్తూరు.
ఓవర్ లోడ్,పన్ను చెల్లించకుండా,పర్మిట్ లేని వాహనాలపై జూలై 1వ తేదీ నుంచి పదో తేదీ వరకు 6,30,825.00 రూపాయలు జరిమాన విధించినట్లు పుత్తూరు మోటార్ వాహనాల తనిఖీ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పుత్తూరు ఆర్టీవో పరిధిలో తరచూ వాహనాల తనిఖీకి సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.తనిఖీలలో భాగంగా అధిక ఓవర్ లోడ్,వాహనాల పన్ను చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న పలు టిప్పర్ వాహనాలపై కొరడా ఝులిపిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే జూలై 1వ తేదీ నుంచి 10వ తేదీ లోపు టాక్స్,పెర్మిట్ లేని వాహనాలకు 4,43,775.00 రూపాయలు అధిక లోడ్కు సంబంధించి1,87,050 రూపాయలను జరిమానా విధించామన్నారు.గత జూన్ నెలలో కూడా టాక్స్, పెర్మిట్ లు,ఫిట్ నెస్ లేని వాహనాలకు,ఓవర్ లోడ్తో వెళ్ళే వాహనాలకు 9,89,000.00 రూపాయల జరిమాన విధించడం జరిగిందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో, నిభంధనలను అతిక్రమించి తిరిగే అన్ని వాహనాలను అరికడతామని ఈ సందర్భంగా పుత్తూరు వాహనాల తనిఖీ అధికారి చంద్రశేఖర స్పష్టం చేశారు.అందువల్ల అనుమతించిన పరిమితికి మించి అధిక లోడ్‌తో వాహనాలను నడప రాదని వాహన యజమానులకు, డ్రైవర్లకు సూచించారు.అలాగే వాహనాలకు సంబంధించిన పర్మిట్,ట్యాక్స్,ఫిట్‌నెస్,బీమా వంటి పత్రాలు చెల్లుబాటు అయ్యేల అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణం కావొద్దు అన్నారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రాణ నష్టం ఆస్తి నష్టం నివారించవచ్చని ఆయన గుర్తు చేశారు. అతివేగం వల్ల వాహనాల నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉండి,ఇది తీవ్ర రోడ్డు ప్రమాదాలకు దారితీయవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రజల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని,ఈ తరహా తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు.



# వరదయ్యపాలెం మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం సుడిగాలి పర్యటన

## భారీ స్థాయిలో టిడిపి నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికిన వైనం



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్య పాలెం
తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలో ఈ మధ్యకాలంలో అనారోగ్యానికి గురైన టిడిపి సీనియర్ నాయకులు ముని చంద్రారెడ్డి ని, మాజీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు, శ్రీనివాస నాయుడు అలాగే కొంతమందిని పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిమూలం ఎమ్మెల్యే మండల పర్యటనకు వస్తున్నారని తెలిసి భారీ సంఖ్యలో ఎమ్మెల్యేను కలవడానికి, చూడడానికి స్వచ్ఛందంగా తరలివచ్చిన నాయకులు కార్యకర్తలు టిడిపి సీనియర్ నాయకుడు కరుణాకర్ నాయుడు ఆధ్వర్యంలో సంత వేలూరు నుండి వరదయ్యపాలెం వరకు బైక్ మరియు కార్ల ర్యాలీ యాదృచ్ఛికంగా ఎలాగో నాయకులు కార్యకర్తలు తనకోసం వచ్చారు కాబట్టి చిన్నపాటి సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఆదిమూలం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు రాబోయే స్థానిక ఎన్నికలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు అభివృద్ధికి కీలకమైన జడ్పిటిసి,ఎంపిటీసీ,ఎంపీపీ సర్పంచ్ పదవులు టిడిపి గెలుచుకునే విధంగా కష్టపడాలని తద్వారా గ్రామస్థాయిలో అభివృద్ధి జరుగుతుందని నాయకులను కోరారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటికీ ఎప్పటికీ టిడిపికి కంచుకోటనన్న సందేశాన్ని మనం మన అధినేత మన ప్రియతమ నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి కి పంపుదాం అని తెలిపారు. ఏది ఏమైనా నియోజకవర్గంలో రసవత్తర రాజకీయానికి తెర లేచిందనే చెప్పవచ్చు... రోజురోజుకు ఎమ్మెల్యే చెంత చేరే వారి సంఖ్య పెరుగుతుండడం దాన్ని ఆపాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్న కూడా లెక్కచేయకుండా ఏం జరుగుతుందో జరగని నిండా మునిగినోడికి చలి ఏముంది అనే విధంగా పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి.

# ప్రజా సమస్యలపై నిరంతరం కలం పట్టిన విలేకరి దశకుమార్ ఇకలేరు



ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ:
తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని కనమనంబేడు గ్రామానికి చెందిన ఉదయం దినపత్రిక విలేకరి దశకుమార్ మరణ వార్త బి. ఎన్ కండ్రిగ పాత్రికేయ రంగాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహచర జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పాత్రికేయ వృత్తిలో నిబద్ధత, నిజాయితీతో సేవలందించిన వంగి దశకుమార్ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఎల్లప్పుడూ ముందుండేవారు. గ్రామీణ ప్రాంతాల సమస్యలు, ప్రజల ఇబ్బందులు, అభివృద్ధి అంశాలపై ఆయన రాసిన వార్తలు అధికారుల దృష్టిని ఆకర్షించి అనేక సమస్యల పరిష్కారానికి దోహదపడ్డాయని సహచర పాత్రికేయులు కొనియాడారు. నిర్భయంగా, నిష్పక్షపాతంగా వార్తలను ప్రజలకు చేరవేసిన దశకుమార్ పాత్రికేయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజల పక్షాన నిలబడి కలం పట్టిన ఆయన మరణం మీడియా రంగానికి తీరని లోటని పలువురు జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు. దశకుమార్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎన్నికల అధికారి, రోజ్ మాండ్



ప్రజాభూమి ప్రతినిధి,
బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల అధికారి రోజ్ మాండ్, శుక్రవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బి.ఎన్. కండ్రిగ మండలంలోని పలు గ్రామాలను సందర్శించి కార్యక్రమం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా తిమ్మబూపాలపురం, చెల్లమంబాపురం, పార్లపల్లి, పల్లమాల, గాజులపెళ్లూరు, కాంచనపుత్తూరు, కరనిమిట్ట, వెస్ట్ వరత్తూరు, నెలవాయి గ్రామాల పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులతో సమావేశమై కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందజేశారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి

## .... పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.సురేష్ -అవగాహనా సమాచారం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
జంతువుల నుంచి మనుషులకు సోకే ర్యాబిస్ వైరస్ పట్ల అప్రమత్తం గా వ్యవహరించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.సురేష్ తెలిపారు.శుక్రవారం స్థానిక సాధు పేటలోని ప్రభుత్వ పశు వైద్య శాలలో వివిధ అనారోగ్య సమస్యలతో పెంపుడు కుక్కలను వైద్య శాలకు తీసుకువచ్చిన పెంపకం దారులకు ఆయన అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించి జాగ్రత్తలు వహించాలన్నారు.ర్యాబిస్ అనేది వైరస్ వల్ల వచ్చే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి అన్నారు. ఇది కుక్కలు, పిల్లులు, నక్కలు, కోతులు వంటి జంతువుల నుండి మనుషులకు కూడా వ్యాపిస్తుందన్నారు. ఒకసారి లక్షణాలు ప్రారంభమైతే దాదాపు 100% ప్రాణాంతకమైన వ్యాధి అని తెలియజేశారు. అయితే, సమయానికి వ్యాక్సిన్ వేయించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చు అన్నారు.పెనపుడు కుక్కలకు మొదటి ర్యాబిస్ వ్యాక్సిన్ సాధారణంగా 3 నెలల (90 రోజుల) వయస్సులో వేయాలన్నారు. బూస్టర్ డోస్ ను మొదటి డోస్ తర్వాత 1 సంవత్సరం తరువాత వేయించుకోవాలని తెలిపారు. ఆ తరువాత ప్రతి సంవత్సరం లేదా వ్యాక్సిన్ తయారీదారు సూచించిన వ్యవధి ప్రకారం (కొన్ని వ్యాక్సిన్లు 3 సంవత్సరాల రక్షణ ఇస్తాయి) వెటర్నరీ వైద్యుడి సలహా మేరకు వేయించాలన్నారు.వ్యాక్సిన్ ను తప్పనిసరిగా వేయించడం ద్వారా కుక్కను ర్యాబిస్ నుంచి రక్షిస్తుందన్నారు..కుటుంబ సభ్యులను కూడా ర్యాబిస్ సోకకుండా రక్షణ ఉంటుందన్నారు.

వ్యాక్సిన్ తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు

24 గంటలు ఎక్కువ శ్రమ చేయించవద్దని సూచించారు .శుభ్రమైన నీరు, మంచి ఆహారం ఇవ్వాలన్నారు. వ్యాక్సిన్ వేసిన చోట స్వల్ప వాపు లేదా నొప్పి రావచ్చని,ఇది సాధారణంగా 1--2 రోజుల్లో తగ్గిపోతుందన్నారు.ప్రభుత్వం కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ ను ఉచితం గా పశు వైద్య శాలల ద్వారా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటుందని డాక్టర్ సురేష్ తెలిపారు.

# 18న గూడూరులో జగన్నాథ రథయాత్ర

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ఈనెల 18వ తేదీన గూడూరు పట్టణంలో వైభవంగా నిర్వహించే 12వ జగన్నాథ రథయాత్రను అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు సుఖదేవ్ స్వామి మహరాజ్ తదితరులు కోరారు. గూడూరు పట్టణంలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఇస్కాన్ టెంపుల్ కన్వీనర్ బల భద్ర గోపాల్ దాస్ , ఇస్కాన్ రథయాత్ర నిర్వాహకులు శ్రీలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ పీ.ఎం రావు దంపతులు, గిరి ప్రభు, యోగ మాస్టర్ రాజా ప్రభు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



# గూడూరులో ఘనంగా ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) జెండా ఆవిష్కరణ.. నూతన కమిటీ ఎన్నిక

- కార్మికుల సంక్షేమమే ధ్యేయం: 1104 యూనియన్ కొత్త సారథ్యం
- 76 ఏళ్ల సుదీర్ఘ పోరాట పటిమ.. 1104 యూనియన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం
- పీఆర్సీ అమలు, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణే లక్ష్యంగా ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ గూడూరు డివిజన్ (రిజిస్టర్డ్ నం: 1104) అధ్యక్షులు డి. శ్రీధర్ , సెక్రటరీ జి. శివ శంకర్ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జెండా ఆవిష్కరణ, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గూడూరు రూరల్ పరిధిలోని గోగినేనిపురంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను నెల్లూరు జిల్లా కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం గోగినేనిపురం డివిజనల్ కార్యాలయం నుండి గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనం వరకు భారీ బైక్



ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు నెల్లూరు జిల్లా అధ్యక్షులు పి. నజీర్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

నూతన కమిటీ ఎన్నిక: గూడూరు టౌన్‌లోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో, 12 మందితో కూడిన గూడూరు డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి. శ్రీధర్ ,డివిజనల్ సెక్రటరీగా జి. శివ శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి. మల్లికార్జున , ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్. సురేష్ ట్రెజరర్‌గా పి. సుజాత ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను జిల్లా నాయకులు ఘనంగా సత్కరించారు. కార్మిక సమస్యలపై పోరాటం: ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పి. నజీర్ ఖాన్ మాట్లాడుతూ 1104 యూనియన్ గత 76 సంవత్సరాలుగా ఎటువంటి రాజకీయ పార్టీలకు అనుబంధం లేకుండా, కేవలం కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఉద్దేశించి వారు పలు డిమాండ్లను వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని , పర్మినెంట్ ఉద్యోగుల కోసం 2026 పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి, కార్మికులకు త్వరగా పిఆర్సి ఇవ్వాలని వేతన సవరణను త్వరగా పూర్తి చేయాలని , కార్మికుల ఇతర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి. శ్రీకాంత్, సిహెచ్. శ్రీధర్ కుమార్, జి. విజయ్ కుమార్, సింగంశెట్టి శ్రీనివాసులు, పి. నిరంజన్ బాబు, అనిల్, వేణు, భాస్కర్, నటరాజ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పర్మినెంట్, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

## తడ -- శ్రీకాళహస్తి ఆర్అండ్‌బీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజా భూమి ప్రతినిధి తడ. సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తడ--శ్రీకాళహస్తి ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు దీర్ఘకాలం సురక్షితంగా ప్రయాణించేలా ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన రోడ్డు నిర్మించాలని సూచించారు.



భవిష్యత్తులో ఈ రహదారి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నాణ్యమైన రోడ్లలో ఒకటిగా నిలిచేలా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు.

# మామిడి రైతుల కష్టాలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు..

### ఐసీఏఆర్ నిపుణుల కమిటీతో ఆశలు చిగురిస్తున్నాయి

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు చొరవతో ఐదేళ్లుగా కొనసాగుతున్న మామిడి రైతుల సంక్షోభానికి పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో, రైతుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర ప్రభుత్వం భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమించింది. పార్లమెంటు సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన దగ్గుమళ్ల ప్రసాదరావు, రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను లిఖితపూర్వకంగా కేంద్ర ప్రభుత్వానికి వివరించడంతో పాటు పార్లమెంటులో పలుమార్లు వారి సమస్యలను ప్రస్తావించారు. దీనికి స్పందించిన కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశాల మేరకు భారత



వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో లక్నోలోని కేంద్ర ఉపఉష్ణమండల ఉద్యాన పరిశోధనా సంస్థకు చెందిన డాక్టర్ టి. దామోదరన్ నాయకత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో డాక్టర్ ఎం. శంకరన్, డాక్టర్ హెచ్.ఎస్. సింగ్, డాక్టర్ డి. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర ఉద్యానవన శాఖ ప్రతినిధి సభ్యులుగా ఉన్నారు. ఈ నిపుణుల కమిటీ రెండు రోజుల పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పర్యటించి మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అధ్యయనం చేసింది. రైతుల ఆదాయాన్ని పెంచడం, తోతాపురి మామిడి ధరలను స్థిరీకరించడం, సాగు నుంచి ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతుల వరకు మొత్తం విలువ వ్యవస్థను పరిశీలించి శాశ్వత పరిష్కార మార్గాలను సూచించడం కమిటీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. పర్యటనలో భాగంగా తోతాపురి మామిడి సాగు ప్రాంతాలను సందర్శించిన కమిటీ సభ్యులు రైతులు, ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఢిల్లీలో ఉన్న దగ్గుమళ్ల ప్రసాదరావుతో కూడా కమిటీ సభ్యులు మాట్లాడి మామిడి రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ దేశంలోనే తోతాపురి మామిడి సాగుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. జిల్లాలో సుమారు రెండు లక్షల ఎనభై వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతుండగా, అందులో దాదాపు తొంభై శాతం తోతాపురి రకమే ఉందని తెలిపారు. ప్రతి ఏడాది సుమారు ఏడు లక్షల యాభై వేల టన్నుల దిగుబడి లభిస్తోందని, రాష్ట్రంలోని మామిడి గుజ్జు పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకులో అత్యధిక భాగం చిత్తూరు నుంచే సరఫరా అవుతోందని కమిటీ సభ్యులకు వివరించినట్లు తెలిపారు. ఒకప్పుడు టన్నుకు పద్దెనిమిది వేల నుంచి ముప్పై వేల రూపాయల వరకు పలికిన తోతాపురి ధర ఈ సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో నాలుగు వేల రూపాయలకు పడిపోయిందన్నారు. కోత ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు పండ్లను చెట్లపైనే వదిలేయడం, రోడ్ల పక్కన పారబోయడం వంటి పరిస్థితులు పలమనేరు, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, పూతలపట్టు, కుప్పం ప్రాంతాల్లో కనిపించాయని కమిటీకి వివరించినట్లు తెలిపారు. మామిడి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం రావాలంటే ప్రత్యేక మ్యాంగో బోర్డు ఏర్పాటు అత్యవసరమని కమిటీ సభ్యులకు తాను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మామిడి రైతుల సమస్యలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి శాశ్వత పరిష్కార మార్గాలను సూచించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి దగ్గుమళ్ల ప్రసాదరావు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## 21న గూడూరులో మెగా జాబ్ మేళా ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, నిరుద్యోగులు అందరికీ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఈనెల 21వ తేదీ గూడూరు డిఆర్డబ్ల్యూ మహిళా కళాశాలలో జాబ్ మేళా స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో



జరుగుతుందని నిరుద్యోగులు అందరు అవకాశాన్ని వినియోగించుకోవాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. గూడూరు పట్టణంలోని ౹ా4 కార్యాలయం వద్ద జాబ్ మేళా పోస్టర్ను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ విడుదల చేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ డిఆర్ డబ్ల్యు మహిళా కళాశాలలో జాబ్ మేళా జరుగుతుందని పలు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని సుమారు 13 వందల ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు భవిష్యత్తులో గూడూరు నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు వస్తున్నాయని నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, రహీం ,తదితరులు పాల్గొన్నారు

# అభయ క్షేత్రంలో -- వేణు ముదిరాజ్ జన్మదిన వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట, జూలై 10 సమాజంలో ప్రత్యేక ప్రతిభావంతులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, వారి మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం జీవితంలో మరపురాని అనుభూతిని కలిగిస్తుందని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు కుర్రకాలవ వేణు ముదిరాజ్ అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రేణిగుంట సమీపంలోని అక్షయ క్షేత్రంలో ప్రత్యేక ప్రతిభావంతుల మధ్య నిరాడంబరంగా, సేవా భావంతో జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులతో కలిసి కేక్ కట్ చేసి వారికి స్వయంగా కేక్ తినిపించి శుభాకాంక్షలు అందుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న వారందరికీ అల్పాహారం పంపిణీ చేసి ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా వేణు ముదిరాజ్ మాట్లాడుతూ జన్మదినం అంటే కేవలం కేక్ కట్ చేయడం, సంబరాలు చేసుకోవడం మాత్రమే కాదని, సమాజంలో అవసరమైన వారికి





సేవ చేయడం ద్వారా ఆ రోజును మరింత అర్థవంతంగా మార్చుకోవచ్చని అన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల చిరునవ్వులో దైవాన్ని చూడవచ్చు అని తెలిపారు. వారి మధ్య కొంత సమయం గడపడం, వారితో ఆనందాన్ని పంచుకోవడం ద్వారా లభించే ఆత్మసంతృప్తి మాటల్లో చెప్పలేనిదన్నారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. ప్రత్యేక ప్రతిభావంతులు ఎవరికీ తక్కువ కాదని, వారిలో అపారమైన ప్రతిభ, ఆత్మవిశ్వాసం, జీవనపోరాట స్ఫూర్తి దాగి ఉంటుందని అన్నారు. వారిని జాలి చూపాల్సిన అవసరం లేదని, ప్రేమ, ప్రోత్సాహం, అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. వారిని విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రోత్సహిస్తూ స్వయం సమృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారు, అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు, ప్రత్యేక ప్రతిభావంతులు వంటి వర్గాలకు అండగా నిలవడం నిజమైన మానవత్వమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ వేడుకలు, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు వంటి సందర్భాల్లో కనీసం ఒక సేవా కార్యక్రమాన్ని నిర్వహించే అలవాటు చేసుకుంటే సమాజంలో ఎంతో సానుకూల మార్పు వస్తుందని సూచించారు. అక్షయ క్షేత్రం వంటి సేవా సంస్థలు సమాజానికి ఎంతో విలువైన సేవలు అందిస్తున్నాయని కొనియాడారు. ఇలాంటి సంస్థలకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులు వేణు ముదిరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆయన సేవా కార్యక్రమాలను అభినందించారు. అక్షయ క్షేత్రం నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా ప్రతినిధులు, సామాజిక సేవకులు, అభిమానులు, అక్షయ క్షేత్రం నిర్వాహకులు, ప్రత్యేక ప్రతిభావంతులు, పలువురు ప్రముఖులు పాల్గొని వేణు ముదిరాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు చివరి గడువు రెండు రోజులే

### ఓటర్లు ఎన్యూమిరేషన్ ఫారాలు బిఎల్ఓలకు అందజేయాలి

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు గడువు చివరి రెండు రోజులేనని... ఈ రెండు రోజులుగా గ్రామాలలో ఓటర్లకు బి ఎల్ వో లు ఇచ్చిన ఎన్యూమిరేషన్ పారాలలో పూర్తి సమాచారాన్ని నింపి ఫోటో అతికించి బిఎల్వోలకు అందించి ఓటు హక్కు



పొందాలని మండల సహాయ ఎన్నికల అధికారి యు మధుసూదన్ రావు కోరారు. శుక్రవారం మండలంలోని అనుపల్లె గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించి, సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఎల్ వో లు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ -2026 సర్వేను వేగవంతంగా పారదర్శకంగా నిర్వహించి ప్రగతిని పెంచాలన్నారు. ఎన్యూమిరేషన్ పారాలను సర్ యాప్ లో డిజిటలైజేషన్ చేయడానికి రెండు రోజులే గడువు మిగిలింది అన్నారు. . ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో విధులు నిర్వర్తిస్తున్న బిఎల్వోలు రెండవ శనివారం, ఆదివారం కూడా విధులకు హాజరు కావాలన్నారు. శని ఆదివారాలలో ఎన్నికల విధులలో ఉన్న సిబ్బందికి ఎలాంటి మినహాయింపు లేదని, అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని, విధులకు గైరాజర్రై, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చివరి రెండు రోజులలో సిబ్బంది కష్టపడి సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. ఇంటింటి సర్వే నిర్వహించి గ్రామం నుండి శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లు, మరణించిన, నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించాలన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 నిర్వహణలో బూత్ లెవెల్ ఆఫీసర్లు ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలన్నారు. తప్పులు తడకలు లేని ఓటర్ల జాబితా తయారు చేయడానికి ఓటర్లు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రైవేట్ స్కూల్ బస్సు నిర్లక్ష్యం వలన ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆర్మీ జవాన్ విష్ణువర్ధన్ రెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్య నిర్లక్ష్యం విద్యార్థులను అధిక లోడుతో వస్తూ స్టేట్ బ్యాంక్ ఎదురుగా కంట్రోల్ తప్పి విష్ణువర్ధన్ రెడ్డి వ్యక్తిని తగిలించడం దౌర్భాగ్యమైన చర్యని సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి కేశవ, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి జెబి ఉల్లా విలేకరుల సమావేశంలో ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా సిపిఐ, ఏఐఎస్ఎఫ్





నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల భద్రత బాధ్యతకాదు, స్కూలు యాజమాన్యం హక్కు, అలాంటిది కాళ్లు పెట్టిన వీలుగాక, మహిళలకు పల్లె వెలుగు బస్సులు వలె, ఎంతమంది విద్యార్థులను అంటే అంత మంది విద్యార్థులను ఎక్కి ఇవ్వడం, వైష్ణవి స్కూల్ కు పరిపాటిగా మారిందని వారు అగ్రహారం చెందారు. అదేవిధంగా ఇంకా ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి ఉంటే వందలాదిమంది విద్యార్థుల తల్లిదండ్రులు బాధపడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒకపక్క అధిక ఫీజులు, రకరకాల బుక్స్, టై, బెల్టు, ఎగ్జామ్ ఫీజుల పేరుతో, పిల్లల తల్లిదండ్రుల నుండి ఆదిక ఫీజులు రాబట్టుకొని, మిద్దెలపై, మిద్దెలు కట్టుకొని లక్షల రూపాయలు సంపాదించు కున్నప్పుడు అదనపు బస్సులు వేసి ఉంటే ఇలాంటి ప్రమాదం జరగకుండా ఉండేవని వారు అన్నారు. ప్రైవేట్ స్కూల్లో నడిపే వాహనాలకు ఎప్పటికప్పుడు ఇన్సూరెన్స్, ట్యాక్స్, ఎఫ్ సి వంటివి వాహనాలు తనిఖీ ఉంటే ఈ విధంగా అధికలోడు ఎక్కించలేని పరిస్థితి కనుక వెంటనే వైష్ణవి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని,విష్ణువర్ధన్ రెడ్డి కి న్యాయం జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ గా అధికారులకు తెలియజేస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో డ్రైవర్లకు ఎలాంటి లైసెన్సులు ఉన్నాయో, లేవో తెలియని పరిస్థితుల్లో ఉన్నారని వారు ఆవేదన చెందారు. విష్ణువర్ధన్ రెడ్డిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## నవగ్రహ విగ్రహ ప్రతిష్టకు రూ.25 వేల విరాళం

ప్రజాభూమి ప్రతినిధి నారాయణవనం ప్రముఖ పుణ్యక్షేత్రమైన కైలాసకోనలోని శ్రీ కామాక్షి అంబికా సమేత కైలాసనాథేశ్వర స్వామి ఆలయంలో త్వరలో నిర్వహించనున్న నవగ్రహ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆలయ పాలకమండలి మాజీ అధ్యక్షుడు బత్తల భాస్కర్ యాదవ్ రూ. 25 వేల విరాళాన్ని అందజేశారు.



ఆలయాధికారి కృష్ణ నాయక్, ఆలయ అర్చకుల సమక్షంలో ఆయన ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయాధికారి కృష్ణ నాయక్, అర్చకులు బత్తల భాస్కర్ యాదవ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు అందించే విరాళాలు, సహకారంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగా కొనసాగుతాయని, నవగ్రహ విగ్రహ ప్రతిష్టతో పాటు ఇతర ధార్మిక కార్యక్రమాలను కూడావైభవంగా నిర్వహించేందుకు భక్తులందరూ తమవంతు సహకారం అందించాలని వారు కోరారు.

## రాజుపాలెం పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం

ప్రజాభూమి పోరుమామిళ్ల : కలసపాడు మండలము - రాజుపాలెం గ్రామ వాస్తవ్యులు పోకల మల్లికార్జున రెడ్డి నీ స్కూల్ టీచర్ రంగనాయకులు



స్కూల్ చైర్మన్ కరిముల్లా పిల్లలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయమని కోరడం జరిగింది పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సహృదయంతో వారు పిల్లలకు నోట్ బుక్స్, స్లేట్ ,పెన్సిల్స్ ,పెన్నులు, ఎరేజర్ వగైరా వస్తువులను పిల్లలకు శుక్రవారం పంపిణీ చేయడం ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు, ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారమే లక్ష్యంగా ప్రతి నెల ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎక్కువగా రెవిన్యూ శాఖలో ఫిర్యాదులు వస్తున్నాయని త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని



గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు . గూడూరు పట్టణంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు నాయకులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు పలు గ్రామాల నుండి ప్రజలు వచ్చి తమ



సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేశారు అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలు అక్కడికక్కడే ఎమ్మెల్యే పరిష్కరించారు నూతనంగా ప్రభుత్వ మంజూరు చేసిన ఇంటి పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా దర్బారులో ప్రజల తమ సమస్యలు తెలియజేశారని రెవెన్యూ శాఖలో ఎక్కువగా సమస్యలు ఉన్నాయని న్యాయబద్ధంగా ఉన్న వాటిని తప్పక పరిష్కరిస్తామని తెలిపారు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పార్టీలకతీతంగా పేదవారందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రజా దర్బార్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్ ,నాయకులు కిరణ్ కుమార్ శ్రీనివాసులు వెంకటేశ్వరరాజు రహీం వైయస్సార్ శ్రీనివాస్ రెడ్డి మట్టం శ్రావణి ,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

ప్రజాభూమి

జనరల్

శనివారం, జులై 11, 2026



# జిల్లాలో 77.88 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్




## సహకారాన్ని కొనసాగిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## సర్‌పై రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలోని కీలకదశ అయిన ఇంటింటి సర్వే సాఫీగా సాగుతోందని.. ఇప్పటివరకు 75 శాతం ఎన్యూ మరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిం దని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ప్రక్రియ లో కీలక సహకారం అందిస్తున్న రాజకీ య పక్షాలు మరింత సహకారంతో కార్యక్రమం విజయవంతానికి చేయూతనివ్వాలని కోరారు. శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల సమావేశం జరి గింది. ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ ప్రస్తుతం జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ జరుగుతున్న తీరును వివరించారు. వివిధ అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహా లను నివృత్తి చేశారు. జిల్లాలో 13,34,504 (77.88 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజే షన్ పూర్తయింది దని వెల్లడించారు. తిరువూరు నియోజకవర్గంలో 1,80,018 (86.25 శాతం), విజయవాడ పశ్చిమలో 1,83,788 (71.52 శాతం), విజయవాడ సెంట్రల్‌లో 2,02,494 (72.89 శాతం), విజయవాడ తూర్పులో 2,00,092 (74.18 శాతం), మైలవరంలో 2,31,191 (81.07 శాతం), నందిగామలో 1,68,716 (81.32 శాతం), జగ్గయ్యపేటలో 1,68,205 (81.04 శాతం) ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని వివరించారు. నియోజకవర్గాల్లో బీఎల్‌వోలతో పాటు హెల్ప్ డెస్కులు అందుబాటులో ఉన్నాయని, ఓటరు హెల్ప్‌లైన్ (1950) కూడా అందుబాటులో ఉందన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు విశేష కృషి చేస్తున్నారని.. వీరికి అధికారులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఫారా లు సమర్పించే విషయంలో బీఎల్ఏలు కూడా ఓటర్లను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు వై.రామయ్య, కె.రాజేష్ (తెదేపా), తరుణ్ కాకాని (భాజపా), జె.శ్రీనివాస్ (జేఎస్‌పీ), డీవీ కృష్ణ (సీపీఐ-ఎం), వై.ఆంజనేయరెడ్డి (వైఎస్ఆర్‌సీపీ), పవన్ కార్తీక్ (బీఎస్‌పీ), పి.హరికృష్ణ (ఆప్) పాల్గొన్నారు.

# పోలీస్ అంటే రక్షకుడు మాత్రమే కాదు... మానవతా మూర్తి అని నిరూపించిన సీఐ ఏసుబాబు

## మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్‌లో ప్రమాదం సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన ఆర్‌పేట సీఐ



మచిలీపట్నం క్రైమ్ /ప్రజాభూమి ప్రతినిధి సమయానికి ఆయనే కనుక అక్కడ లేక పోయి ఉంటే... ఆ మహిళ పరిస్థితి ఏంటో? ఖాకీ చొక్కా వెనుక ఉన్న కరుడుగట్టిన హృదయాన్ని కాదు, కరిగిపోయే కరుణామయుడిని చూపించారు ఆర్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఏసుబాబు. మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్‌లో శుక్రవారం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఆయన చూపిన చొరవ, మానవతా దృక్పథం స్థానికులచే 'శభాష్ పోలీస్' అనిపించుకుంది.అసలేం జరిగిందంటే..? శుక్రవారం జిల్లా కోర్టు సెంటర్ గుండా ఒక మహిళ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, ఒక్కసారిగా రోడ్డుపైకి దూసుకొచ్చిన ఆవు ఆమెను బలంగా ఢీకొట్టింది. ఊహిం చని ఈ ప్రమాదంతో ఆమె వాహనంతో సహా రోడ్డుపై కిందపడిపోయింది. ఒంటిపై గాయా లతో, షాక్‌తో ఏం చేయాలో తెలియక ఆ మహిళ రోడ్డుపైనే ఉండిపోయింది. దేవుడిలా వచ్చిన సీఐ ఏసుబాబు...అదే సమయంలో విధి నిర్వహణలో భాగంగా అటుగా వెళ్తున్న ఆర్‌పేట సీఐ ఏసుబాబు ఈ ఘటనను గమనించారు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా, తన ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి వాహనం దిగి నేరుగా బాధితురాలి వద్దకు చేరుకున్నారు.తక్షణ సాయం: భయంతో వణికిపోతున్న మహిళను ప్రశాంతపరిచి, ప్రాథమిక సహాయం అందించారు. ఆసుపత్రికి తరలింపు: రద్దీగా ఉండే ఆ సెంటర్‌లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఆమెను చికిత్స నిమిత్తం సురక్షితంగా ఆసుపత్రికి తరలించేలా తక్షణ చర్యలు తీసుకున్నారు."ప్రమాదం జరిగినప్పుడు చాలామంది చూస్తూ ఉండిపోతారు లేదా ఫోన్లలో రికార్డ్ చేస్తారు. కానీ ఒక బాధ్యతాయుతమైన అధికారిగా సీఐ ఏసుబాబు స్పందించిన తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శం.— స్థానిక ప్రత్యక్ష సాక్షులు రోడ్లపై పశువుల స్వైరవిహారం.. అధికారులారా యాక్షన్ ప్లాన్ ఎప్పుడు?ఈ ప్రమాదం సీఐ మానవత్వాన్ని చాటినప్పటికీ, పట్టణంలో నెలకొన్న మరో ప్రధాన సమస్యను తెరపైకి తెచ్చింది. మచిలీపట్నంలోని ప్రధాన రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువుల కారణంగా తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వాహనదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ మూగజీవాల సంచారాన్ని నియంత్రించేందుకు మున్సిపల్, సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని, పశువుల యజమానులపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఫోటోగ్రఫీ పితామహుడు డాగురేకు ఘన నివాళి

## మచిలీపట్నంలో 175వ వర్ధంతి వేడుకలు..

## కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసిన స్థానిక ఫోటోగ్రాఫర్లు



కృష్ణాజిల్లా/మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి ప్రపంచానికి ఫోటోగ్రఫీ కళను పరిచయం చేసి, ఆధు నిక ఛాయాచిత్ర రంగానికి బలమైన పునాది వేసిన మహనీయుడు, ఫోటో గ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వస్ మండే డాగురే. ఆయన 175వ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం జిల్లా పరిషత్ సెంటర్‌లో ఉన్న డాగురే కాంస్య విగ్రహానికి స్థానిక ఫోటోగ్రాఫర్లు, స్టూడియో నిర్వాహకులు ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆయన సేవలు చిరస్మరణీయం..ఈ సందర్భంగా పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు మాట్లాడుతూ.. మానవ జీవితంలోని మధురస్మృతులను భద్రపరిచే అద్భుతమైన విజ్ఞానాన్ని, కళను డాగురే మనకు అందించారని కొనియాడారు. ఆయన చేసిన ఆవిష్కరణలు, సేవలు ఫోటోగ్రఫీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.


"నేడు మనం చూస్తున్న ఆధునిక డిజిటల్ విప్లవానికి నాడే డాగురే వేసిన పునాదే కారణం. ఆయనను స్మరించుకోవడం ప్రతి ఫోటోగ్రాఫర్ బాధ్యత."— స్థానిక ఫోటోగ్రఫీ ప్రముఖులుఘనంగా సాగిన కార్యక్రమంఅనంతరం డాగురే జీవిత విశేషాలను, ఫోటోగ్రఫీ రంగ అభివృద్ధికి ఆయన పడిన శ్రమను, అందించిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకున్నారు.పాల్గొన్నవారు: ఈ కార్యక్రమంలో బందరు పట్టణానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్లు, వివిధ ఫోటో స్టూడియోల నిర్వాహకులు, ఫోటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు మరియు రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కానూరులో హితేష్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ రొయ్యల ఫ్యాక్టరీ ప్రారంభం

## పాల్గొన్న టీడీపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ

## మేనేజింగ్ పార్టనర్ కొప్పర్తి సూర్యనారాయణకు శుభాకాంక్షలు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి



కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం కానూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన హితేష్ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ రొయ్యల ఫ్యాక్టరీ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కృష్ణా జిల్లా టీడీపి ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సంద ర్భంగా ఆయన ఫ్యాక్టరీ ప్రాంగణాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక రొయ్యల ప్రాసెసింగ్ విభా గాలను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీ మేనేజింగ్ పార్టనర్ కొప్పర్తి సూర్యనారాయణకు, యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రాంతంలో ఇలాంటి పరిశ్రమల స్థాపన వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయని ఈ సందర్భంగా పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సమాచార హక్కు అమలు.. సుపరిపాలనకు నిదర్శనం

- ప్రజలకు సమాచారమే శక్తి.. ఆ హక్కు పరిరక్షణే అధికారుల బాధ్యత
- రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం స్పష్టీకరణ
- విజయవాడలో ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన కార్యాలయాలకు షోకాజు నోటీసులు



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపే తమ వుతాయని రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం స్పష్టం చేశారు. ప్రజలకు సమాచారాన్ని సకాలంలో అందించడం ప్రతి ప్రభుత్వ అధికారి చట్టబద్ధమైన బాధ్యత అని స్పష్టం చేశారు.శుక్రవారం రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం విజయవాడలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సమాచార ప్రకటన నిబంధనల అమలు, ప్రజా సమాచార అధికారుల (పీఐవోలు) నియామకం, మొదటి అప్పీలేట్ అధికారుల వివరాల ప్రదర్శన, సమాచార హక్కు దరఖాస్తులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. తొలుత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం డీఆర్‌వో కార్యాల యాన్ని సందర్శించి స.హ. చట్టం, 2005 అమలుతీరుతెన్నులను పరిశీలించారు. ఆపై ఆకస్మిక తనిఖీలలో భాగంగా దుర్గాపురం, గులాబీతోట స్వర్ణ వార్డు కార్యాలయాలతో పాటు న్యూ జీజీహెచ్, వక్ఫ్‌బోర్డు, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలను తనిఖీ చేశారు. అయితే సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దుర్గాపురం, గులాబీతోట స్వర్ణవార్డు కార్యాల యాలకు, అదేవిధంగా 4(1)(బి) రిజిస్టర్‌తో పాటు మరికొన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించక పోవడంతో జీజీహెచ్‌కు నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా డా. రెహానా బేగం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కేవలం సమాచారం అందించే చట్టం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక సాధనమన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ముందస్తుగా అందుబాటులో ఉంచితే సమాచార హక్కు దరఖాస్తులు, అప్పీళ్ల సంఖ్య కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రజలకు సకాలంలో సమాచారం అందించి పారదర్శకతకు పెద్దపీట వేయాలని సమాచార కమిషనర్ డా. రెహానా బేగం సూచించారు.

# శనివారం జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

**రాజీ మార్గంతో సమయం, డబ్బు ఆదా**

**మానవ సంబంధాల బలోపేతం**

**మచిలీపట్నంలో 5 సహా జిల్లా వ్యాప్తంగా 45 ప్రత్యేక బెంచీల ఏర్పాటు**

**విలేకరుల సమావేశంలో ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. సునీత, సంస్థ కార్యదర్శి ఎస్. వరలక్ష్మి**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగే పనిలేకుండా, పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకునేందుకు శనివారం (జూలై 11) నిర్వహించనున్న 'జాతీయ లోక్ అదాలత్'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి కె. సునీత పిలుపునిచ్చారు.శుక్రవారం సాయం త్రం మచిలీపట్నంలోని జిల్లా కోర్టు ఆవరణలో గల న్యాయ సేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మితో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు.జిల్లా వ్యాప్తంగా 45 బెంచీలు..ఈ ఏడాదిలో నిర్వహిస్తున్న రెండో జాతీయ లోక్ అదాలత్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు కోర్టుల పరిధిలో జరుగుతుందని ఇంచార్జ్ జిల్లా జడ్జి తెలిపారు. కక్షిదారుల సౌకర్యార్థం మొత్తం 45 బెంచీలు ఏర్పాటు చేయగా, ఒక్క మచిలీపట్నంలోనే 5 ప్రత్యేక బెంచీలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.పరిష్కరించుకోదగ్గ కేసులు ఇవే:రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులుమోటారు వాహన ప్రమాద పరిహార క్లెయిమ్ (MVOP) కేసులుట్రాఫిక్ చలానా కేసులు, అన్ని రకాల సివిల్ కేసులుకోర్టులో దాఖలు కాకముందే పరిష్కరించుకునే ప్రీ-లిటిగేషన్ కేసులు"గత మార్చి 14న నిర్వహించిన లోక్ అదాలత్‌లో record స్థాయిలో 1,09,388 కేసులు పరిష్కారమయ్యాయి. ఈసారి అంతకంటే ఎక్కువ కేసులను పరిష్కరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. లోక్ అదాలత్ ద్వారా కేసుల రాజీతో మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా, అర్హత ఉన్న కేసుల్లో కోర్టు ఫీజు కూడా తిరిగి చెల్లించబడుతుంది."– కె. సునీత, ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిసమర్థవంతమైన ప్రత్యామ్నా య వేదికజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. వరలక్ష్మి మాట్లాడుతూ, ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించేందుకు లోక్ అదాలత్ ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదిక అని కొనియాడారు. ఈ కార్యక్రమ విజయవంతం కోసం ఇప్పటికే పోలీసులు, న్యాయవాదులు, బీమా సంస్థలు, బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల ప్రతినిధులతో పలుమార్లు సమన్వయ సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. కుటుంబ వివాదాలు, బ్యాంకు రికవరీ కేసుల కక్షిదారులు సామరస్యపూర్వకంగా సమస్యలను ముగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.ప్రత్యేక ఆకర్షణ: సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో 'సమాధాన్ సమారోహ' సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు కక్షిదారులకు ఒక అరుదైన అవకాశం లభించిందని జడ్జి ఎస్. వరలక్ష్మి తెలిపారు.

ప్రత్యేక లోక్ అదాలత్ తేదీలు: ఆగస్టు 21, 22, 23 ప్రీ-లోక్ అదాలత్ సిట్టింగ్స్: సుప్రీంకోర్టు అదాలత్ కంటే ముందే జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ప్రీ-లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహించి, సంబంధిత కక్షిదా రులను పిలిపించి రాజీ అవకాశాలను పరి శీలిస్తారు.సుప్రీంకోర్టులో రాజీ పడదగ్గ కేసులున్న కక్షిదారులు ఈ అరుదైన అవకాశాన్ని ఉపయోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూసుకోవాలని ఆమె కోరారు.

# మచిలీపట్నం మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి తనిఖీ



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) యు.వి. సుబ్బారావు శుక్రవారం మచిలీపట్నం మండలంలోని జి.వి.ఎస్.ఆర్ మున్సిపల్ హైస్కూల్ ( ఖలేకానీపేట )ను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా, అకడమిక్ మరియు ఇతర కార్యక్రమాలను ఆయన సమ గ్రంగా సమీక్షించారు.10వ తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టితనిఖీలో భాగంగా పదవ తరగతి విద్యార్థుల అభ్యాస ఫలితాలను విద్యాశాఖ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న సమీక్షించిన ముఖ్య అంశాలు:బోధనా పద్ధతు లు: ఉపాధ్యాయుల బోధనా విధానాలు, అకడమిక్ క్యాలెండర్ అమలు తీరు.నోట్‌బుక్‌ల పరిశీలన: విద్యార్థుల నోట్‌బుక్‌ల దిద్దుబాటు విధానం, తరగతి గది నిర్వహణ.వ్యక్తిగత శ్రద్ధ: విద్యార్థుల అభ్యాస స్థాయిని క్షుణ్ణంగా పరిశీలించి, చదువులో వెనుకబడిన బలహీన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఫలితాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు లక్ష్యబద్ధంగా పనిచేయాలని సూచించారు.మధ్యాహ్న భోజనం & క్రమశిక్షణ"మధ్యాహ్న భోజనం అమలులో నాణ్యత, పరిశుభ్రత, రుచి వంటి ప్రతి అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి."— యు.వి. సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారిపాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన ఆయన, నాణ్యత విషయంలో రాజీ పడకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, పాఠశాల క్రమశిక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా యూనిఫాం ధరించేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

# పవన్ కళ్యాణ్ చుట్టూనే ఏపీ రాజకీయం: ఎంపీ బాలశౌరి



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు గమనిస్తే చర్చలన్నీ ఒకే ఒక్క వ్యక్తి చుట్టూ కేంద్రీకృతమవుతున్నాయని, ఆయనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అని మచిలీపట్నం (బందరు) పార్ల మెం ట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి స్పష్టం చేశారు. జవాబుదారీతనం, అభివృద్ధి, దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి సారించిన కొత్త తరహా నాయకత్వానికి పవన్ కళ్యాణ్ ప్రతినిధిగా నిలిచా రని ఆయన కొనియాడారు.ఈ మేరకు బాలశౌరి ఒక ప్రకటన విడు దల చేస్తూ, రాష్ట్ర రాజకీయాల్లో పవన్ చూపిస్తున్న నిబద్ధత, కూటమి ప్రభుత్వంలో ఆయన పాత్రపై ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోందని పేర్కొన్నారు.సనాతన భారతీయ విలువల పరిరక్షణ, జాతీయ దృక్పథం, అవినీతి నిర్మూలన, సుపరిపాలనే ధ్యేయంగా పవ న్ రాజకీయం సాగుతోంది.కొందరు పవన్ను కులం, ప్రాంతం, మతం అనే సంకుచిత కోణాల్లో చూ పించే ప్రయత్నం చేస్తున్నారని.. కానీ ఆయన రాజకీయం కులం కోసం కాదు దేశం కోసం, అధికా రం కోసం కాదు ప్రజల భవిష్యత్తు కోసం అని స్పష్టం చేశారు. జాతీయ సమైక్యత, సామాజిక న్యా యం, ప్రజాస్వామ్య పరిరక్షణే ఆయన రాజకీయాల పునాదులని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజల తీర్పు స్పష్టం"రాజకీయ చర్చ పార్టీల చుట్టూ కాకుండా, క్రమంగా పవన్ చుట్టూనే తిరిగే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు ఆయన మార్పు కోసం తపిస్తుంటే, మరోవైపు ఆయనను బలహీనపరచడానికి కుట్రలు చేస్తూ ప్రతిపక్షం తన రాజకీయ అజ్ఞానాన్ని ప్రదర్శిస్తోంది.ఈ పరిస్థితి ఇలాగే కొన సాగితే, రాబోయే ఎన్నికలు రెండు భిన్నమైన సిద్ధాంతాల మధ్య పోరుగా మారే అవకాశం ఉంది. జాతీయ సమైక్యతను, దేశాభివృద్ధిని కాంక్షించే వారు ఒకపక్కన నిలిస్తే.. జాతీయ భావనను బలహీనపరుస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసే వారు మరోవైపు ఉంటారు. ఇటువంటి పరిస్థితిలో తుది తీర్పు ప్రజ లదే. ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్ష కుట్రలను గమనిస్తున్న ప్రజలు రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి ప్రభు త్వానికి మద్దతుని కొనసాగిస్తూ, పవన్ కళ్యాణ్ కు తప్పకుండా అండగా నిలుస్తారు" అని ఎంపీ వల్లభనేని బాలశౌరి ధీమా వ్యక్తం చేశారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

# గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలి



ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం

మండలంలోని ఉమ్మడివరం, రెడ్డిగుంప, నాగేంద్ర పురం, రామాపురం తదితర గ్రామాలలో ప్రజానీకం డెంగ్యూ, మలేరియా జ్వరాలతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వైద్య అధికారులు గ్రామ గ్రామాన మెడికల్ క్యాంపులు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని మండల ఎంపీపీ కారం లక్ష్మి కోరారు. శుక్రవారం మండలంలోని పిహెచ్సీ ని పరిశీలించి అక్కడ ఉన్న రోగుల ఆరోగ్యపరమైన విషయాలను, వారికి జరుగుతున్న వైద్యతీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఉమ్మడివరం, రెడ్డిగుంపు గ్రామాలలో ఎక్కువగా డెంగ్యూ, మలేరియా జ్వరాల బారిన పడి ప్రజలు అనారోగ్యాలకు గురైన వారి దగ్గరకు వెళ్లి వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పర్యటనలో ఉన్న జిల్లా వైద్య అధికారులు డి ఎం అండ్ హెచ్ ఓ, అడిషనల్ డి ఎం హెచ్ ఓ లను కలిసి తక్షణమే డెంగ్యూ, మలేరియా నివారణ కొరకు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే ఇంటి ఇంటికి వెళ్లి ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు చేయించాలని జిల్లా వైద్య అధికారులను కోరారు. దానితోపాటుగా ఏజెన్సీలోని దోమ కాటు ఎక్కువగా ఉన్నదని, దోమల నివారణ కొరకు దోమల మందు పిచికారి చేయించి,తక్షణమే దోమతెరలు పంపిణీ చేయాలని వారిని కోరారు. ఉమ్మడివరం గ్రామంతో పాటు రెడ్డిగుంపు, నాగేంద్రపురం, రామాపురం మొదలైన గ్రామాలన్నింటిలో ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు నిర్వహించాలని, మండలంలో ఒకే ఒక్క డాక్టర్ ఉండడం వలన పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదని, గ్రామాల్లో క్యాంపులకు ఉన్న ఒక డాక్టర్ వెళ్తే, హాస్పిటల్లో డాక్టర్ లేని పరిస్థితి నెలకొందని తక్షణమే మరో డాక్టర్ ను నియమించాలని, రానున్నది వరదల కాలము కాబట్టి అదనపు డాక్టర్ నియమించి వైద్యం అందించాలని తెలిపారు. డెంగ్యూ వైద్య నివారణ కొరకు ప్రతి ఒక్కరూ కోతులగుట్ట వైద్యశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో రేఖపల్లి పిహెచ్సి లో కూడా డెంగ్యూ కి సంబంధించిన మందులు ఉంచి ట్రీట్మెంట్ చేయించాలని జిల్లా అధికారులను ఎంపీపీ కారం లక్ష్మి కోరారు. స్పందించిన జిల్లా అధికారులు తక్షణమే మరో డాక్టర్ ను ఏర్పాటు చేసే విధంగా పై అధికారులతో మాట్లాడతామని, డెంగ్యూ కి కూడా రేఖపల్లి హాస్పిటల్లో వైద్యం అందించేలా అన్ని సదుపాయాలు కల్పిస్తామని, గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించి డెంగ్యూ మలేరియా జ్వరాలను నివారణ చేయడం కోసం ప్రయత్నం చేస్తామని ఎంపీపీ కి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం.శ్రీరామ్మూర్తి, కమ్మచిచ్చు. సత్యనారాయణ, కుంజ కన్నయ్య, నాల్లారపు.ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ వేలం వాయిదా- నిబంధనలకు తూట్లు

- జీవో పేరుతో కొత్త మెలిక డిపాజిట్ దారులు ఆగ్రహం.
- నాటకీయ పరిణామాలు మధ్య ఆపిన వేలంపాట.



ప్రజాభూమి ప్రతినిధి–కాజులూరు

గొల్లపాలెం సిపిడబ్ల్యూఎస్ చెరువులో చేపల వేట బహిరంగ వేలం నిబంధనలు పక్కనపెట్టి అదికారులు వాయిదా వేశారు . ఈమేరకు శుక్రవారం కాజులూరు మండలపరిత్ కార్యాలయంలో జరగాల్సిన బహిరంగ వేలం నాటకీయ పరిణామాలు మధ్య వాయిదా వేసి అదికారులు చేతులు దులుపుకున్నారు కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో గల సిపిడబ్ల్యూఎస్ చెరువులో సహజసిద్ధంగా పెరిగిన మత్స్య సంపదకు సంబంధించి జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ రెవెన్యూ అధికారి కె.శ్రీనివాసు కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జె రాంబాబుల సమక్షంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ వేలం పాటకు మండల గ్రామాలకి చెందిన ఎనిమిది మంది సభ్యులు ఒక్కొక్కరి వద్ద నుండి రూ 9 వేల రూపాయలు నగదు తో పాటుగా సాల్వెన్సీ సర్టిఫికెట్ను కూడా అధికారులు స్వీకరించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన వేలంపాట నాటకీయ పరిణామాలుతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు తత్సారం చేసుకుంటూ వచ్చారు .ఒక అజ్ఞాత వ్యక్తి జెడ్పిఆర్ఓ కె. శ్రీనివాస్ తో చెవిలో రహస్యంగా చెప్పిన మాటకు అప్పటికప్పుడు వేలంపాట వాయిదా వేస్తున్నట్లు శ్రీనివాస్ ప్రకటించారు.దీంతో వేలం పాట కోసం డిపాజిట్లు చేసిన పాట దారులు కంగు తిన్నారు. వేలంపాట వాయిదా వేయడం గల కారణాలను తేల్చవలసిందిగా డిపాజిట్ దారులు అధికారులను నిలదీశారు . మత్స్యకార సంఘాలకు సంబంధించిన జీవోలు ఉన్నాయంటూ దరఖాస్తు వచ్చిన నేపథ్యంలో పాట నిలిపివేయాలని ఎవో నుండి ఆదేశాలు వచ్చేయని ఆర్వో శ్రీనివాస్ పేర్కొన్నారు .దీంతో ఆగ్రహించిన డిపాజిట్ దారులు తమ డిపాజిట్లను వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని తగిన ఆధారాలు చూపించి పాట వాయిదా వేయాలని డిమాండ్ చేశారు .కొంతసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి గత వారం రోజుల క్రితమే పబ్లిక్ నోటీసు అమలు చేసి గ్రామపంచాయతీ ద్వారా దండోరా వేయించి పేపర్లో ప్రకటన ఇచ్చిన తర్వాత ప్రభుత్వ నిబంధనలకు లోబడి వేలంపాట నిర్వహిస్తామని చెప్పి ఇప్పుడు వేలంపాట వాయిదా వేయడం ఏంటి అని అధికారులను డిపాజిట్లు కట్టిన బొడ్డు నాగమల్లేశ్వరరావు కోరడంతో మీకు ఏదైనా తెలుసుకోవాలంటే జిల్లా పరిషత్ సీఈఓతో మాట్లాడుకోవాలని తన పరిధిలో లేదని ఎంపిడిఓ రాంబాబు స్పష్టంచేసారు. ముందుగా అధికారులకు అలాంటి జీవోలు విషయం తెలియకుండా వేలంపాట కు పబ్లిక్ నోటీసు ఇచ్చారా అంటూ ఇది అత్యంత హేయమైన చర్యని డిపాజిట్ దారులు గుర్రుగా ఉన్నారు. 2004వ సంవత్సరంలో సిపిడబ్ల్యుసి చెరువు తవ్వినపడనుండి ప్రతి రెండు మూడు సంవత్సరాలకు చెరువులో సహజసిద్ధంగా పెరిగిన చేపలకు వేలంపాట నిర్వహిస్తూ వచ్చారు. ఇప్పటివరకు కొనసాగుతున్న విధి విధానాలను కాదని ప్రస్తుత జెడ్పిఆర్ఓ శ్రీనివాసు వేరే జీవోలు ఉన్నాయంటూ వేలంపాట వాయిదా వేశారు. డిపాజిట్ దారులని వారి యొక్క సాల్వంచ సర్టిఫికెట్లు డిపాజిట్లు తిరిగి తీసుకోవాలని ఆయన ఆదేశించారు సరైన కారణం చూపకుండా ప్రలోభాలకు లోబడి పాట వాయిదా వేస్తున్నారు గాను డిపాజిట్ తిరిగి తీసుకోవడం కుదరదని సాల్వంచ సర్టిఫికెట్ లో కూడా తమ వద్ద ఉంచాలని వేలం ఎప్పుడు నిర్వహిస్తే అప్పుడు తమకు తెలియజేయాలని డిపాజిట్ దారులు కరాకండిగా తేల్చి చెప్పారు దీంతో డిపాజిట్ సొమ్ములు మొత్తం జిల్లా పరిషత్ ఆర్.ఓకే శ్రీనివాస వద్ద ఉంచుకున్నారు.ఎదిఏమైనా ఇక్కడ చెరువులో గతంలోనే కొంతమంది అజ్ఞాతవక్తులు రాత్రుల్లు చేపలువేసి అనధికారికంగా పెంచినట్లు సమాచారం కాగా అప్పట్లో చేపలు వేసిన రోజుల్లో చేపలు కుప్పలు తెప్పలుగా చనిపోవడానికి ఆంధ్రప్రభ వెలుగులోకి తెచ్చిన సంగతి పాఠకులకు విదితమే

# వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి శాంతి కళ్యాణ మహోత్సవం



ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

శ్రీ శోభనాచల గట్టుపై వెలసిన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధల తో వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఉత్సవాల్లో స్వామివారికి శాంతి కళ్యాణాన్ని వేదపండితులు వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించగా, అనంతరం శ్రీ నారసింహ సుదర్శన హోమం ఘనంగా జరిగింది. ఉభయదాతలు మడుపల్లి అశోక్, ఫణి, శ్రీదేవి, అవినాష్ సాయి, శ్రీరేష్మ దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాంతం శేషబాబు, అనంత కృష్ణలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్ సాయి తెలిపారు.

### రుద్రం కోటలో ప్రకృతి వైపరీత్యాలలో ఒకరినొకరు రక్షించుకునే తీరుపై

# "మాక్ డ్రిల్ " నిర్వహించిన ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు



ప్రజా భూమి ప్రతినిధి–వేలేరుపాడు.



ప్రకృతి వైపరీత్యాల్లో ప్రజలు ఆపదలో ఉన్న వారిని ఏ విధంగా రక్షించాలి అనే విషయంపై కాకినాడ ఎస్ డి ఆర్ ఫ్ బృందాలు రుద్రం కోట గోదావరి ఇసుకలో "మాక్ డ్రిల్" ప్రజలందరి సమక్షంలో నిర్వహించారు. తాసిల్దార్ శ్రీనివాస్, సిఐ బాల సురేష్ బాబు, ఎస్సై నవీన్ కుమార్ ల నేతృత్వంలో, శుక్రవారం రుద్రంకోటలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలంతా విరివిగా పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా గోదావరి వరదలు, అగ్ని ప్రమాదాలు వంటివి సంభవించినప్పుడు ఆపదలో ఉన్న వారిని ఏ విధంగా రక్షించుకోవాలో అనే అంశాలను ప్రాక్టికల్ గా చూపించారు. ఈ కార్యక్రమాలను అధికారులతో పాటు ప్రజలంతా ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సురేంద్ర కుమార్ ఆర్ ఐ భుజంగరావు వీఆర్వో పెంటారావు సిబ్బంది, పోలీస్ సిబ్బం ది, తెలుగుదేశం, జనసేన, బిజెపి, వైసిపి తదితర పార్టీలకు చెందిన నాయకులంతా పాల్గొన్నారు.


# మానసిక రోగి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు



మానవత్వమే మహోన్నత సేవ – మానసిక రోగి వైద్య ఖర్చులకు రూ.14000 ఆర్థిక సహాయం అందించిన జై భీమ్ యువసేన ఫౌండేషన్జై భీమ్ యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా, 2026 జూలై నెలకు సంబంధించిన తొలి సేవా కార్యక్రమం శుక్రవారం పాలకొల్లు మండలం నాగరాజుపేటలో నిర్వహించారు. నాగరాజుపేట టెంపుల్ సమీపంలో నివాసం ఉంటున్న కె. శైలజ(42) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె భర్త కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వైద్య పరిస్థితి కారణంగా కుటుంబ సభ్యులు తప్ప ఇతరులను కూడా గుర్తుపట్టలేని స్థితిలో ఆమె ఉన్నారు. అత్యంత దయనీయ పరిస్థితుల్లో, శిథిలావస్థలో ఉన్న అద్దె ఇంట్లో నివసిస్తూ వైద్య ఖర్చులను భరించలేక కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ విషయాన్ని జై భీమ్ యువసేన ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రాయపూడి భవాని ప్రసాద్ గారి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ఫౌండేషన్ కమిటీకి సమాచారం అందించారు. కమిటీ సభ్యుల నిర్ణయంతో ఈ నెల విరాళంగా రూ.14000 ను సుజాత వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు.గౌరవ అధ్యక్షులు రాయపూడి భవాని ప్రసాద్ మాట్లాడుతూ, మనిషికి మనిషి తోడుగా నిలబడినప్పుడే సమాజం బలపడుతుంది' అనే సందేశంతో జై భీమ్ యువసేన ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తోంది అన్నారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రైల్వే ఎంప్లాయ్ రవికుమార్ , సోషల్ టీచర్ సత్యనారాయణ, విజయకుమార్. పాల్గొన్నారు.

# పుస్తకాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

జాతీయ మత్స్య రైతుల దినోత్సవం సందర్భంగా ఆక్వా పితామహుడు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు కి సంబంధించిన పుస్తకాన్ని కేంద్ర ఉక్కు గనుల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ వారి క్యాంప్ ఆఫీసులో ఆవిష్కరించారు.ఈ మేరకు నిర్వాహకులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.ఆంధ్రప్రదేశ్ ను భారతదేశపు ఆక్వా రాజధానిగా నిలబెట్టడానికి ఉద్దరాజు కాశీ విశ్వనాథ్ రాజు కృషి ఎంతైనా ఉందని, 35 సంవత్సరాల క్రితం ఆక్వా ఎగుమతులు దేశం నుంచి 500 కోట్లు ఉంటే ఈరోజు 72 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదించి పెట్టే మార్గంగా ఆక్వా రంగం నీ తీర్చిదిద్దిన ఘనత వారిదని, వారు దేశంలోనే మొట్టమొదటి హేచరీ, ప్రాసెసింగ్ ప్లాంట్, మెగా ఆక్వా ఫుడ్ పార్క్, బయోఫ్లోక్ సాంకేతికత ఇలా ఎన్నో రంగాలను ప్రారంభించడంలో ముందున్నారని, వేలాది మంది మహిళలకు, కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ, వ్యాపారంలో అంతర్జాతీయ శిఖరాలను అధిరోహించిన కాశీ విశ్వనాథ రాజు గొప్ప కీర్తిని గడించారని అన్నారు. ఇవాళ భీమవరం పరిసర ప్రాంతాలు ఆక్వా పరిశ్రమకు ఒక పట్టు కొమ్మగా ఉన్నాయని, ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న మత్స్య రైతులకు, పెంపకం దారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.మన దేశ ఆహార భద్రతలో మరియు ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూ, రాత్రింబవళ్లు కష్టపడే మన మత్స్య రైతులు కష్టపడుతున్నారని, దేశ ప్రగతికి భాగస్వాములవుతూ, నీలి విప్లవానికి బాటలు వేస్తు అహర్నిశలు శ్రమిస్తూ, చెరువులనే నమ్ముకుని దేశానికి పౌష్టికాహారాన్ని అందిస్తున్న మన మత్స్య రైతుల కృషి అపూర్వమని అన్నారు.చేపల పెంపకంలో సరికొత్త విజయాలు సాధిస్తూ, ఆర్థికంగా ఎదుగుతూ అందరికీ ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు స్మృతి వనం కార్యదర్శి శ్రీ కంతేటి వెంకటరాజు, ఫోరం ఫర్ బెటర్ ఏపీ రాష్ట్ర కన్వీనర్ ఆరేటి ప్రకాష్, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్, తాడేపల్లిగూడెం కి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఈతకోట తాతాజీ ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పిచ్చుకలంకలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం.

అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే బండారు.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ఆత్రేయపురం మండలం పిచ్చుకలంకలో ఈ నెల 13వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. సీఎం పర్యటన సందర్భంగా చేపట్టనున్న పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సంబంధిత శాఖల అధికారులతో కలిసి శుక్రవారం పిచ్చుకలంక ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సభా వేదిక, పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, పిచ్చుకలంకలో చేపట్టనున్న అభివృద్ధి పనులు ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టింది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# అధికారులు ఇంటి పైన పడ్డ చింత చెట్టుకొమ్మలు తొలగించారు





ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.

శ్రీరామగిరి గ్రామం వద్ద ఇటీవల గాలివాన బీభత్సం సృష్టించి చింతచెట్టు కొమ్మలు విరిగి వేలాడుతూ ఉన్న కొమ్మలను తొలగించాలని, వివిధ పత్రికల్లో వార్తలు రావటంతో స్పందించిన అధికారులు శ్రీరామగిరి గ్రామానికి చెందిన వల్లి సుందరం ఇంటి పైన విరిగి వేలాడుతున్న చెట్టు కొమ్మలను చెట్టును ఎంపీడీవో ఇమ్మానియేలు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రవితేజ శ్రీరామగిరి మాజీ ఉపసర్పంచ్ గుండెపూడి లక్ష్మణరావు ప్రత్యేక చొరవతో గురువారం చెట్టు కొమ్మలను సిబ్బందితో తొలగించారు. అయితే కొన్ని కొమ్మలు ఇంటిపై పడడంతో ఇంటి పై కప్పు రేకులు ధ్వంసం అయ్యాయి. అదే ముందుగానే కొమ్మలు తొలగించి ఉంటే ఇంటి రేకులు పగిలేయి కావని బాధితుడు వాపోయాడు. చెట్టును తొలగించడంలో జాప్యం జరిగినప్పటికీ పూర్తిగా ప్రమాదంగా ఉన్నటువంటి అన్ని కొమ్మలను తొలగించినటువంటి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఇమ్మానియేల్ ను వారి కృషిని వారి సిబ్బందినీ గ్రామస్తులు, బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

# పూర్వ విద్యార్థుల సేవాభావంతో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన శోభ

రూ.2.75 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసి విగ్రహాల ఆవిష్కరణ



ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

"ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం అభినందనీయం. వారు అందిస్తున్న సహకారం ప్రభుత్వ విద్య బలోపేతానికి తోడ్పడటమే కాకుండా, ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుంది" అని మండల విద్యాశాఖ అధికారి టి. ఆనంద్ కుమార్ అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1995--96 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.2.75 లక్షలు వెచ్చించి పలు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంట కోసం రూ.25 వేల వ్యయంతో గ్యాస్ కనెక్షన్ ఏర్పాటు చేయగా, పాఠశాల ప్రాంగణంలో రూ.1.25 లక్షలతో సరస్వతి దేవి, మహాత్మా గాంధీ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలను శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే ఉపాధ్యాయుల వినియోగార్థం రూ.1.25 లక్షల వ్యయంతో 20 డ్యూయల్ డెస్క్‌లను అందజేశారు. పూర్వ విద్యార్థి పలగాని రామకృష్ణ పాఠశాలకు 50 కుర్చీలను విరాళంగా అందించారు. ప్రధానోపాధ్యాయురాలు పులి పుష్పలత మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు అందించిన సహకారం పాఠశాల అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తుందని, వారి సేవాస్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం నిర్వహించిన సభలో పూర్వ విద్యార్థులు ఎస్.కే. ఇలియాస్, బొగ్గవరపు రమేష్, పలగాని రాంబాబు, యండూరు ప్రసన్న, పోలుకొండ నాగరాజు, పీబీఎన్ ప్రసాద్, బి. శ్రీను, సంగా శివరామకృష్ణ, వులాస నాగరాజులను దుశ్శాలువాలతో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సేవాభా వాన్ని ప్రోత్సహించడంలో విశేష కృషి చేసిన సీనియర్ ఉపాధ్యాయుడు ఎస్.కే. అబ్దుల్ సలీంను ప్రధానోపాధ్యాయురాలు సహ ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు అభినందించారు ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయ ఇతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు



# వర్షాకాలం లో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి రక్షణ కవచాలు అందించిన జిల్లా ఎస్పీ



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.** ఏలూరు జిల్లా పోలీసు సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో వారికి తోడ్పాటు అందించే లక్ష్యంతో, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో సిబ్బందికి రక్షణ కవచాలు ఏలూరు జిల్లా ఎస్పీ చొరవ ఏలూరు ట్రాఫిక్ విభాగం, రోడ్ సేఫ్టీ మొబైల్ టీం, 'ఈ-బీట్' సిబ్బంది తమ విధుల నిర్వహణలో భాగంగా ఎండ, వానలను లెక్కచేయకుండా నిరంతరం శ్రమిస్తున్నారు. వారి ఆరోగ్యాన్ని , భద్రతను దృష్టిలో ఉంచుకుని, వర్షాకాలానికి అవసరమైన రక్షణ సామాగ్రిని ఎస్పీ నేడు సిబ్బందికి అందజేశారు. మొత్తం 162 మంది పోలీసు సిబ్బందికి రూ. 2,75,000 రూ' విలువైన ఈ క్రింది సామగ్రిని పంపిణీ చేశారు. రైన్ కోట్లు, 650, బ్యాగులు,300, క్యాపులు, 130,కళ్ళజోళ్ళు,250, వాటర్ బాటిల్స్,250 రేడియం జాకెట్స్,250,ఫేస్ మాస్కులు, 200,రోడ్ సేఫ్టీ మొబైల్ వాహనంలో విధులు నిర్వహించే సిబ్బందికి మరింత భద్రత కోసం సోలార్ బ్యాటన్లు, కాషనరీ వర్కింగ్ టేపులు, ట్రాఫిక్ కోన్లను కూడా ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి మా ప్రాధాన్యత మొదటిది. కఠినమైన వాతావరణ పరిస్థితుల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది ఆరోగ్యం మాకు ముఖ్యం అని పేర్కొన్నారు. పోలీసుల కష్టాల్లో శాఖా పరంగా వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం కూడా అంతే ముఖ్యమని ఆయన అన్నారు. ఇటువంటి సౌకర్యాలు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని, వారు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడతాయని ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది, తమ సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఏఎస్పి ఆర్ సుస్మిత, ఏలూరు ఎస్పీ అడ్మిన్ వై ప్రసాద్ రావు, ఏలూరు డిఎస్పి రెడ్డి శ్రావణ్ కుమార్, ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ అఖిల్ జమా,ఏ ఆర్ ఆర్ ఐ లు పవన్ కుమార్, సతీష్ , ఏలూరు జిల్లా ట్రాఫిక్ బ్యూరో ఎస్ఐ రాంబాబు, ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళా ఎస్సై కాంతిప్రియ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్, పాలకొల్లు నోటు పుస్తకాల పంపిణీ




**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

ఎలమంచిలి మండలం కాజ జిల్లాపరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మరియు ఆర్యపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 13 వేల రూపాయల విలువైన నోటు పుస్తకాలను వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాజ జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల లో జరిగిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్ అధ్యక్షత వహించి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి వాకర్స్ క్లబ్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు ఉపాధ్యాయులు మండపాక రాంబాబు, కంచ వినాయక్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు జ్ఞాపికలు మరియు విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

## గ్రామాభివృద్ధికి జీపీడీపీ సమర్ధ అమలు కీలకం



**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో అబ్దుల్ సలాం అధ్యక్షతన జీపీడీపీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ పరిపాలన అధికారులు పాల్గొన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి తమ గ్రామంలో బిపీడీపీని సమర్థంగా నిర్వహించి, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో చురుకుగా భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో సూచించారు.

## కళాశాలే వ్యక్తిత్వ వికాసానికి తొలి వేదిక



**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

తోటపల్లిలోని హీల్ స్కూల్‌లో తొలి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో విజయవాడ ఎన్.ఎస్.ఎం. పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాయపరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో సమాజ విలువలు అలవర్చుకుని జీవిత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనంతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి తాతినేని లక్ష్మి, ప్రిన్సిపాల్ కె. కవిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం. హరీష్ పాల్గొనగా, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## డెంటల్ సర్జరీలో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి, గోల్డ్ మెడల్ సాధించిన కావూరి జ్యోత్స్న




**ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం**

మండలంలోని కొమ్ముగూడెంకు చెందిన కావూరి జ్యోత్స్న మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీలో గోల్డ్ మెడల్ సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది. జ్యోత్స్న వరంగల్ లోని కాళోజి నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ లో విద్యనభ్యసించి, యూనివర్సిటీ టాపర్ గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. జ్యోత్స్న తండ్రి కావూరి జాన్ కుమార్ ఏజెన్సీలోని పలు పాఠశాలలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి, ప్రస్తుతం కొమ్ముగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గోల్డ్ మెడల్ సాధించిన జ్యోత్స్న మాట్లాడుతూ తన తల్లితండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సహకారంతో తాను ఈ విజయాన్ని సాధించినట్లు చెప్పారు.




# వాహనదారులు ఏలూరును శబ్దరహితంగా ఉండేందుకు సహకరించాలి

- **రోడ్డు భద్రత తదితర అంశాలపై మెకానిక్‌లతో సమావేశం.**
- **ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు.**



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.** ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్, యొక్క ఆదేశాలపై ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ రావు ట్రాఫిక్ నియంత్రణ రోడ్డు భద్రతపై ట్రాఫిక్ నిబంధనల అమలు మెకానిక్‌లతో కౌన్సెలింగ్, అవగాహన ను నిర్వహించారు. ఏలూరు పట్టణంలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు, రోడ్డు భద్రతను పెంపొందించేందుకు ఏలూరు పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. ఏలూరు లోని కౌన్సెలింగ్ సెంటర్ పోలీస్ డార్మెటరీలో ద్విచక్ర వాహనాల మెకానిక్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెకానిక్‌లు వాహనాల ఇంజిన్ సామర్థ్యాన్ని మార్చడం , శబ్ద కాలుష్యానికి కారణమయ్యే మోడిఫైడ్ సైలెన్సర్లను అమర్చకూడదని, అట్లు అమర్చినచో వాహనదారుతో పాటు అమర్చిన వారి పైన కూడా తగిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే, అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల తయారీ సంస్థల నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. చాపలతుమ్ము సెంటర్‌లోని సర్వాణి స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు దాటే పద్ధతులు , వాహనం నడిపే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చిన్న వయస్సు నుండే ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలను నివారించవచ్చని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా ఈ విషయాలను తెలియజేయాలని కోరారు. నిబంధనలు పాటించడం సురక్షిత ప్రయాణం" అనే నినాదంతో ఏలూరు పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమాలు స్థానికుల నుండి మంచి స్పందన కలిగింది. మెకానిక్‌లు, విద్యార్థులు పోలీసుల సూచనలను పాటిస్తామని హామీ ఇచ్చారు.

నగరంలో శాంతియుత మరియు సురక్షితమైన ట్రాఫిక్ వ్యవస్థను రూపొందించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు తెలియచేసినారు.

# పారదర్శకంగా ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నూజివీడు సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌వోలు) చేపడుతున్న ఇంటింటి పరిశీలనలో రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఓటరు జాబితాలో గైర్హాజరైన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన ఓటర్ల వివరాలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గుర్తించి ధృవీకరించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎన్నికల నమోదు అధికారులు, మండల తహశీల్దార్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## మా బిడ్డలను మా పాఠశాలకు తిరిగి తీసుకురండి : గిరిజనుల వినతి.



**ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయిగూడెం.** మండలంలోని రెడ్డి కోపల్లె, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హేతుబద్ధీకరణ నియమాల కారణంగా 8,,9, 10 తరగతులను రద్దు చేశారు. పాఠశాలలో 8,9,10 తరగతులు కొనసాగించాలని కోరుతూ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 28 రోజులపాటు ఆందోళన నిర్వహించడం పాఠకులకు విధితమే. ఈ నేపథ్యంలో విద్యార్థులకు టీసీలు ఇవ్వవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు కోరినప్పటికీ, రెడ్డి కోపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ పర్మిషన్ ఇచ్చిన రోజునే సుమారు 30 మంది బాలికలకు టీసీలు ఇచ్చి కామయ్య కుంట పాఠశాలకు పంపించారు. కాగా తమ పాఠశాల కోసం గ్రామస్తులు చేసిన ఆందోళన ఫలించి, రెడ్డి కోపల్లె పాఠశాలలో తిరిగి 8, 9, 10 తరగతుల కొనసాగింపుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రెడ్డి కోపల్లె పాఠశాలలో టీసీ లిచ్చి కామయకుంటలో చేర్పించిన తమ బిడ్డలను తిరిగి రెడ్డికోపల్లి స్కూల్లో వెంటనే చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందించారు.

# అగ్నిప్రమాద ఇళ్లకు ఆర్థిక సహాయం

## సావిత్రమ్మ, స్వాతి కుటుంబాలకు ఆర్థిక భరోసా



**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

ఇటీవల విద్యుత్ షాక్ సర్క్యూట్ తో పూర్తిగా ద్వంసం అయినఇళ్లకు గతంలో మంత్రి ఇచ్చిన మాటమేరకు ఒక్కొక్క ఇంటికి రూ. 5వేలు చొప్పున ఇరువురికి తమ సొంత నగదు రూ.10 వేలు అందజేసినరాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తమ సిబ్బంది గణేష్ మరియు నాయకుల చేతులతో అందజేశారు. నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో ఈడే, సావిత్రమ్మ, మరియు నూజివీడు పట్టణం గొడుగువారి గూడెంలో టి, స్వాతి నివసించే ఇళ్ళు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను సందర్శించి వాటి వివరాలను తెలుసుకొని కుటుంబ యోగ క్షేమాలు తెలుసుకొని ఆర్థిక సహాయం చేసిన మంత్రివర్యులకు బాధితులు తమ కృతజ్ఞతలు హర్షాన్ని వ్యక్తం చేశారు. తోపుడు బండ్లపై ఇడ్లీ వ్యాపారం, చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న సావిత్రమ్మ కుటుంబ బాధితులకు కావలసిన నిత్యవసర సరుకులు మరియు ప్రభుత్వం నుండి వచ్చే వివిధ పథకాలు ఇతర సదుపాయాలు వెంటనే అందజేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశించిన మంత్రివర్యులు. బాధిత కుటుంబాలు ఇళ్లు నిర్మించుకోవడానికి ఆశక్తి కల్గిన వారికి వెంటనే ఇల్లు మంజూరు చేసి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పి, సత్యన్నారాయణ, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్, వేణు,వై, శ్రీనివాస్, నూజివీడు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎమ్, జగదీష్, వెంకయ్య, పూర్ణచంద్రరావు, సోషల్ మీడియాలో కోఆర్డినేటర్ జ్యోతి,గ్రామ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా మల్లేశ్వరునికి విశేష పూజలు



**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

బహుళ ఏకాదశి సందర్భంగా శుక్రవారం శ్రీ శోభనాచల గట్టుపై బ్రహ్మసూత్ర సహిత దుర్గాపార్వతి సమేత మల్లికార్జున స్వామివారికి, బస్టాండ్ సమీపంలోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక అభిషేకాలు, పంచామృత స్నపనం, అలంకరణ, సహస్రనామార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు దేవులపల్లి శ్రీనివాసమూర్తి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే వరాహ పుష్కరిణి సమీపంలోని స్వయంభు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కూడా విశేష పూజలు నిర్వహించగా, కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సి. హెచ్. సాయి పర్యవేక్షించారు.

# రైతులు పసల్ బీమా యోజన పథకం ఉపయోగించుకోవాలి



**ప్రజాభూమి ప్రతినిధి-చాట్రాయి**

రైతులు ఎల్ నీనో ప్రభావం వలన కలిగే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంట రకాలను స్వల్పకాలిక రకాలు పంట రకాలను ఎంచుకోవలెనెను. తక్కువ నీటితో పండే పంటలు సూక్ష్మ నీటిసాగు పద్ధతులను పాటిస్తూ వర్షపు నీటిని నిల్వ చేసేలా ఫార్మ్ పాండ్లను ఏర్పరుచుకోవాలి. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల తేమను నిల్వ ఉంచాలి.రైతులు "ఫసల్ బీమా యోజన ఖరీఫ్ 2026 సంవత్సరముకు గాను పథకాన్ని వినియోగించుకోవలేను. రైతులు కట్టుటకు వరి పంటకు ఒక ఎకరానికి 840/- గాను చివరి తేదీ ఆగస్టు 15/08/2026 వరకు, మినుము పంటకు ఒక ఎకరానికి 300/- రూపాయలు చివరి తేదీ 31/07/2026, లాంబార్డుకి పంట విస్తీర్ణం పంటకు సంబంధించిన సర్టిఫికెట్ తో అప్లై చేసుకోవలెను. ఈ ప్రక్రియ కామన్ సర్వీస్ సెంటర్లు ద్వారా మీసేవ ద్వారా చేసుకోవచ్చును. ప్రత్తి పంటకు ఒక ఎకరానికి 1900/- రూపాయలు, నిమ్మ పంటకు ఒక ఎకరానికి 2500 /-రూపాయలు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీకి 15/07/2026 చివరి తేదీగా ఇవ్వబడినది. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని మండల వ్యవసాయ శాఖ అధికారి బి. శివ శంకర్ తెలిపారు.

## సీజనల్ వ్యాధులను నేపథ్యంలో అప్రమత్తమైన వైద్యఆరోగ్య శాఖ




**ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.**

పశ్చిమ ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో వర్షాల కారణంగా జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక రంగనాయకమ్మ కాలనీలో ప్రభుత్వ యునాని, జనరల్ వైద్య నిపుణులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ జి.ప్రియదర్శిని, నందాపురం ప్రాథమిక వైద్యశాల డాక్టర్ నవ్య , వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ఈ వైద్య శిబిరంలో రోగులకు పరీక్షల నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. రోగులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందారు.

## వీల్ చైర్ విరాళంగా అందజేత

**ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు**

అంగవైకల్యంతో బాధపడుతున్న అబాగ్యుడికి వీల్ చైర్ ని అందించారు. నూజివీడు మండలంలోని హటియాతండాకి చెందిన లావురి నాగులు కుమారుడు రాము నడవలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఓగిరాలతండా గ్రామంలో ఆలూరి సితారామరాజు చార్టిబుల్ ట్రస్ట్ చైర్మన్ బాణావతు రవి నాయక్ వారికీ ఒక విల్ చైర్ ని శుక్రవారం అందజేశారు. వీల్ చైర్ అందజెయ్యడంతో కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించారు. గ్రామ పెద్దలు బి సోనియా బి నాగు మంగణ శంకర్ గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.